


మార్కాపురం పట్టణం (వ్యూ)

మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటవుతుందా? నిరీక్షణకు తెరపడుతుందా.. పశ్చిమప్రాంత ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందా..? ఈ ప్రశ్నలకు త్వరలోనే సమాధానం లభించే అవకాశం వచ్చింది. గతంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబునాయుడు పలుమార్లు ఇందుకు సంబంధించి గట్టి హామీలు ఇచ్చారు. అయితే ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా కార్యరూపం దాల్చలేదు. స్థానికంగా అధికారపార్టీ నేతలు పదేపదే చెప్పడం తప్ప అసలు ప్రభుత్వంలో ప్రత్యేక జిల్లాపై దృష్టి ఉందా? అన్న అనుమానాలు మొదలయ్యాయి. అయితే ఇటీవల ప్రభుత్వం ఇలాంటి అంశాలపై దృష్టిపెట్టి చేపడుతున్న చర్యలు మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ఆశలు రేకెత్తిస్తున్నాయి. తాజాగా బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఇలాంటి అంశాలపై చర్చ జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా ప్రతిపాదనలపై నియమించిన కమిటీని నెల రోజులలోపు నివేదిక ఇవ్వాలని కేబినెట్ సూచించింది.

ఆకాంక్ష నెరవేరేనా!?

మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ఆశలు

- ప్రతి సందర్భంలోనూ ఘంటాపథంగా చెప్తున్న టీడీపీ నేతలు
- నెలన్నర క్రితం ఈతరహా అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు
- నెలలోపు ప్రతిపాదనలు ఇవ్వాలని తాజా కేబినెట్ భేటీలో నిర్ణయం

ఒంగోలు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది జనగణన జరగనుంది. అది ప్రారంభమైతే ఆ సమయంలో పంచాయతీ నుంచి జిల్లాల వరకు సరిహద్దుల మార్పు సాధ్యం కాదు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజన చేయాలని కేంద్రం నిర్ణయిస్తే ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు కొత్త జిల్లాల ఏర్పాటుకు అవకాశం ఉండదు. అంటే ఈ ఏడాది డిసెంబరులోపే జిల్లాల ఏర్పాటు ప్రక్రియను పూర్తిచేయాలి. ఈ విషయాన్ని రాష్ట్రప్రభుత్వ పెద్దలు గుర్తించి నెలలో మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనలు ఇవ్వాలని బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో చర్చ సందర్భంగా చెప్పినట్లు తెలుస్తోంది. వాస్తవానికి వైసీపీ ప్రభుత్వంలో కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు జరగాల్సింది. దశాబ్దాల కాలంగా పశ్చిమప్రాంత ప్రజలు మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు కోరుతున్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న ఒంగోలుకు పశ్చిమప్రాంతంలోని మార్కాపురం డివిజన్‌లో ఉన్న ప్రాంతాల నుంచి రావాలంటే 100 నుంచి 150 కి.మీ ప్రయాణించాలి. జిల్లా అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి పథకాల అమలును పర్యవేక్షించాలన్నా ఒక రోజులో వెళ్లి వచ్చే అవకాశం లేదు. విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, సాగునీరు ఇతరత్రా రంగాల్లోనూ ఆ ప్రాంతం పూర్తిగా వెనుకబడి ఉంది. మార్కాపురం కేంద్రంగా మార్కాపురం, గిద్దలూరు, వైపాలెం, కనిగిరి, దర్శి నియోజకవర్గాలు కలిపి

మిగతా 6వ పేజీలో

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదారు నెలల్లోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు హామీ నెరవేరుతుందని ప్రజలు ఆశించారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, పశ్చిమప్రాంత టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు ఎప్పటికప్పుడు జిల్లా ఏర్పాటు తథ్యమని గట్టిగా చెబుతూనే వస్తున్నారు. అయితే ఏడాది దాటినా కొలిక్కి

ప్రజల్లో పెరిగిన నమ్మకం

రాకపోవడంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నెలన్నర క్రితం రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా ప్రతిపాదనల పరిశీలనకు ఏడుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయడం కొంత నమ్మకాన్ని పెంచింది. తాజాగా బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగి సదరు కమిటీ నివేదికను నెలలో ఇవ్వాలని సూచించడం మరింత నమ్మకాన్ని పెంచింది.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కసరత్తు
- ఎంపిక చేసిన 250 పంచాయతీల్లో ఐవీఆర్‌ఎస్ సర్వే
- నిరంతరం అధికారుల పర్యటనలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా జిల్లాలో 250 గ్రామాలను ఎంపిక చేసి వాటిలో నిరంతర పర్యవేక్షణకు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్‌ఎస్) ద్వారా సర్వేకు సిద్ధమైంది. ఈ విధానంలో ఎంపిక చేసిన గ్రామాల్లో కంప్యూటర్ ద్వారా రెండు ప్రశ్నలకు ప్రజల నుంచి సమాధానాలు రాబడతారు. ప్రధానంగా మీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా? అని అడిగి సక్రమంగా జరగకపోతే అందుకు గల కారణాలను తెలుసుకొని తదనుగుణంగా చర్యలు తీసుకుంటారు. మరో ప్రశ్నగా వారానికి కనీసం రెండు సార్లయినా మీ ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నారా? అని అడిగి తెలుసుకుంటారు. ఇలా ఐవీఆర్‌ఎస్ ద్వారా ప్రజల నుంచి వచ్చే సమాధానాలను బట్టి సంబంధిత అధికారులకు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి సూచనలు ఇస్తారు.

అధికారుల నిరంతర పర్యవేక్షణ

జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈవోలు నిరంతరం పర్యవేక్షించడంతోపాటు మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం ఎనిమిది గంటలలోపు ఎంపిక చేసిన గ్రామాలను పరిశీలించాల్సి

మిగతా 6వ పేజీలో


ముండ్లమూరు మండలం కెల్లంపల్లిలో చెత్తసేకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా (ఫైల్)



రొయ్యకు ట్రంప్ దెబ్బ

- గణనీయంగా పడిపోయిన ధరలు
- ఇంకా దిగజారుతాయన్న భయంలో రైతులు
- అమెరికా ఆంక్షలతో సంకట స్థితిలో ఆక్వా రంగం

ఒంగోలు నగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో జిల్లాలోని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ దేశ ఆంక్షలతో ఇప్పటికే ఇక్కడ రొయ్యల ధరలు దిగజారిపోయాయి. రెండు మూడు రోజుల వ్యవధిలోనే కిలోకు రూ.30 తగ్గించి వ్యాపారులు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు. ట్రంప్ సుంకాల దెబ్బతో ఇంకా ధరలు పడిపోతాయనే భయంతో రైతులు చెరువులను హార్వెస్టింగ్ చేస్తున్నారు. జిల్లాలో 15వేల ఎకరాల్లో వెనామీ, టైగర్ రకం రొయ్యల సాగు జరుగుతోంది. ఇవి అమెరికాకు కూడా ఎగుమతి అవుతాయి. మన దేశం నుంచి అక్కడికి వెళ్లే ఉత్పత్తులపై ట్రంప్ 25శాతం సుంకం విధిస్తున్నట్లు ఇటీవల ఒక ప్రకటన చేశారు. ఆ ప్రభావంతో ధరలు తగ్గుముఖం పడుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గత వారంలోనే

మిగతా 6వ పేజీలో

కట్టను కొల్లగొట్టి..!


వైసీపీ నాయకుడి స్థలంలో పరిచిన గ్రావెల్

- గుండ్లకమ్మ ఎడమకాలువ కట్ట గ్రావెల్ తరలించుకుపోతున్న వైసీపీ నాయకుడు
- పట్టించుకోని అధికారులు.. ఆందోళనలో రైతులు


గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎడమ కాలువ కట్టను ఉప్పుగుండూరుకు చెందిన వైసీపీ నాయకుడు కొల్లగొడుతున్నాడు. అర్ధరాత్రి వేళ యంత్రాలను ఉపయోగించి ఇష్టారీతిన తరలిస్తున్నాడు. తన స్థలంలో మెరకకు దాన్ని వినియోగిస్తుండటం చూసి ప్రజలు విస్తుపోతున్నారు. అతని దెబ్బకు కట్ట కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో, నీటి ఉధృతి పెరిగిన సమయంలో కాలువలోని నీరు పొలాల్లోకి చేరి పంటలు దెబ్బతినే ప్రమాదముంది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నాగులుప్పలపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ.. ప్రాజెక్టు వద్ద నుంచి మండల పరిధిలోని కండ్లగుంట మీదుగా కొరిశపాడు మండలం రెడ్డిపాలెంతోపాటు అటువైపు గ్రామాల వరకు ఉంది. నాగులుప్పలపాడు-ఇంకొల్లు పాత మద్రాసు రహదారిలోని ఒమ్మెవరం బస్ షెల్టర్ వెనుక ఉన్న ఎడమ కాలువ కట్ట గ్రావెల్‌ను ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు తవ్వేస్తున్నాడు. దాన్ని 216 జాతీయ రహదారి పక్కన మాచవరం రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోలు బంక్ మెరక కోసం తరలిస్తున్నాడు. రాత్రిళ్లు ఎక్స్‌కవేటర్‌తో కట్టను తవ్వి ట్రాక్టర్లతో వందల ట్రిప్పులు తోలుతున్నాడు. ఆ స్థలం సదరు వైసీపీ నాయకుడిది కావడం గమనార్హం. దీంతో కట్ట కరిగిపోయి భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువను పర్యవేక్షించే లస్కర్ నాగార్జునరెడ్డి తొలుత గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లతోపాటు, ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకొని ఆపై వదిలేయడం చూసి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కట్టల గ్రావెల్ తరలించుకుపోతున్న వారిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా గ్రావెల్ తరలింపు విషయం తన దృష్టికి రాలేదన్నారు.


ఆనవాళ్లు కోల్పోయిన గుండ్లకమ్మ కాలువ కట్ట

రామతీర్థంకు జలకళ

- 1,125 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- గరిష్ఠ మట్టంకు మరో రెండు మీటర్లు
- నేడు దిగువకు జలాలు విడుదల


నిండుకుండలా ఉన్న రామతీర్థం రిజర్వాయర్

చీమకుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా నిరాటంకంగా చేరుతున్న సాగర్ జలాలతో రామతీర్థం రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 85 మీటర్లు కాగా.. ప్రస్తుతం 83 మీటర్లకు చేరుకొంది. మరో రెండు మీటర్లు చేరితే నిండుతుంది. బుధవారం రిజర్వాయర్‌కు 1,125 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వస్తోంది. ఇదేవిధంగా మరో నాలుగు రోజులు ఖాయంగా సాగర్ జలాలు వస్తాయని నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎక్కువ జలాలను వినియోగించుకునే ఉద్దేశంతో దిగువకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. ఇది రైతులకు సంతోషకరమైన విషయం కాగా, ఆయకట్టు కింద ఖరీఫ్ సాగు ఊపందుకోనుంది.

కంప్యూటర్ టీచర్‌కు 20 ఏళ్ల జైలు

- బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు నిర్ధారణ
- శిక్ష విధించిన పోక్సో కోర్టు న్యాయాధికారి

7

గుర్తుతెలియని యువకుడి హత్య?

- ఒంగోలు శివారులోని చెరువులో తేలిన మృతదేహం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసరావు

6

సెల్ఫ్ అసెస్‌మెంట్-1 పరీక్షల షెడ్యూల్ విడుదల
- 11 నుంచి 14 వరకు నిర్వహణ

వివరాలు 7వ పేజీలో



కొండపికి సాగర్ నీరు

- నియోజకవర్గంలో తాగు, సాగు కోసం 0.60 టీఎంసీలు
- మంత్రి స్వామి విజ్ఞప్తితో ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గంలో ప్రత్యేకించి ముసి నది పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో తాగు, సాగునీటికి కొంత ఊరట కలగనుంది. వర్షాధారమే ఆ ప్రాంతంలో సాగు, తాగునీటి వనరు కాగా ఏటా సరైన వర్షాలు లేక పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యామ్నాయంగా సాగర్ నీటిని ఒంగోలు బ్రాంచి కాలువ నుంచి ముసి నదికి ఇవ్వడం ద్వారా తన నియోజకవర్గంలోని వాగు పరివాహక ప్రాంత ప్రజలు తాగునీటి ఇక్కట్ల నుంచి ఉపశమనం కల్పించాలని కోరారు. ఆయన వినతిపై

మిగతా 6వ పేజీలో


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు స్వాగతం పలుకుతున్న కల్యాణ్‌చక్రవర్తి, దినకర్ తదితరులు

కదిలిన బీజేపీ

నేడు నగరంలో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన

- వివిధ కార్యక్రమాలు.. భారీ ఏర్పాట్లు
- ఒంగోలు చేరిన ఆయనకు ఘన స్వాగతం పలికిన కమలదళం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లాలోని బీజేపీ నేతలు, కార్యకర్తల్లో అనూహ్యమైన కదలిక కనిపిస్తోంది. ఒకరికొకరు పోటీపడి పార్టీ రాష్ట్ర కొత్త అధ్యక్షుడి పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు మాధవ్ కూడా ఇలా వచ్చారు.. అలా వెళ్లారు అన్నట్లు కాకుండా రోజంతా ఒంగోలులోనే ఉండి ఇటు పార్టీ శ్రేణులతోపాటు అటు ప్రజల్లో కలిసే వినూత్న కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వీవీఎన్ మాధవ్ జిల్లాల పర్యటనలకు శ్రీకారం పలికారు. అందులో భాగంగా

మిగతా 6వ పేజీలో

ఆకాంక్ష నెరవేరేనా!?

(5వ పేజీ తరువాయి)

జిల్లా ఏర్పాటు చేయాలన్న ఆకాంక్ష ప్రజల్లో ఉంది. ఇదే డిమాండ్‌తో పలు సందర్భాల్లో ఆందోళనలు కూడా జరిగాయి. అయితే ప్రజల ఆకాంక్షలను ఏమాత్రం పట్టించుకోకుండా గత వైసీపీ ప్రభుత్వం ఒంగోలుకు సుదూరంగా ఉండే పశ్చిమప్రాంతాన్ని ప్రకాశం జిల్లాలోనే ఉంచి ఇక్కడికి 35 నుంచి 45 కిలోమీటర్లలోపు ఉండే అద్దంకి, కందుకూరులను బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో కలిపింది. హేతుబద్ధంగా లేకుండా చేసిన విభజనపై అన్ని ప్రాంతాల ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. వారి ఆకాంక్షను అప్పట్లోనే తెలుగుదేశం పార్టీ గుర్తించింది. గత ఎన్నికలకు ముందు పలు సందర్భాల్లో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, యువనేత లోకేష్‌లు మార్కాపురం కేంద్రంగా పశ్చిమప్రాంతాన్ని కొత్త జిల్లాగా అలాగే కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను తిరిగి ఒంగోలు కేంద్రంగా ఉండే జిల్లాలో కలిపేందుకు హామీ ఇచ్చారు.

మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

వచ్చే ఏడాది జనగణన ప్రారంభం కానుండటంతో ఆ లోపే జిల్లా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అందుకోసం నెలలో మంత్రివర్గ ఉపసంఘం నుంచి నివేదికను ప్రభుత్వం కోరిందని అధికార పార్టీ వర్గాల సమాచారం. కాగా మార్కాపురం జిల్లా ఏర్పాటు ప్రజల ఆకాంక్ష అన్న విషయాన్ని టీడీపీ గుర్తించిందని, అందుకు అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని జిల్లా మంత్రి డాక్టర్ స్వామి చెప్పారు. నిజానికి ఈ పాటికే ఆ హామీ అమలు జరిగేదని, అయితే రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామపంచాయతీల హద్దులు, మార్పులపై ప్రభుత్వానికి అనేక వినతులు అందుతుండటంతో పరిశీలనకు ఉపసంఘం ఏర్పాటు చేసిందన్నారు. త్వరితగతిన ఆ కమిటీ నివేదికను ప్రభుత్వం కోరిందన్నారు.

కొండపికి సాగర్ నీరు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఓబీసీపై రామతీర్థం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వెలుగువారిపాలెం సమీపంలో ఉన్న 23.17 కి.మీ వద్ద ఎస్కేప్ నుంచి ముసికి 0.60 టీఎంసీల నీరు ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. రామతీర్థం రిజర్వాయర్ నిండి ఒంగోలు బ్రాంచి కాలువలో నీరు సరఫరా బాగా ఉన్న సమయంలో ఈ నీటిని ముసికి వదలాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. తగు చర్యలు తీసుకోవాలని ఒంగోలులోని ప్రాజెక్టు సీఈని ఆదేశించారు.

గుర్తుతెలియని యువకుడి హత్య?

● ఒంగోలు శివారులోని చెరువులో తేలిన మృతదేహం ● ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని శివారు ప్రాంతమైన అగ్రహారం సమీపంలోని రంగసాయికుంటలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం వెలుగుచూసింది. బుధవారం సాయంత్రం పోలీసులు దానిని బయటకు తీశారు. అయితే మృతదేహంపై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో యువకుడిని ఎక్కడో హత్య చేసి ఇక్కడి చెరువులో పడవేసినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. శరీరం అంతా కుళ్లిపోయి నీటిపై తేలడంతో పొలం పనులు చేసుకునే వారు ఇచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, తాలుకా సీఐ విజయకృష్ణ తమ సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

అదృశ్యమైన యువకుడు అతనేనా..?

గత నెల 27న నెల్లూరు జిల్లా బోగోలు మండలం చెన్నరాయునిపాలెంనకు చెందిన ధన్యాశి నవీన్ (25) అదృశ్యమయ్యాడు. ఈమేరకు కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 5న కేసు నమోదైంది. నవీన్‌కు కొత్తపట్నం మండలానికి చెందిన ఓ యువతితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆమె కోసం ఇప్పటికే పలుమార్లు ఆ గ్రామానికి వచ్చి ఆమె గురించి వాకాబు చేశాడు. అదేవిధంగా గత నెల 27న మోటార్‌సైకిల్‌పై వచ్చి ఇక్కడి యువతి గురించి వాకబు చేస్తుండగా ఆమె బంధువులు నవీన్‌ను చితకబాదారు. అప్పటి నుంచి నవీన్ కనిపించడం లేదు. దీంతో నవీన్ మోటార్‌సైకిల్, బ్యాగ్‌ను ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అదేక్రమంలో నవీన్ తల్లి ఈనెల 5న కొత్తపట్నం వచ్చి తన కుమారుడు గత నెల 27న వచ్చి ఇప్పటి వరకు తిరిగి ఇంటికి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీంతో కేసు నమోదు చేశారు. అయితే ఒంగోలు శివారులోని రంగసాయికుంటలో యువకుడి మృతదేహాన్ని బుధవారం గుర్తించడంతో పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నవీన్‌ను హత్యచేసి కుంటలో పడవేసారా అనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే యువతి బంధువులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే నవీన్ బంధువులను గురువారం ఒంగోలుకు రావాలని పోలీసులు కోరారు. వారు వచ్చి మృతదేహాన్ని గుర్తిస్తే కొన్ని నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

పీడీసీసీ బ్యాంకుకు ఉత్తమ ప్రతిభా పురస్కారం

● చైర్మన్ డాక్టర్ సీతారామయ్యకు సత్కారం

ఒంగోలు విద్య, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ పనితీరు చూపినందుకు, వ్యాపార లావాదేవీలను గణనీయంగా పెంచినందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(పీడీసీసీ)కు ఉత్తమ ప్రతిభా అవార్డు లభించింది. బ్యాంకు సేవలకు గుర్తింపుగా బ్యాంకు పీడీసీ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను సత్కరించారు. విజయవాడలో బుధవారం జరిగిన ఆప్కాబ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జిల్లాకు ఈ అరుదైన గౌరవం లభించింది. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన డీసీసీబీలు, సొసైటీలను ఎంపిక చేసి ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సౌత్ జోన్‌లో మెరుగైన పనితీరుతో ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. 2025 మార్చి ఆఖరుకు పీడీసీసీ బ్యాంకు రూ.3434 కోట్ల వ్యాపారం చేసింది. ఈ మొత్తంలో రూ.866 కోట్లు డిపాజిట్లు కాగా రూ.2568 కోట్ల రుణాలు పంపిణీ చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో బ్యాంకుకు ఉత్తమ ప్రతిభా అవార్డుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖలమంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ గ్రంధి వీరాంజనేయులు చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా అవార్డును బ్యాంకు చైర్మన్ డాక్టర్ సీతారామయ్యకు అందజేశారు. అనంతరం డాక్టర్ సీతారామయ్యను శాలువ, మెమెంటోతోను సత్కరించారు. డీసీసీబీలు, సొసైటీలను పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణ చేసి రైతులకు, ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని, అందుకోసం కార్యాచరణను రూపొందించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. బ్యాంకు సీఈవో ప్రకాష్ కూడా మెమెంటోను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకారశాఖ కమిషనర్ ఏ.బాబు, 13 జిల్లాల డీసీసీబీల చైర్మన్లు ఉన్నారు.



సీతారామయ్యను సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఆరు సొసైటీలకు ప్రతిభా అవార్డులు

జిల్లాలోని ఆరు సొసైటీలకు ఉత్తమ ప్రతిభా అవార్డులను ఈ కార్యక్రమంలో అందజేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి చీరాల, మార్కాపురం, కుంకలమర్రు సొసైటీ, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉప్పుగుండూరు, ఇంకొల్లు, సోమవరప్పాడు సొసైటీలకు అవార్డులు ఇచ్చారు. ఆ సొసైటీల అధ్యక్షులు, సెక్రటరీలను కూడా సత్కరించారు. బ్యాంకు నూతనంగా ప్రారంభించిన స్వర్ణోత్సవ డిపాజిట్ పథకం కింద జూలై ఆఖరు నాటికి రూ.15 కోట్లు సేకరించినట్లు బ్యాంకు చైర్మన్ డాక్టర్ సీతారామయ్య తెలిపారు.

అలుగు దర్శనం

● ఏజీ పాడులో పెళ్లివేడుకలో కనిపించిన జంతువు ● అటవీ ప్రాంతంలో వదిలేసిన యానిమల్ క్యాచర్



ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పులి కూడా తినలేని జంతువు పాంగొలిన్ (అలుగు). దీనికి ఇతర దేశాలలో చాలా డిమాండ్ ఉంది. అరుదుగా కనిపించే ఈ జంతువు (క్షీరదం) రూ.కోట్ల విలువ పలుకుతుంది. దీనిని పట్టుకున్నా, స్మగ్లింగ్ చేసినా శిక్షలు తప్పవు. ఇంత డిమాండ్ ఉన్న అరుదైన జంతువు ఎర్రగొండపాలెం మండలంలోని అమానిగుడిపాడు గ్రామంలో ప్రజల మధ్యలోకి బుధవారం అర్ధరాత్రి ఓ వివాహ వేడుకలో దర్శనం ఇచ్చింది. ఈ వింత జంతువును చూసిన గ్రామానికి చెందిన వడ్లమూడి వెంకటేశ్వర్లు, వడ్లమూడి చిన్న సుబ్బయ్య, పాపయ్య మార్కాపురం డీఎఫ్‌వో, ఎర్రగొండపాలెం డిప్యూటి రేంజర్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే డీఎఫ్‌వో సందీప్ కృపాకర్, రేంజర్ వీవీ నరసింహారావు అక్కడకు చేరుకొని ఆ జంతువును బంధించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాంగొలిన్ జంతువును సురక్షితంగా నల్లమల అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు అధికారులు తెలిపారు. యానిమల్ రెస్క్యూ అధికారి నిరంజన్ కుమార్, ఎఫ్ఆర్‌వోలు దాసయ్య, పక్రుద్దీన్, రవికుమార్, సిబ్బంది ఉన్నారు. సమాచారం ఇచ్చిన గ్రామస్థులను డీఎఫ్‌వో అభినందించారు.

రామాంజనేయ పురంలో చోరీ

బల్లికురవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో మంగళవారం రాత్రి చోరీజరిగింది. గుంటుపల్లి గురుమూర్తి అను రైతు ఇంటి బయట నిద్రిస్తుండగా వెనక వైపు నుంచి ఇంట్లోకి వచ్చిన దొంగలు బీరువాలో ఉన్న మూడు సవర్ల బంగారు వస్తువులు, 30 తులాల వెండి వస్తువులు, పది హేను వందల నగదును తస్కరించారు. బుధవారం ఉదయం ఇంట్లోకి వెళ్లిన గురుమూర్తి లోపల బీరువా తెరిచి ఉండటం చూసి చోరీ జరిగిందని గుర్తించి వెంటనే బల్లికురవ పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. చోరీ జరిగిన ఇంటిని సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు, ఎస్ఐ నాగరాజులు పరిశీలించారు. బాపట్ల నుంచి క్లూస్ టీం సభ్యులు చోరీ జరిగిన బీరువా వద్ద వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కదిలిన బీజేపీ

(5వ పేజీ తరువాయి)

గురువారం మన జిల్లాకు వస్తున్నారు. ఈ సందర్భంగా గతంలో ఎన్నడూలేని విధంగా బీజేపీ జిల్లా నాయకులు, కార్యకర్తలు కదిలి ఆయనకు స్వాగతం పలికారు. బుధవారం రాత్రి 10.30 నిమిషాల సమయంలో ఒంగోలు వచ్చిన మాధవ్‌కు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. గురువారం ఉదయం 6 గంటలకే ఆయన కార్యక్రమాలకు శ్రీకారం పలకనున్నారు. చాయ్ పే చర్చ పేరుతో ఉదయం 6 గంటలకు విందు భోజనం హోటల్ వద్ద అక్కడ వారితో మమేకం కానున్నారు. సుమారు గంట సేపు అక్కడ గడుపుతారు. ఆతర్వాత 10 గంటలకు లాయరుపేట సమీపంలోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేస్తారు. అక్కడ్నుంచి పాత మార్కెట్ సెంటర్ వద్దకెళ్లి అక్కడ నుంచి జరిగే ర్యాలీలో పాల్గొంటారు. అనంతరం రిమ్స్ సమీపంలో ఉన్న ఎంఎస్ ఫంక్షన్ హాలులో జరిగే జిల్లా కార్యకర్తల విస్తృత సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు వల్లూరు వద్ద హైవే సమీపంలో ఉన్న హోటల్‌లో మేధావుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం పార్టీలోని నేతల ఇంట్లోనే భోజనం చేసి రాత్రికి బస చేసి మరుసటి రోజు నెల్లూరు వెళతారు. ఆయన గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అటు ప్రజలు, ఇటు పార్టీ శ్రేణులతో గడిపేందుకు సమయం కేటాయించడం విశేషం. కాగా జిల్లా బీజేపీలో ఎన్నడూలేని ఉత్సాహం కనిపిస్తోంది. క్విస్ విద్యా సంస్థల అధిపతి డాక్టర్ నిడమానూరి కల్యాణ్‌చక్రవర్తి ఆపార్టీలో చేరిన తర్వాత జిల్లాలో కార్యక్రమాలు పుంజుకున్నాయి. ఆ విషయాన్ని గుర్తించిన అధిష్ఠానం ఆయనకు పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించి ప్రోత్సహించింది. ఆయనతోపాటు 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, ఒంగోలు పార్టీ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్ తదితరులు కలిసికట్టుగా పార్టీ శ్రేణులను , అభిమానులను కదిలించి మాధవ్ కార్యక్రమాల జయప్రదానికి సన్నద్ధం చేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. అక్కడ ఐవీఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ఆ గ్రామపంచాయతీలో క్లాప్‌మిత్ర ఇంటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమంలో పాల్గొంటున్నారా? లేదా? అనేది ప్రజలను అడిగి తెలుసుకుంటారు. డిప్యూటీ ఎంపీడీవోలు, ఎంపీడీవోలు కూడా ఐవీఆర్ఎస్ గ్రామాల్లో పర్యటించాల్సి ఉంటుంది. ప్రధానంగా ఎంపిక చేసిన గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసే విషయమై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

పంచాయతీలకు ఆదాయ కల్పన

గ్రామాలను స్వచ్ఛంగా ఉంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి ఆ గ్రామ పంచాయతీకి ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయడం ద్వారా గ్రామ పంచాయతీ ఆర్థిక పరిపుష్టి చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చడం వలన ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉంటారని, తద్వారా ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతాయన్నది ప్రభుత్వ ఆలోచన.

ప్రభుత్వ బడి విద్యార్థులకు ప్రోత్సాహం

ఈపూరుపాలెం(చీరాల), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం సాగిస్తున్న చిన్నారులకు ఆదరణ అందిస్తామని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమంగా రాణించిన ఈపూరుపాలెం బాలుర ఉన్నత పాఠశాల ఐదుగురు, బాలికలు ఐదుగురికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విశ్రాంత ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చేగూడి వెంకట సుబ్బయ్య ఆర్థిక సహకారంతో బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా రంగంలో జిల్లాను రోల్ మోడల్‌గా ఉంచాలని సూచించారు. ప్రతి నిరుపేద విద్యార్థికి తోడుంటామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అర్జీల పరిష్కారమవుతున్న తీరుతోపాటు పౌరసరఫరాలు, రెవెన్యూ సంబంధిత అంశాలపై బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి సమీక్షించారు. గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఈ కార్యక్రమాన్ని సమీక్షిస్తున్నారన్నారు. ఆడిట్‌లో పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీల విషయంలో పెండింగ్ ఉండరాదన్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తున్నందున అర్జీదారులతో అధికారులు మర్యాదపూర్వకంగా మాట్లాడాలని కలెక్టర్ సూచించారు. దుకాణాల ద్వారానూ, వృద్ధులకు నేరుగా ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీలో పురోగతి ఉండాలన్నారు. సమావేశంలో డిఆర్వో చిన ఓబులేషు, వివిధశాఖల అధికారులు పద్మశ్రీ, వరలక్ష్మీ, కలెక్టరేట్ ఏవో రవి, గ్రీవెన్స్ ఆడిట్ బృంద సభ్యులు, ఇతర అధికారులు ఉన్నారు.

ఉత్తమ సొసైటీగా ఉప్పుగుండూరు

నాగులుప్పలపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సొసైటీగా ఉప్పుగుండూరు సహకార సంఘం ఎంపికయింది. 2024-25 ఏడాదికి గాను రైతులకు రుణాలు, ఎరువులను లక్ష్యం మేరకు అందించి ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ఉత్తమ సొసైటీగా అవార్డును అందుకొంది. బుధవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయసహకార శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడి చేతులు మీదుగా ఉప్పుగుండూరు సొసైటీ అధ్యక్షుడు కాట్రగడ్డ చంద్రబాబు, సీఈవో నన్నపనేని కోటేశ్వరరావు అవార్డులను అందుకున్నారు.

లారీని ఢీకొట్టిన మరో లారీ

● డ్రైవర్‌కు స్వల్పగాయాలు



ఒంగోలు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. దీంతో లారీ క్యాబిన్ దెబ్బతినడమే కాకుండా డ్రైవర్ అందులో విరుక్కుపోయడు. ఈ సంఘటన ఒంగోలు నగరం దశరాజుపల్లి వద్ద గల జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్ వద్ద బుధవారం జరిగింది. చెన్నయ్ నుంచి హుజూర్‌నగర్ మట్టంపల్లి వెలుతున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. దీంతో వెనుక ఉన్న లారీ క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వచ్చి కట్టర్‌సాయంతో సురక్షితంగా బయటకు తీశారు. అయితే డ్రైవర్ ఎడమకాలుకు స్వల్పగాయమైంది. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

రొయ్యకు ట్రంప్ దెబ్బ

(5వ పేజీ తరువాయి)

మూడు రోజులపాటు వ్యాపారులు రొయ్యల కొనుగోళ్లను నిలిపివేయడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. సోమవారం నుంచి పునఃప్రారంభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే ధరలను గణనీయంగా తగ్గించారు. ఇంకా ధరలు తగ్గిపోయే అవకాశం ఉందని భావిస్తున్న రైతులు దక్కినకాడికే అనుకుంటూ చెరువులను తీసేస్తున్నారు.

దిగుమతి సుంకం విధించకముందు, విధించిన తర్వాత ఈ వారం రోజుల్లో రొయ్యల ధరలు తగ్గిన వివరాలు ఇలా ఉన్నాయి.

సుంకం విధించక ముందు వెనామీ కౌంట్ ధరలు ఇలా ...

30 కౌంట్	475(రూ..లలో)
40 కౌంట్	400
50 కౌంట్	370
60కౌంట్	350
70కౌంట్	320
80 కౌంట్	300
90 కౌంట్	280
100 కౌంట్	270
దిగుమతి సుంకం విధించిన తర్వాత ఇ లా..	
30 కౌంట్	430(రూ..లలో)
40 కౌంట్	370
50 కౌంట్	340
60 కౌంట్	320
70 కౌంట్	295
80 కౌంట్	275
90 కౌంట్	255
100 కౌంట్	245

పరీక్షల షెడ్యూల్ విడుదల

● 11 నుంచి 14 వరకు పరీక్షలు

ఒంగోలు విద్య, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతన్న విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ పేపర్-1 పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించారు. ఈ మేరకు పాఠశాల విద్య శాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షలు ఈనెల 11 నుంచి 14 వరకు జరుగుతాయి.

● ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 11 నుంచి 13 వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయి. 11న ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 12న ఉదయం ఇంగ్లీషు, మధ్యాహ్నం పరిసరాల విజ్ఞానం, 13న ఉదయం ఓఎస్ఎస్ పరీక్ష జరుగుతుంది

● ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 11 నుంచి 14 వరకు పరీక్షలు జరుగుతాయి. రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. 6,7,8 తరగతులకు, 9, 10 తరగతులకు పరీక్షలు వేరువేరుగా నిర్వహిస్తారు. 6 నుంచి 10 తరగతులకు ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 12న ఉదయం హిందీ, మధ్యాహ్నం జనరల్ సైన్స్ ఫిజికల్ సైన్స్ 13న ఉదయం ఇంగ్లీషు మధ్యాహ్నం సోషల్, 14న ఉదయం బయాలజికల్ సైన్స్ ఓఎస్ఎస్‌సీ, మధ్యాహ్నం ఓఎస్ఎస్‌సీ పరీక్షలు జరుగుతాయి.

ఫోర్జరీ సంతకాలతో అభ్యర్థుల నామినేషన్లు విత్‌డ్రా

● మాజీమంత్రి సురేష్ ఆరోపణలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కొండపి గ్రామ పంచాయతీని ఏకగ్రీవంగా చేసుకునేందుకు వైసీపీ బలపరిచిన అభ్యర్థుల నామినేషన్లను ఫోర్జరీ సంతకాలతో ఉపసంహరణ (విత్‌డ్రా) చేశారని మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంచేసే విధంగా అధికార పార్టీ నాయకులు వ్యవహరించారన్నారు. కొండపి గ్రామ పంచాయతీని ఏకగ్రీవం చేసుకోసేందుకు క్యాబినెట్ ర్యాంకులో ఉన్న మంత్రితో పాటు ఇతర ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. బలవంతంగా విత్‌డ్రా ఫాంపై సంతకం చేయించుకున్నారని విమర్శించారు.

శిథిలమైన అతిథి

● నిరుపయోగంగా ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్

● నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు





త్రిపురాంతకం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దాదాపు నలభైఏళ్లకు పైగా ఎందరికో ఆతిథ్యమిచ్చిన అతిథిగృహం పాలకుల నిర్లక్ష్యంతో నేడు పాడుబడిపోయింది. త్రిపురాంతకేశ్వర స్వామి సన్నిధానంలో ఉన్న ఈ గెస్ట్‌హౌస్‌కు త్రిపుర విహార్ అని పేరు కూడా పెట్టారు. ఎందరో ప్రముఖులు ఇదే అతిథిగృహంలో సేదదీరారు. అలాంటి అతిథిగృహం నేడు శిథిలమైపోతే మన పాలకులకు పట్టడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్‌డివిజన్ ఏర్పడిన సమయంలో ఇక్కడ క్వార్టర్స్‌తో పాటు ఎన్నెస్పీ అతిథిగృహం కూడా నిర్మించారు. ప్రధాన కూడలిలో ఉండటంతోపాటు త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం ఉండటం, శ్రీశైలం వైపునకు వెళ్లే ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ఇదే అతిథిగృహంలో కాసేపు విశ్రాంతి తీసుకునేవారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అతిథిగృహాన్ని వినియోగించుకోవటమే కాని దాని మరమ్మతులపై ఎప్పుడూ దృష్టిపెట్టకపోవటంతో త్వరతిగతిన ఈ భవనం శిథిలావస్థకు చేరింది. కొన్నాళ్లుగా పూర్తిగా పాడైపోయిన ఈ భవనాన్ని అందరూ వదిలేయటంతో చిల్లచెట్లు పెరిగిపోయి చుట్టూ ఆక్రమణదారులు ఆక్రమించుకొని కనీసం లోపలికి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. ఇందులోని ఫర్నీచర్ ఇతర సామగ్రి కూడా వర్షాలకు తడిసి పాడైపోయాయి. ప్రస్తుతం ఈ భవనం స్థానంలో కొత్తది నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులు అంచనాలతో ప్రతిపాదనలు పంపారని చెబుతున్నారు. కానీ నిధులు ఇవ్వని కారణంగా పరిస్థితి అలానే ఉంది. కనీసం ఇప్పుడు కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు నిధులు విడుదలకు ప్రభుత్వం వద్ద ప్రతిపాదించాలని నూతన అతిథిగృహ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదించాం

ఇప్పుడున్న అతిథిగృహం వినియోగించుకోవటానికి పనికి రాదు. కొత్త భవనం నిర్మించాల్సి ఉంది. అందుకోసం గత ప్రభుత్వ హయాంలో దాదాపు కోటి రూపాయల అంచనాతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- విజయలక్ష్మి, ఎన్నెస్పీ డీఈ

ఆర్‌ఐవోగా ఆంజనేయులు



ఒంగోలు విద్య, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్‌ఐవో)గా కొండపల్లి ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆర్‌ఐవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న సైమన్ విక్టర్ ఇంటర్మీడియెట్ విద్యా మండలి పరీక్షల నియంత్రణాధికారిగా నియమితులు కావడంతో ఆ స్థానంలో ఆంజనేయులకు ఆర్‌ఐవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఆంజనేయులు ప్రస్తుతం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారిగా పనిచేస్తున్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు తాజా ఉత్తర్వులతో ఆర్‌ఐవోగా, డీఐఈవో రెండు పోస్టులు ఆంజనేయులు నిర్వహించనున్నారు ఈ రెండు పోస్టులు ఒకే అధికారి నిర్వహించడం ఇదే ప్రథమం. ఆర్‌ఐవోగా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులును పలువురు అభినందించారు.

కంప్యూటర్ టీచర్‌కు 20 ఏళ్ల జైలు

● బాలికపై లైంగిక దాడి కేసులో శిక్ష విధించిన పోక్సో కోర్టు న్యాయాధికారి

ఒంగోలు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ప్రైవేటు పాఠశాల కంప్యూటర్ టీచర్‌కు 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.15 వేలు జరిమానా విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు న్యాయాధికారి కె.శైలజ బుధవారం తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.2లక్షల పరిహారం ఇవ్వాలని జిల్లా నాయసేవాధికార సంస్థను ఆదేశించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గిద్దలూరు మండలానికి చెందిన బాలిక కడప జిల్లా కలసపాడులోని ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదివే సమయంలో అక్కడ కంప్యూటర్ టీచర్‌గా పనిచేస్తున్న అదే మండలం ఎగువరామపురానికి చెందిన బొమ్ము పెద్ద వీరయ్య ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ మేరకు విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పగా వారు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన టీచర్‌ని మందలించారు. అనంతరం 2018లో బాలిక తిరుపతిలో ఇంటర్ చదువుతూ దసరా సెలవులకు ఇంటికి వచ్చింది. బాలికకు పెద్ద వీరయ్య ఫోన్ చేసి తనకు బంగారం, పెద్దమొత్తంలో నగదు ఇవ్వకపోతే ఆమె పర్సనల్ ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో బాధితురాలు ఇంట్లో ఉన్న బంగారం, నగదు తీసుకొని పెద్ద వీరయ్య దగ్గరకు వెళ్లగా ఫొటోలు వేరొకచోట ఉన్నాయని మాయమాటలు చెప్పి తన బైక్‌పై ఎక్కించుకొని హైదరాబాద్ తీసుకెళ్లాడు. అక్కడ ఓ లాడ్జిలో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే ప్రాంతంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని అక్కడ పలుమార్లు లైంగికదాడి చేశాడు. ఈ మేరకు గిద్దలూరు పోలీసులకు బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అప్పటి డీఎస్పీలు జి.నాగేశ్వరరెడ్డి, ప్రకాశరావు సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి శైలజ నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20ఏళ్ల జైలుతోపాటుగా రూ.15వేలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు వాదనలు వినిపించారు.

హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలి

● న్యాయసేవాధికారిక సంస్థ కార్యదర్శి ఇబ్రహీమ్ షరీఫ్

ఒంగోలు క్రైం,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు హక్కులతో పాటు భాధ్యతలు తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారిక సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి షేక్.ఇబ్రహీమ్ షరీఫ్ తెలిపారు. స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో అసంఘటిత కార్మికుల కోసం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇబ్రహీమ్ షరీఫ్ మాట్లాడుతూ వాహన యజమానులు తప్పనిసరిగా బీమా కలిగి ఉండాలని చెప్పారు. థర్డ్ పార్టీ బీమా చేసుకోవాలని సూచించారు. తద్వార ప్రమాదాలు జరిగిన సమయంలో భాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని అన్నారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా బీమా కంపెనీలు బాధితులకు తమ వయస్సు, చేసే ఉద్యోగంను లెక్కకట్టి పరిహారం అందజేస్తారని చెప్పారు. వాహనచోదన చేసే సమయంలో తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని అన్నారు. కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ భవానీ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు తప్పనిసరిగా ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ నమోదు ఉచితంగానే చేస్తారని 16 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగినవారు అర్హులని అన్నారు. తద్వారా ప్రభుత్వం కల్పించే సామాజిక భద్రత, సంక్షేమ పథకాలకు అర్హులని తెలిపారు. ఈనెల 7 నుంచి 17 కార్మిక శాఖ ప్రత్యేక రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించిందని జిల్లాలో కార్మికులు అందరు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ ఆటోల్లో డీజే సౌండ్స్ పెట్టి వాహనలు నడపడటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా తమ లైసెన్స్ వాహనానికి సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. రహదారి నిబంధనలు పాటించాలని కోరారు.

నేడు మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలి

● లంకా దినకర్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురువారం ఒంగోలులో జరిగే కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు విజయవంతం చేయాలని 20 సూత్రాల అమలు పథకం కమిటీ చైర్మన్ లంకా దినకర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంఎస్ పంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాతమొదటి సారిగా మాధవ్ ఒంగోలుకు వస్తున్నారని తెలిపారు. స్వాగతించేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఒంగోలులో జరిగే సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొంటున్నందున జిల్లాకు సంబంధించిన అనేక సమస్యలతో పాటు వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరుగుతుందని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ గురువారం ఉదయం 8గంటలకు పాత బైపాస్ రోడ్డులో విందుభోజన హోటల్ వద్ద చాయ్ పే చర్చా కార్యక్రమం జరుగుతుందన్నారు. పది గంటలకు లాయర్‌పేటలోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించిన అనంతరం పాత కూరగాయాల మార్కెట్ సెంటర్ నుంచి ఎంఎస్ కళ్యాణ మండపం వరకు ర్యాలీ అనంతరం సాయంత్రం మేధావుల సదస్సు జరుగుతాయన్నారు.

అర్హులైన రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ'

● డీఏవో శ్రీనివాసరావు



రైతులకు విత్తనాలను అందజేస్తున్న డీఏవో శ్రీనివాసరావు

కొత్తపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసిందని డీఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇంకా ఎవరికైనా నగదు జమ కాకపోతే తమ ఆధార్ ద్వారా సరిచూసుకోవాలని కోరారు. బుధవారం గమళ్ళపాలెంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. ఇంకా నగదు జమ కాని రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. సాగులో ఎక్కువగా పురుగుమందులు, రసాయన ఎరువులు వాడటం వల్ల భూమిలో పోషకాల సమతుల్యత లోపిస్తుందని, దీన్ని అధిగమించేందుకు పచ్చిరొట్ట పైర్లను సాగు, ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలని చెప్పారు. ఏవో జి.కిషోర్‌బాబు మాట్లాడుతూ రైతులు పంటలను సాగు చేయబోయే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులకు విత్తనాల కిట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ తేజ, ఏఈవో అజయ్‌కుమార్, వీపీఏ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

కొత్తపట్నం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం ఈతముక్కలలో పట్టపు ప్రకాశం అధ్యక్షతన జరిగిన సభలో ఆంజనేయులు మాట్లాడారు. పేదలకు ఇళ్ళ పట్టాలు అందజేయటంతో పాటు పక్కా గృహం నిర్మించుకునేందుకు రూ.6లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనర్హుల చేతిలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు సాగు భూములుగా, ఇంటి స్థలాలుగా పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వామిరెడ్డి, రమాదేవి, పిల్లి కృష్ణ, రామిరెడ్డి, పొన్నం వెంకటేశ్వర్లు, కె.శ్రీను, లక్ష్మీ, కట్టా కుమారి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో గుంత.. రాకపోకలకు చింత..!

● ఇబ్బందిపడుతున్న వాహనదారులు



గుంత కారణంగా ఇబ్బందిపడుతున్న వాహనదారులు

కొండపి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కొండపి నుంచి మద్దులూరు వెళ్లే రోడ్డులో ఏర్పడిన గుంతలు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా కొండపిలోని ఆర్అండ్‌బీ రోడ్డులో తారు లేచిపోయి పెద్దగుంత ఏర్పడింది. అందులో వర్షపు నీరు చేరింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు గుంతను తప్పించి ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లో వాహనాలను నడుపుతున్నారు. ఎదురెదురుగా వెళ్లాల్సి వస్తుండటంతో ఎక్కడ ప్రమాదం బారినపడతామోనని భయపడిపోతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

పంటల బీమా చేసుకోవాలి

మద్దిపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేసుకోవాలని ఏవో జి.స్వర్ణలత తెలిపారు. బుధవారం దొడ్డవరప్పాడు పంచాయతీలో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి రైతులు వేసే పంటను నమోదు చేయించుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు 14వ తేదీతో ఆఖరు కనుక తప్పనిసరిగా ప్రీమియం చేయించుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి గ్రీవెన్స్ నమోదుకు ఈనెల 15వ తేదీ ఆఖరని, ఏమైనా సమస్య ఉంటే గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ హర్మ్యశ్రీ, హార్టికల్చర్ అసిస్టెంట్ పి.సుష్మా, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఉద్యోగులు తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత పీఆర్సీ బకాయిలు చెల్లింపుతో పాటు కొత్త పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఈదర శ్రీనివాసరావు, చంచారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, కోశాధికారి రంగారెడ్డి, మహిళావిభాగం అధ్యక్షురాలు డాక్టర్ మానస తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నతి' పాడిగేదెలపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఉన్నతి పథకం కింద ఒంగోలు మండలంలోని 14 గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 2016-2019వరకు ఇచ్చిన పాడిపశువుల వివరాలపై బుధవారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విజిలెన్స్ సీఐ అపర్ణ మాట్లాడుతూ డీఆర్‌డీఏ ద్వారా ఉన్నత పథకం కింద మండలంలో 85 పాడిగేదెలను లబ్ధిదారులకు ఇచ్చినట్లు చెప్పారు. అయితే వాటి ద్వారా ఎంత మేరకు లబ్ధి చేకూరిందనే దానిపై వివరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈమేరకు లబ్ధిదారులకు విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే తీసుకున్న రుణాలను ఎంతమేరకు చెల్లించారనే దానిపై విచారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ జి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని మై భారత్ జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి అన్నారు. అమ్మ కోసం ఒక మొక్క నాటడం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఒంగోలులోని మంగమ్మ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆయన మాట్లాడారు. ముందుగా కళాశాల ఆవరణలో పల రకాల మొక్కలను నాటారు. అనంతరం మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు దేశంలోని ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరుతో ఒక మొక్కనునాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందించిన వారవుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో రాంబాబు, ప్రిన్సిపాల్ రంగారావు, అధ్యాపకులు భాస్కరరావు, నరసింహులు, సాజిద్, విద్యార్థులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో వి.జ్యోతి తెలిపారు. బుధవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుల పాలిట ఒక ఆయుధమని, సెక్షన్ 6(1) ప్రకారం ఆర్టీఐ అర్జీ వచ్చిన 30 రోజులలోపు తప్పనిసరిగా సమాధానం అర్జీదారునికి అందజేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు ఆర్టీఐ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబు, మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రసాద్, ఎంఈవో ఆంజనేయులు, ఏపీఎం కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీని సరిచేసుకోవాలి

పొన్నలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులై బ్యాంకుల్లో నగదు జమకాని వారు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ, ఎన్‌పీసీఐను సరిచేసుకోవాలని ఏడీఏ నిర్మలకుమారి సూచించారు. చనిపోయిన రైతు కుటుంబ సభ్యులు, పాస్ పుస్తకాల్లో ఆధార్ తప్పుగా లింక్ అయిన వారు మండల తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించి అవసరమైన మార్పులు చేసుకుంటే నగదు జమ అవుతుందన్నారు. బుధవారం మాలపాడు, విప్పగంట గ్రామాలలో నిర్వహించి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ పాల్గొన్నారు. రైతులకు పలు సలహాలు ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి బి.రాము మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను రైతులు ఈక్రాప్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, పశువైద్య సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో పద్మావతి

కొత్తపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అల్లూరు ఎస్సీకాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కొత్తపట్నం జడ్పీ హైస్కూలులో గణితం ఉపాధ్యాయులుగా పని చేస్తున్న కోటేశ్వరరావు తన సొంత నిధులతో వాటిని సమకూర్చగా ఎంఈవో పద్మావతి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ నవోదయ విద్యాలయంలో సీటు సాధించిన ప్రతి విద్యార్థికి రూ.1116లను అందజేస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం కొప్పోలు హనుమంతరావు పాల్గొన్నారు.

నూతన రైల్వే లైన్ల ఏర్పాటుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నూతన రైల్వే లైన్ల ఏర్పాటుపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్రరైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ సమాధానం ఇస్తూ కేంద్రం-రాష్ట్రం 50-20భాగస్వామ్యంతో 266 కి.మీ. పొడవుతో రూ.2,706 కోట్ల వ్యయంతో కడప-బెంగళూరు రైల్వేలైన్ నిర్మాణంలో ఉందన్నారు. 2025 మార్చినాటికి రూ.358.60 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. రూ.1353 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.189.95కోట్లు డిపాజిట్ చేసిందని, మిగిలిన మొత్తం చెల్లించిన వెంటనే పనులు జరుగుతాయని తెలిపారు. నూతన రైల్వే లైన్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని, దానికి పలు అనుమతులు పొందాల్సి ఉందని కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

సంతనూతలపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించిన సీసీకెమెరాలను సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయం లోపల, బయట బుధవారం తహసీల్దార్ నారాయణరెడ్డి ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి సీసీకెమెరాలు వచ్చినట్లు తెలిపారు. పారదర్శకపాలనకు నిదర్శనంగా వాటిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పీ4 సర్వేలో నిర్లక్ష్యంపై కమిషనర్ సీరియస్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించాల్సిన పీ4 సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు సచివాలయ సెక్రటరీలపై కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం త్రోవగుంట సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న నలుగురు సెక్రటరీల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. హాజరుపట్టీలో సంతకాలు చేయకపోవడంతో పాటు పీ4 సర్వేలో వెనుకబడి ఉండటం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆయన హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు నలుగురు సెక్రటరీలకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే ఇటీవల కాలంలో వరుసగా పలు సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్ అక్కడి సిబ్బంది పనితీరు, విధుల్లో అలసత్వంపై మరికొందరికి మెమోలు జారీ చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలోనూ తప్పనిసరిగా పీ4 సర్వే నిర్వహించాలని, ప్రతిరోజు నివేదికలు తెలియజేయాలని ఆదేశించారు.

ఘనంగా సామూహిక సీమంతాలు



గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న పీడీ సువర్ణ, సీడీపీవో అంజమ్మ

సంతనూతలపాడు, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట క్రిస్టియన్‌పాలెంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ సువర్ణ తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో అంజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కరవది పీహెచ్‌సీలో ప్రసూతి సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ సుందరప్రసాద్

ఒంగోలు(రూరల్), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కరవది పీహెచ్‌సీలో ప్రసూతి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వైద్యాధికారి, డాక్టర్ సుందరప్రసాద్ తెలిపారు. బుధవారం ఒంగోలు మండలం కరవదిలోని పీహెచ్‌సీలో ఆశ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు స్థానిక ఆరోగ్యకేంద్రంలో ప్రసూతి వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చిన విషయాన్ని ఏఎన్ఎంలు గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. ఈనెల 12వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని 1-19 సంవత్సరాలలోపు వారికి ఆల్బెండజాల్ టాబ్లెట్లను మింగించాలని తెలిపారు. దీనివల్ల పిల్లలో రక్తహీనతను నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ లభిస్తుందని డాక్టర్ సుందరప్రసాద్ అన్నారు. మండలంలోని వలేటివారిపాలెం, గుండాయపాలెం గ్రామాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలతోనే బిడ్డకు పూర్తిస్థాయిలో పోషణ లభిస్తుందన్నారు. సూపర్‌వైజర్ రాణి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు

స్వర్ణాంధ్ర, పీ4 ప్రగతిపై సమీక్ష

సింగరాయకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర, పీ4 ప్రగతిపై పంచాయతీ కార్యదర్శులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కొండపి నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె.శ్రీధర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. పీ4 సర్వేను సకాలంలో పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ పథకం ద్వారా సమాజంలో పేద కుటుంబాలకు గుర్తించి వారిని సంపన్నులు దత్తత తీసుకొని ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అందుకు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనే వారిని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు

నాగులుప్పలపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిమ్మసముద్రంలో నెలకొన్న లోఓల్టేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులకు బుధవారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు మంగమూరి మధు, ముద్దన రవికుమార్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వేధిస్తున్న లోవోల్టేజీ సమస్యను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ దృష్టికి తీసుకుపోయినట్లు చెప్పారు. కోస్టల్ కారిడార్ పథకం కింద 600 విద్యుత్ స్తంభాలు, అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు తేళ్ల శేషుబాబు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారం అందజేస్తున్న సీడీపీవో సుశీలాదేవి

కొండపి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీవో బి.సుశీలాదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పోలిరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో ఆమె బుధవారం సమావేశం నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. ఈసందర్భంగా పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విక్టోరియారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంగోలులో క్రైస్తవ పుస్తక ప్రదర్శన ప్రారంభం



పుస్తకప్రదర్శనను ప్రారంభించిన అతిథులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): లేమెన్స్ ఎవాంజెలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఒంగోలులో ఏర్పాటు చేసిన బైబిల్ బుక్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభించారు. స్థానిక రామనగర్‌లోని ఎల్ఈఎఫ్ చర్చిలో ఏర్పాటు చేసిన ఈప్రదర్శనను జేఎంబీ చర్చి పాస్టర్ డి.జాన్‌అగస్టీన్, పాస్టర్ ఐజక్‌బాబు ప్రారంభించి మాటాడారు. చెన్నయ్‌కు చెందిన బ్యూటిఫుల్ బుక్స్ ఎగ్జిబిషన్ నగరంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు పుస్తక క్రైస్తవ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనేకమంది దైవసేవకులు, భక్తులు రాసిన ఆధ్యాత్మిక, బైబిల్, ఇతర పుస్తకాలను ప్రదర్శనలో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ కాపరి సీహెచ్.సురేష్, డాక్టర్ మణిబాబు, పాస్టర్ భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

నువ్వు సాగుదారులకు శిక్షణ



మాట్లాడుతున్న ఏవో పావని

సంతనూతలపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మంగమూరులో జాతీయ ఆహార నూనెలు, నూనెగింజల మిషన్ పథకం కింద నువ్వు పంట సాగు చేస్తున్న రైతులకు బుధవారం ఏవో పావని శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో 20 హెక్టార్ల విస్తీర్ణంలో నువ్వు పంట సాగుచేసిన రైతులకు విత్తన దశ నుంచి పంట కోత దశ వరకు అవసరమైన యాజమాన్యపద్ధ తులపై అవగాహన కల్పించారు. రైతులకు ట్రైకోడెర్మావిరిడే మందులను అందించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, వెంకట్రావు పాల్గొన్నారు.

IN THE HIGH COURT OF JUDICATURE OF ANDHRA PRADESH AT AMARAVATHI
A.S.No.1847 of 1995

Between :
Kothamasu Veera Raghavaiah (Died) & Others ... Appellants
And
Shaik Khajabi (Died) & Others ...Respondents
To,

27. Shaik Aphrishak W/o.Shaik Molali, R/o.Cherukupalli, Prakasam District
41. Earla Mala Kondaiah S/o.Late Narasimhaiah, Aged about 52 years, R/o.D.No. 9-4-25, Kamaraju Street, Near Indhiragandhi Statue, Kamaraju Street, VTC: Bapatla, Po.Bapatla, Bapatla District.
42. Erla Srinivasa Rao S/o.Narasimhaiah, Aged about 41 years, R/o.D.No.464, NTR center, Chilakaluripet, Guntur District. ...Respondent/Proposed Respondent No.37
43. Khaleel ahmed S/o.Shaik Mastan, Aged about 55 years, R/o.D.No.40-3-9A, Kalyanam Ramarao Street, Revenue Colony Park, Revenue Colony, Labbipet, Vijayawada, A.P.- 520010. ...Respondent/Proposed Respondent No.3
44. Nadipineni Seshamma W/o.Anjaneyulu, D/o.Narra Hanumatha Rao, Aged about 35 years, R/o.Penaka vari veedhi, Pamidipadu, Korisapadu Mandal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.4
48. Kamma Kanthamma W/o.Late Kamma Mallikharjuna Rao, Aged About 60 years, R/o.at Garipati Towers, Ongole Road, Addanki Village, Bapatla District.
49. Kamma Siva Parvathi D/o.K.Mallikarjuna Rao, Aged about 40 years, R/o.Beside Municipality, Shivani Graphics, Addanki Village and Mandal, Bapatla District.
50. Subhashini W/o.Srinivasa Rao, D/o.K.Mallikarjuna Rao, Aged about 38 years, R/o.Ambadipudi Village, Ballikurava Mandal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.8
51. Jujjuri Padma W/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 40 years, R/o.opp.Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet Palnadu District.
52. Geetha Leelavathi D/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 26 years, R/o.opp Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet, Palnadu District.
53. Jujjuri Prudhvi Kumar S/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 24 years, R/o.opp Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet, Palnadu District. ...Respondent/Proposed Respondent No.14
54. Shaik Subhani S/o.Late Shaik Khasim Bi, Aged about 45 years, Beside of Madipadu Mandal Office, Madipadu Village and Mandal, Bapatla District.
55. Shaik Suleman S/o.Late Shaik Khasim Bi, Aged about 43 years, Medical Shop, Thallur Road, Vellampalli Village, Madipadu Mandal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.24
56. Shaik Adil S/o.Akram, Aged about 45 years, R/o.Kothapet, Vijayawada, Krishna District.
57. Shaik Akhil S/o.Akram, Aged about 43 years, R/o.Kothapet, Vijayawada, Krishna District.
58. Shaik Afill S/o.Akram Aged about 41 years, R/o.Kothapet, Vijayawada, Krishna District. ...Respondent/Proposed Respondent No.25
59. Shaik Abdul Rehaman S/o.Shaik Mastan Bi, Aged about 45 years, Occ. Tailer R/o.Vellampalli Village, Madipadu Manadal, Bapatla District.
60. Shaik Alla Bakshi S/o.Shaik Mastan Bi, Aged about 42 years, Occ.Teacher R/o Vellampalli Village, Madipadu Manadal, Bapatla District. ...Respondent/Proposed Respondent No.26

Please take notice that the above appellants filed the above case against you, for your appearance in the above court, where you are requested to appear before the Honourable High Court, Amaravathi either personally or through an advocate on 15-09-2025 at 10.30 A.M. in the above said case, failing which the matter will be heard and determined in your absence on merits.

(By order of the Honourable Court)

KRUPA CHAND GOGINENI
VARUN CHOWDARY. GOGINENI
Advocates
Flat No 208, "A" Block, Capital Square Appt, Sai Bharthi Nagar, Koppuravuru, Kantaru cross Road, Guntur Dist:- 522507

స్టడీ సర్కిల్స్‌ను ఏర్పాటు చేయాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి రాజేంద్రబాబు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతకు బీసీ, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్స్‌ను ఏర్పాటు చేసి ఉచిత మెటీరియల్‌ను అందజేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉచిత స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినా ఇంతవరకు అమలులోకి రాలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి మూడునెలలకు ఒకసారి బ్యాంకు, రైల్వే, డీఎస్సీ ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఉద్యోగాల కోసం నిరంతరంగా కోచింగ్ ఇస్తున్నారన్నారు. కానీ మన రాష్ట్రంలో మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి, పి.ప్రభాకర్, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం

ఒంగోలు కల్చరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్‌లోని షిర్డి సాయిబాబానగర్‌లో ఉన్న శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో ఆలయ ప్రతిష్ఠా కుంభాభిషేక వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నాగలింగేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలను చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూర్ణాహుతిని సమర్పించారు. అనంతరం రాజరాజేశ్వరి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరిగింది. ఈ నెల 9వ తేదీ వరకు వేడుకలు జరుగుతాయిన మందిర కమిటీ చైర్మన్ తెలిదేవులపల్లి శ్రీరామమూర్తి తెలిపారు. గురువారం భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం, శుక్రవారం నగరోత్సవం, 9వ తేదీన అన్నసమారాధన ఏర్పాటుచేశామని, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఉత్తమ ఫలితాలను సాధించాలి



సుబ్బారావును సన్మానిస్తున్న అధ్యాపకులు

కొండపి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉద్యోగ విరమణ చేసిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ అధికారి వీవీ.సుబ్బారావు అన్నారు. బుధవారం కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన్ను ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు విద్యార్థులు సన్మానించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కొండపి కళాశాలతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏడు సంవత్సరాలు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేయడం ఆనందంగా ఉందన్నారు.

డ్వాక్రా రుణాలను రికవరీ చేయాలి

● పీడీ నారాయణ

నాగులుప్పలపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపు సభ్యులు తీసుకొన్న రుణాలు నూరు శాతం రికవరీ చేయాలని డీఆర్‌డీఏ పీడీ నారాయణ సూచించారు. బుధవారం నాగులుప్పలపాడు వెలుగు కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలోని స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాల వివరాలు, రుణాల రికవరీలు, మండల సమాఖ్య పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల జీవనోపాధులు పెంపొందించేలా ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించి యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. రుణాలు సక్రమంగా చెల్లించని వారికి నోటీసులు అందించి రికవరీ చేయాలని తెలిపారు. ఏపీఎం బి.నరేంద్రకుమార్, సీసీలు రామకృష్ణ, కవిత, అరుణ, మేరీకుమారి, అధ్యక్షురాలు సీహెచ్.శైలజ, ఫార్మర్‌మిత్ర కె.బైరాగి, అకౌంటెంట్ కోటేశ్వరి పాల్గొన్నారు.

పరీక్షల షెడ్యూల్ విడుదల

● 11 నుంచి 14 వరకు నిర్వహణ

ఒంగోలు విద్య, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సెల్ఫ్ అసెస్మెంట్ పేపర్-1 పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించారు. ఈ మేరకు పాఠశాల విద్య శాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షలు ఈనెల 11 నుంచి 14 వరకు జరుగుతాయి.

● ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 11 నుంచి 13 వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయి. 11న ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 12న ఉదయం ఇంగ్లీషు, మధ్యాహ్నం పరిసరాల విజ్ఞానం, 13న ఉదయం ఓఎస్ఎస్ పరీక్ష జరుగుతుంది

● ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 11 నుంచి 14 వరకు పరీక్షలు జరుగుతాయి. రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. 6,7,8 తరగతులకు, 9, 10 తరగతులకు పరీక్షలు వేరువేరుగా నిర్వహిస్తారు. 6 నుంచి 10 తరగతులకు ఉదయం తెలుగు, మధ్యాహ్నం గణితం, 12న ఉదయం హిందీ, మధ్యాహ్నం జనరల్ సైన్స్ ఫిజికల్ సైన్స్ 13న ఉదయం ఇంగ్లీషు మధ్యాహ్నం సోషల్, 14న ఉదయం బయాలజికల్ సైన్స్ ఓఎస్ఎస్సీ, మధ్యాహ్నం ఓఎస్ఎస్సీ పరీక్షలు జరుగుతాయి.

ఫోర్జరీ సంతకాలతో అభ్యర్థుల నామినేషన్లు విత్‌డ్రా

● మాజీమంత్రి సురేష్ ఆరోపణలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కొండపి గ్రామ పంచాయతీని ఏకగ్రీవంగా చేసుకునేందుకు వైసీపీ బలపరిచిన అభ్యర్థుల నామినేషన్లను ఫోర్జరీ సంతకాలతో ఉపసంహరణ (విత్‌డ్రా) చేశారని మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యంచేసే విధంగా అధికార పార్టీ నాయకులు వ్యవహరించారన్నారు. కొండపి గ్రామ పంచాయతీని ఏకగ్రీవం చేసుకోనేందుకు క్యాబినెట్ ర్యాంకులో ఉన్న మంత్రితో పాటు ఇతర ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. బలవంతంగా విత్‌డ్రా ఫాంపై సంతకం చేయించుకున్నారని విమర్శించారు.

శిథిలమైన అతిథి

● నిరుపయోగంగా ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్

● నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు


త్రిపురాంతకంలో నిరుపయోగంగా ఉన్న ఎన్నెస్పీ అతిథిగృహం



త్రిపురాంతకం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దాదాపు నలభైఏళ్లకు పైగా ఎందరికో ఆతిథ్యమిచ్చిన అతిథిగృహం పాలకుల నిర్లక్ష్యంతో నేడు పాడుబడిపోయింది. త్రిపురాంతకేశ్వర స్వామి సన్నిధానంలో ఉన్న ఈ గెస్ట్‌హౌస్‌కు త్రిపుర విహార్ అని పేరు కూడా పెట్టారు. ఎందరో ప్రముఖులు ఇదే అతిథిగృహంలో సేదదీరారు. అలాంటి అతిథిగృహం నేడు శిథిలమైపోతే మన పాలకులకు పట్టడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. త్రిపురాంతకం ఎన్నెస్పీ సబ్‌డివిజన్ ఏర్పడిన సమయంలో ఇక్కడ క్వార్టర్స్‌తో పాటు ఎన్నెస్పీ అతిథిగృహం కూడా నిర్మించారు. ప్రధాన కూడలిలో ఉండటంతోపాటు త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం ఉండటం, శ్రీశైలం వైపునకు వెళ్లే ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ఇదే అతిథిగృహంలో కాసేపు విశ్రాంతి తీసుకునేవారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అతిథిగృహాన్ని వినియోగించుకోవటమే కాని దాని మరమ్మతులపై ఎప్పుడూ దృష్టిపెట్టకపోవటంతో త్వరతిగతిన ఈ భవనం శిథిలావస్థకు చేరింది. కొన్నాళ్లుగా పూర్తిగా పాడైపోయిన ఈ భవనాన్ని అందరూ వదిలేయటంతో చిల్లచెట్లు పెరిగిపోయి చుట్టూ ఆక్రమణదారులు ఆక్రమించుకొని కనీసం లోపలికి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. ఇందులోని ఫర్నీచర్ ఇతర సామగ్రి కూడా వర్షాలకు తడిసి పాడైపోయాయి. ప్రస్తుతం ఈ భవనం స్థానంలో కొత్తది నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులు అంచనాలతో ప్రతిపాదనలు పంపారని చెబుతున్నారు. కానీ నిధులు ఇవ్వని కారణంగా పరిస్థితి అలానే ఉంది. కనీసం ఇప్పుడు కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు నిధులు విడుదలకు ప్రభుత్వం వద్ద ప్రతిపాదించాలని నూతన అతిథిగృహ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదించాం

ఇప్పుడున్న అతిథిగృహం వినియోగించుకోవటానికి పనికి రాదు. కొత్త భవనం నిర్మించాల్సి ఉంది. అందుకోసం గత ప్రభుత్వ హయాంలో దాదాపు కోటి రూపాయల అంచనాతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- విజయలక్ష్మి, ఎన్నెస్పీ డీఈ

ఆర్‌ఐవోగా ఆంజనేయులు



ఒంగోలు విద్య, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్‌ఐవో)గా కొండపల్లి ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆర్‌ఐవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న సైమన్ విక్టర్ ఇంటర్మీడియెట్ విద్యా మండలి పరీక్షల నియంత్రణాధికారిగా నియమితులు కావడంతో ఆ స్థానంలో ఆంజనేయులకు ఆర్‌ఐవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఆంజనేయులు ప్రస్తుతం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారిగా పనిచేస్తున్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు తాజా ఉత్తర్వులతో ఆర్‌ఐవోగా, డీఐఈవో రెండు పోస్టులు ఆంజనేయులు నిర్వహించనున్నారు ఈ రెండు పోస్టులు ఒకే అధికారి నిర్వహించడం ఇదే ప్రథమం. ఆర్‌ఐవోగా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులును పలువురు అభినందించారు.

కంప్యూటర్ టీచర్‌కు 20 ఏళ్ల జైలు

● బాలికపై లైంగిక దాడి కేసులో శిక్ష విధించిన పోక్సో కోర్టు న్యాయాధికారి

ఒంగోలు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ప్రైవేటు పాఠశాల కంప్యూటర్ టీచర్‌కు 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.15 వేలు జరిమానా విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు న్యాయాధికారి కె.శైలజ బుధవారం తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.2లక్షల పరిహారం ఇవ్వాలని జిల్లా నాయసేవాధికార సంస్థను ఆదేశించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గిద్దలూరు మండలానికి చెందిన బాలిక కడప జిల్లా కలసపాడులోని ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదివే సమయంలో అక్కడ కంప్యూటర్ టీచర్‌గా పనిచేస్తున్న అదే మండలం ఎగువరామపురానికి చెందిన బొమ్ము పెద్ద వీరయ్య ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ మేరకు విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పగా వారు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన టీచర్‌ని మందలించారు. అనంతరం 2018లో బాలిక తిరుపతిలో ఇంటర్ చదువుతూ దసరా సెలవులకు ఇంటికి వచ్చింది. బాలికకు పెద్ద వీరయ్య ఫోన్ చేసి తనకు బంగారం, పెద్దమొత్తంలో నగదు ఇవ్వకపోతే ఆమె పర్సనల్ ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో బాధితురాలు ఇంట్లో ఉన్న బంగారం, నగదు తీసుకొని పెద్ద వీరయ్య దగ్గరకు వెళ్లగా ఫొటోలు వేరొకచోట ఉన్నాయని మాయమాటలు చెప్పి తన బైక్‌పై ఎక్కించుకొని హైదరాబాద్ తీసుకెళ్లాడు. అక్కడ ఓ లాడ్జిలో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే ప్రాంతంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని అక్కడ పలుమార్లు లైంగికదాడి చేశాడు. ఈ మేరకు గిద్దలూరు పోలీసులకు బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అప్పటి డీఎస్పీలు జి.నాగేశ్వరరెడ్డి, ప్రకాశరావు సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి శైలజ నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20ఏళ్ల జైలుతోపాటుగా రూ.15వేలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు వాదనలు వినిపించారు.

హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలి

● న్యాయసేవాధికారిక సంస్థ కార్యదర్శి ఇబ్రహీమ్ షరీఫ్

ఒంగోలు క్రైం,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారిక సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి షేక్.ఇబ్రహీమ్ షరీఫ్ తెలిపారు. స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో అసంఘటిత కార్మికుల కోసం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇబ్రహీమ్ షరీఫ్ మాట్లాడుతూ వాహన యజమానులు తప్పనిసరిగా బీమా కలిగి ఉండాలని చెప్పారు. థర్డ్ పార్టీ బీమా చేసుకోవాలని సూచించారు. తద్వార ప్రమాదాలు జరిగిన సమయంలో బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని అన్నారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా బీమా కంపెనీలు బాధితులకు తమ వయస్సు, చేసే ఉద్యోగంను లెక్కకట్టి పరిహారం అందజేస్తారని చెప్పారు. వాహనచోదన చేసే సమయంలో తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని అన్నారు. కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ భవానీ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు తప్పనిసరిగా ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ నమోదు ఉచితంగానే చేస్తారని 16 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగినవారు అర్హులని అన్నారు. తద్వారా ప్రభుత్వం కల్పించే సామాజిక భద్రత, సంక్షేమ పథకాలకు అర్హులని తెలిపారు. ఈనెల 7 నుంచి 17 కార్మిక శాఖ ప్రత్యేక రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించిందని జిల్లాలో కార్మికులు అందరు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ ఆటోల్లో డీజే సౌండ్స్ పెట్టి వాహనలు నడపడటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా తమ లైసెన్స్ వాహనానికి సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. రహదారి నిబంధనలు పాటించాలని కోరారు.

నేడు మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలి

● లంకా దినకర్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ గురువారం ఒంగోలులో జరిగే కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు విజయవంతం చేయాలని 20 సూత్రాల అమలు పథకం కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంఎస్ ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాతమొదటి సారిగా మాధవ్ ఒంగోలుకు వస్తున్నారని తెలిపారు. స్వాగతించేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఒంగోలులో జరిగే సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొంటున్నందున జిల్లాకు సంబంధించిన అనేక సమస్యలతో పాటు వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరుగుతుందని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ గురువారం ఉదయం 8గంటలకు పాత బైపాస్ రోడ్డులో విందుభోజన హోటల్ వద్ద చాయ్ పే చర్చా కార్యక్రమం జరుగుతుందన్నారు. పది గంటలకు లాయర్‌పేటలోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించిన అనంతరం పాత కూరగాయాల మార్కెట్ సెంటర్ నుంచి ఎంఎస్ కళ్యాణ మండపం వరకు ర్యాలీ అనంతరం సాయంత్రం మేధావుల సదస్సు జరుగుతాయన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడు మృతి


రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మోష

దొనకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై దొనకొండ నుంచి దర్శి వైపు వెళ్తూ మంగళవారం రాత్రి చిన్నగుడిపాడు గ్రామం వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడు మృతిచెందాడు. అందిన వివరాల మేరకు... దర్శి మండలం, కట్టుబడివారిపాలేనికి చెందిన గర్నెపూడి మోష(25) టెంట్ హౌస్ సప్లయిర్స్‌లో పని చేస్తుంటాడు. మోష దొనకొండలోని బేతేల్‌పురానికి చెందిన యువతిని ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. దొనకొండ నుంచి మంగళవారం రాత్రి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తూ చిన్నగుడిపాడు గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన మోషను 108 సిబ్బంది దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ్నుంచి ఒంగోలు తరలించగా మృతి చెందినట్లు సమాచారం. ఎస్‌ఐ త్యాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించండి

● మంత్రి స్వామికి దళిత నేతల విజ్ఞప్తి

రాచర్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : దళితుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ సభ్యుడు, గిద్దలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కత్తి అన్నోజీరావు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాలవీరాంజనేయ స్వామిని కోరారు. బుధవారం ఒంగోలులోని మంత్రి కార్యాలయంలో దళిత నేతలతో కలిసి ఆయన మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన దళితుల అభ్యున్నతికి అధిక నిధులు కేటాయించి ఆదుకోవాలని మంత్రిని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరులో కూడా అధిక రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని అన్నారు. గత ప్రభుత్వంలో దళితులు అన్ని విధాలుగా నష్టపోయారని ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి తలెత్తకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో దళిత నేతలు కోలా ప్రసన్న కుమార్, దున్నా యేబు, వెంకటేశ్వర్లు, మహేంద్ర, గురవయ్య పాల్గొన్నారు.

వైసీపీలో రచ్చకెక్కిన విభేదాలు

● పార్టీ సమావేశంలో ఎమ్మెల్యే ఎదుటే రగడ

పుల్లలచెరువు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు మండల వైసీపీ పార్టీలో విభేదాలు రచ్చకెక్కాయి. ఆ పార్టీ మండల సమావేశంలో ఎమ్మెల్యే చంద్రశేఖర్ సమక్షంలోనే ఒక్కసారిగా అవి బయటపడ్డాయి. బుధవారం మండల కేంద్రమైన పుల్లలచెరువులో పార్టీ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైసీపీ నాయకులు స్టేజిపైకి పిలిచే విషయంలో గొడవ పడి రెండు వర్గాలుగా విడిపోయి ఒకరినొకరు తిట్టుకున్నారు. ఎమ్మెల్యే కొద్దిసేపు మాట్లాడి ముగించారు.


శిథిలావస్థకు చేరిన గంటవానిపల్లె గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై వంతెన (ఫైల్)


చెర్లోపల్లి బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

వంతెనలు కట్టరా?

● గంటవానిపల్లె, ఎగువచెర్లోపల్లి ప్రజలకు అవస్థలు ● వానొస్తే రాకపోకలు బంద్

పెద్ద దోర్నాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంటవానిపల్లె, ఎగువ చెర్లోపల్లి గ్రామాలకు వంతెన నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో అనేక కష్టాలు ఎదుర్కోవలసి వస్తోంది. కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి నుంచి సుమారు 2 కిలోమీటర్లు దూరంలోని గంటవానిపల్లెకు వెళ్లాల్సి ఉంది. అయితే గ్రామానికి ముందర తీగలేరు వాగు ప్రవహిస్తూ ఉంటుంది. ఆ వాగుపై ఎప్పుడో దశాబ్దాల కిందట నిర్మించిన చప్టా పూర్తిగా పాడైపోయింది. వానా కాలంలో ఎగువ ప్రాంతంలో కురిసిన వరద నీరు ఈ కాలువ ద్వారా ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వరద ఉధృతి తగ్గేవరకు ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. మామూలు సమయంలో కూడా గ్రామంలోకి వెళ్లాంటే ఆపసోపాలు పడాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇదేవిధంగా ఎగువ చెర్లోపల్లి గ్రామానికి ముందు శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి ఉంది. వర్షాకాలం వస్తే గ్రామంతో పాటు మరో మూడు గ్రామాలకు రాకపోకలు సాగవు. చెరువుగూడెం, చిలకచెర్ల, బంధంబావి గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అడవిపందులు తగిలి వ్యక్తి మృతి


నరసింహం(ఫైల్)

పీసీపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని అడవిపందులు తగలడంతో పీసీపల్లి మండలానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నెల్లూరుజిల్లాలోని లింగసముద్రం మండలంలో బుధవారం చోటుచేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని లింగన్నపాలేనికి చెందిన కరణం నరసింహం(52) ట్రాక్టర్ పనిమీద బుధవారం ఉదయం లింగసముద్రం మండలం మొగిలిచర్లకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మాలకొండ-మొగిలిచర్ల మధ్యలో ఉన్న బక్కజీవాలకుంట సమీపంలోకి వెళ్లేసరికి అడివిలో నుంచి ఒక్కసారిగా అడవిపందుల గుంపు వచ్చింది. దీంతో అవి నరసింహం ద్విచక్ర వాహనాన్ని తగిలాయి. దీంతో అతను బైకు పైనుంచి రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న కొంతమంది చూసి 108కు సమాచారమిచ్చారు. చికిత్స కోసం కందుకూరుకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు దోర్నాల విద్యార్థులు


రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయిన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

పెద్ద దోర్నాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు దోర్నాల విద్యార్థులు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయిని పీ శ్యామ్ ప్రసన్నతాంజలి బుధారం ప్రకటనలో తెలిపారు. ఎర్రగొండపాలెం గురుకులం పాఠశాలలో జూలై 31వ తేదీన నిర్వహించిన పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్ లావణ్య లాంగ్ జంప్, రన్నింగ్‌లో ప్రథమ శ్రేణిలో, పెంటాథ్లాన్ 5 రకాల ఈవెంటులో ప్రతిభ కనపరిచి ద్వితీయ స్థానంలో రాణించింది. యూ మౌర్యచంద్ర సిద్ధార్థ హైజంప్‌లో ప్రథమంగానూ, పీ శివలక్ష్మి 600 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానంలో, కే సంధ్యాబాయి హైజంప్‌లో ద్వితీయంలో రాణించడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 9,10,11వ తేదీల్లో చీరాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా విద్యార్థులు ప్రతిభ కనపర్చాలని ఆకాంక్షించారు. అదేవిధంగా వారి ఎంపికకు కారకులైన వ్యాయామ ఉపాధ్యాయులు పీ రామానాయక్, హెచ్ రామానాయక్‌లను ఉపాధ్యా య సిబ్బంది వీ నాగమూర్తి, విజయ మాణిక్యం, రహమత్, తదితరులు అభినందించారు.

ఉరేసుకుని యువరైతు ఆత్మహత్య


శివ (ఫైల్)

పెద్ద దోర్నాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చెట్టుకు ఉరి వేసుకుని యువ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో బుధవారం జరిగింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన రైతు నాలి శివ (29)మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శివ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆరా తీయగా ఊరి బయటి పొలంలో చెట్టుకు ఉరితో వేలాడుతూ విగతజీవుడిగా ఉండడం గమనించారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సేద్యంలో నష్టాలు వచ్చి ఉరి వేసుకున్నట్లు భార్య జ్యోతి పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్సై మహేష్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు. భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సాగర్ కాలువలో కొట్టుకుపోయిన యువకుడు


మను(ఫైల్)

దొనకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలోకి జారిపడి నీటి ప్రవాహంలో యువకుడు గల్లంతైన సంఘటన మండలంలోని చందవరం గ్రామ సమీపంలోని సాగర్ కాలువలో బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు... మండలంలోని పోలేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బెజవాడ మను, ఎనుబరి నాని, దానియేలు ముగ్గురు యువకులు ఈత నేర్చుకునేందుకు చందవరం గ్రామ సమీపంలోని సాగర్ కాలువ వద్దకు వెళ్లారు. కాలువలో నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గట్టుపై కూర్చున్న బెజవాడ మను (18) అదుపుతప్పి కాలువలోకి జారిపడి కొట్టుకుపోయాడు. అనుకొని ఈ సంఘటనను గుర్తించిన మరో ఇద్దరు యువకులు ఈత రాకపోవటంతో కేకలు వేస్తుండగానే ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు హుటాహుటిన సాగర్ కెనాల్ వద్దకు వెళ్లి అన్నీ వైపులా వెతికినా నీళ్లలో కొట్టుకుపోయిన మను ఆచూకీ కనబడలేదు. ఎస్‌ఐ త్యాగరాజు ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకొని యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

సోషల్ ఆడిట్ సిబ్బందికి సహకరించాలి

దర్శి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : ఎన్ఆర్ఈజీఎస్ పనులను పరిశీలించేందుకు వచ్చిన సోషల్ ఆడిట్ సిబ్బందికి అందరూ సహకరించాలని ఎంపీడీవో సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పంచాయితీ కార్యదర్శులు సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో జరిగిన ఎన్ఆర్ఈజీఎస్ పనులను సోషల్ ఆడిట్ సభ్యులు పరిశీలించి నివేదికలు తయారు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు మురళీ, కళ్యాణి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీల అభ్యున్నతి

పామూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలందరికీ టీడీపీ ప్రభుత్వం అండగా ఉండి వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు అమీర్‌బాబు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాల మేరకు 267 బూత్ పరిధిలో బుధవారం టీడీపీ కరపత్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వైరహీముల్లా, బూత్ ఇన్‌చార్జి హజీ గౌస్, రఫి పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

సీఎస్‌పురం(పామూరు) ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం మండలంలోని కోవిలంపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని శీలంవారిపల్లెంలో సుపరిపాలనకు తొలి ఏడాది కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, నేతలు మన్నేపల్లి శ్రీనివాసులు, పిడుగు బాబురావు, సొసైటి పర్సన్‌ఇన్‌చార్జి సీహెచ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సేవలు మరువలేం

పామూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలకు సంబంధించి సేవలు అందిస్తున్న సచివాలయ సిబ్బంది సేవలు మరువలేమని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మన్నం రమణయ్య కొనియాడారు. మండలంలోని కంబాలదిన్నె సచివాయంలో పనిచేసి బదిలీపై వచ్చిన సిబ్బందిని బుధవారం టీడీపీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో కన్వీనర్ గోళ్ల వీరబాబు, గ్రామ టీడీపీ కార్యదర్శి ఏలూరి నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి ఇండ్ల హరినారాయణ, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృత పరచాలి

పామూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : స్వయం కృషి సేవా సంస్థ ద్వారా పలురకాల సేవలను విస్తృత పరచాలని కలెక్టర్ అన్సారియా సూచించినట్లు సంస్థ అధ్యక్షుడు నాయబ్ రసూల్ తెలిపారు.ఒంగోలులోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా ఆయన కలిశారు. సేవా కార్యక్రమాలకు సంబంధించిన ఫైల్‌ను కలెక్టర్‌కు అందచేసినట్లుతెలిపారు.

ఉన్న ఐదు పోస్టులూ ఖాళీ

ముండ్లమూరు ఎన్ఎస్‌పీ డీఈ కార్యాలయంలో జేఈల కొరత

కొనసాగుతున్న సాగర్ కాలువల ఆధునికీకరణ
పర్యవేక్షణ కొరవడిన వైనం
ఒక్క ఇన్‌చార్జితో నెట్టుకొస్తున్న యంత్రాంగం
పది లస్కర్ పోస్టులకు గాను ఒక్కరే విధులు


ముండ్లమూరులోని ఎన్ఎస్‌పీ డీఈ కార్యాలయం

ముండ్లమూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరులోని ఎన్ఎస్‌పీ డీఈ కార్యాలయం ఖాళీ అయ్యింది. ఇక్కడ మొత్తం ఐదు జేఈ పోస్టులు ఉండగా ప్రస్తుతం ఒక్కరు కూడా లేరు. గత ఏడాది నుంచి కేవలం ఒక్క ఇన్‌చార్జ్ జేఈ మాత్రమే ఉన్నారు. ఆ కార్యాలయం పరిధిలోని మోదేపల్లి మేజరు బాధ్యతలను ఐదుగురు జేఈలు పర్యవేక్షించాలి. ప్రస్తుతం మేజరు కాలువలకు ఆధునీకీకరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు లేకపోవటం వల్ల నాణ్యతపై నీలినీడలు కమ్ముకొన్నాయి. మోదేపల్లి మేజరు పరిధిలో 38వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో 20వేల ఎకరాల మాగాణి భూములు కాగా, 18వేలు ఎకరాల మెట్ట ఉంది. మరో వారం పది రోజుల్లో కాలువలకు సాగర్ జలాలు రానున్నాయి. రైతులు మాగాణి పైరు సాగు చేయటానికి కూడా సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో జేఈ పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో సక్రమంగా సాగర్ జలాలు దిగువకు సక్రమంగా నీరు సరఫరా అవుతాయా, లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. పమిడిపాడు బ్రాంచ్ పరిధిలో మోదేపల్లి మేజరులో జమ్మలమడక మేజరు కాలువ కూడా ఉండటం అది పల్నాడు జిల్లా పరిధిలోనిది కావడంతో ఇంకొంత ఇబ్బంది వాతావరణం నెలకొంది. చివరి భూముల రైతులకు ప్రతి ఏడాది నీరు చేరటం కష్టంగా మారింది. దీనికి తోడు లస్కర్ల 15 ఉండాల్సి ఉండగా కేవలం ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ కూడా ఒక్కరే ఉన్నారు. మోదేపల్లి మేజరు పరిధిలో గాంధీనగర్, వేముల, ఈదర, వేముల బండ, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, నాయుడుపాలెం, తమ్మలూరు, మారెళ్ల, జమ్మలమడక, శంకరాపురం, పోలవరం, కుంకుపాడు, మోదేపల్లి ఆయకట్టు రైతులకు నీరు చేరాల్సి ఉంది. ఇప్పటికైనా కలెక్టర్, ఎన్ఎస్‌పీ ఎస్ఈ స్పందించి ఖాళీగా ఉన్న జేఈ పోస్టులను తక్షణమే భర్తీ చేసి ఆయకట్టు పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

జేఈ పోస్టులను భర్తీ చేయాలి



కంచుమాటి శ్రీనివాసరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, మోదేపల్లి మేజరు

మోదేపల్లి మేజరు పరిధిలో ఐదు జేసీ పోస్టులకు ఒక్కరు కూడా లేరు. ఒక ఇన్‌చార్జ్ జేఈ మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం మోదేపల్లి మేజరులో ముమ్మరంగా సాగర్ కాలువల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. కనీసం పనులు పర్యవేక్షించటానికి అధికారులు లేకపోవటం వల్ల పనుల్లో అక్రమాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

కలెక్టర్‌ను కోరిన దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని ఒంగోలులో బుధవారం కలెక్టర్ తమీమ్‌అన్సారియాను దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. దర్శి మండలం తూర్పువీరాయపాలెంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆరంభించేందుకు వచ్చిన సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసినందుకు, ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నందుకు కలెక్టర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. దర్శి, దొనకొండ, కురిచేడు మండలాలకు తాగునీరు అందించే ఎన్ఏపీ పథకాల ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని కోరారు. మొత్తం తొమ్మిది ఉండగా కేవలం రెండు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. సుమారు 46 ఏళ్ల క్రితం నిర్మించిన పథకం మధ్యలో ఫిల్టర్‌బెడ్లు మరమ్మతులు చేయని కారణంగా నిర్వీర్యమయాయని వివరించారు. వాటి మరమ్మతులకు నిధులు విడుదల చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. రూ.17 కోట్ల నిధులతో చేపట్టనున్న డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణంకు నిధులు విడుదల అయ్యేందుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కోరారు. అంతర్గత రోడ్లు, కాల్వల నిర్మాణం, దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆటస్థలం అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేయగా అందుకు సానుకూలంగా స్పందించినట్లు డాక్టర్ లక్ష్మీ తెలిపారు. తూర్పువీరాయపాలెం, సావంత పూడి రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి నిధులు విడుదల, అర్హులైన 90 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించిన మేరకు తక్షణమే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపినట్లు ఆమె వివరించారు. దొనకొండ మండలంలోని ఆరవళ్లిపాడు గ్రామానికి చెందిన 130 మందికి సాంకేతిక కారణాల వలన తల్లికి వందనం నిధులు అందని విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే పరిష్కారం చూపినట్లు తెలిపారు. ఆమె వెంట టీడీపీ నాయకులు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి నాగులపాటి శివకోటేశ్వరరావు, నవులూరి విద్యాసాగర్ ఉన్నారు.


నిధులు విడుదల చేయాలని కోరుతున్న టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మి

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం

పూజలు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, మాజీ మంత్రి కాశిరెడ్డి



సీతారాముల, లక్ష్మణ హనుమత్ సమేత ప్రతిష్ఠా పూజలు చేస్తున్న వేదపండితులు, ఎమ్మెల్యే ఉగ్ర సన్మానిస్తున్న కేటీఆర్

కనిగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాకిరాల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. ప్రతిష్ఠకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ శిఖర కలశాలకు మహాకుంభాభిషేకాన్ని వేద పండితులు రావినూత రమేష్‌శర్మ ఘనంగా నిర్వహించారు. ఈ కృతువును తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. అనంతరం సీతారాముల కల్యాణం అశేష జనావళి మధ్య కన్నుల పండువగా జరిగింది. దేవస్థాన కమిటీ నిర్వాహకులు కుందురు తిరుపతిరెడ్డి, శారద దంపతులు స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి మేళతాళాల నడుమ పూర్ణకుంభంతో ఆలయ కమిటీ ఘనస్వాగతం పలికింది. ఎమ్మెల్యే.. స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, ఆదిలక్ష్మమ్మ దంపతులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య జాతీయ వాసవీ సత్ర సముదాయాల చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, బాబా దేవస్థాన కమిటీ అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, సాయిసేవాసమితి అధ్యక్షులు దేవకి సుబ్రమణ్యం, ఎంపీపీ ప్రకాశంలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాకిరాల గ్రామస్థులు భక్తులకు అల్పాహారం, అన్న ప్రసాదం, భోజనం వసతి చేపట్టారు.

పోలేరమ్మ తల్లి చల్లగా చూడమ్మా

నాయుడుపాలెంలో వైభవంగా పోలేరమ్మ, గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం
పోటెత్తిన భక్తులు...ప్రత్యేక పూజలు
నిర్వహించిన బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి టీడీపీ యువ నాయకులు కడియాల లలిత సాగర్


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ


పోలేరమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించేందుకు వచ్చిన భక్తులు

ముండ్లమూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెంలో నూతనంగా పోలేరమ్మ, గంగమ్మ, పోతురాజు, కలశ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన భక్తులతో పాటు ముండ్లమూరు, తాళ్లూరు మండలాలు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పురోహితులు బ్రహ్మశ్రీ దుర్భాకుల నగేష్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు కడప జిల్లా బద్వేలు వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ఓరుగంటి సీతారామ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. పోలేరమ్మ, గంగమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్ దేవతామూర్తులను దర్శించుకొని వేద పండితుల చేత తీర్థప్రసాదాలు అందుకున్నారు.

తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం


దొనకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్‌సుభాషిణి, కార్యకర్తలు

పామూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : శిశువు పుట్టిన వెంటనే తల్లి తన ముర్రుపాలు ఇస్తే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్దిస్తుందని ఇన్‌చార్జ్ సీడీపీవో లావణ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్ వాసుదేవరావు, ఎంపీడీవో బ్రహ్మయ్య, సూపర్‌వైజర్ పద్మజ పాల్గొన్నారు.

శిశువు ఎదుగుదలకు పౌష్టికాహారం ముఖ్యం

శిశువు ఆరోగ్యవంతుడిగా జన్మించడానికి తల్లి మంచి పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమని టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని పడమటకట్టకిందపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం సూపర్‌వైజర్ పార్వతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీలర్ నారాయణ, నాయకులు వెంకటకొండయ్య, లక్ష్మణ్, చందు, ఆరోగ్యకార్యకర్త పద్మావతి, ఆశా కార్యకర్త పద్మ, అంగన్‌వాడి కార్యకర్త షేక్ రజియాబేగం పాల్గొన్నారు.

దొనకొండలో...

దొనకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేతేల్‌పురం-2, వీపీపురం, ఆరవళ్లిపాడు, బాదాపురం-2 తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి మాట్లాడుతూ బిడ్డపుట్టిన గంటలోపు ముర్రుపాలు ఇస్తే ఆ బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. కనీసం ఆరు నెలలు తల్లిపాలు కచ్చితంగా ఇవ్వాలని, రెండేళ్ల వరకు ఇస్తే మరింత శ్రేష్ఠమని చెప్పారు. అనంతరం ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ఏ జయమణి, నసీమాసుల్తాన, ఆదిలక్ష్మి, సుభాషిణి, లోయలపల్లి కుమారి పాల్గొన్నారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలతో మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి సీహెచ్ ప్రవీణ్ కుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ కేపీ రాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యశోధ, కార్యకర్తలు శ్రీదేవి, గరటమ్మ, రమణకుమారి, రాజ్యం, జయలక్ష్మి పాల్గొన్నారు.

స్మార్టు మీటర్ల బిగింపు ఆపాలి

అవీఇవీ

దొనకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్టు మీటర్లు బిగింపు తక్షణమే ఆపాలని, బిగించిన స్మార్టు మీటర్లను వెంటనే తొలగించాలని, ట్రూప్ అప్, ఇందనపు సర్దుబాటు తదితర చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక సీపీఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఆదేశాలకు లొంగి గత వైసీపీ ప్రభుత్వం స్మార్టు మీటర్లకు ఒప్పందాలు చేసుకొని అదాని సంస్థకు టెండర్లు కట్టబెట్టి భారీ కుంభకోణానికి పాల్పడిందన్నారు. ఆ ఒప్పందాలను రద్దు చేయకుండా ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించటం ప్రజలను నమ్మకద్రోహం చేయటమేనని విమర్శించారు. అనంతరం విద్యుత్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం కార్యదర్శి కుందుర్తి చిన్ననరసింహులు, ఎర్రగుంట్ల ప్రభాకర్, కోలా కిరణ్‌కుమార్, కురవటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుల నియంత్రణలో విఫలం


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు షమ్మి

పామూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మి ఆరోపించారు. 8వ ఐద్వా మండల మహాసభ స్థానిక శారద విద్యానికేతన్‌లో కే భానుమతి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఐద్వా జిల్లా నాయకురాలు ఊసా రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ ఉపాధి పనులు ఆపడం వలన మహిళలు కుటుంబాలను నడపడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ మస్తానమ్మ, కే ధనలక్ష్మీ, ఉపాధ్యక్షులుగా షేక్ మదారమ్మ, సహాయ కార్యదర్శిగా భానుమతి, కోశాధికారిగా ఖాదర్‌ఉన్నీసాలను ఎన్నుకొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ


వీల్‌చైర్స్‌ను పంపిణీ చేస్తున్న ఎంఈవోలు శ్రీనివాసులు,సంజీవి

పీసీపల్లి, ఆగష్టు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపవరపువారిపల్లి భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, సంజీవిలు బుధవారం వీల్‌చైర్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ సమగ్రశిక్ష ద్వారా దివ్యాంగ చిన్నారులకు అవసరమైన పరికరాలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు పగిడి నాగేశ్వరరావు, జి.శేషిక, ఉపాధ్యాయులు గురవారెడ్డి పాల్గొన్నారు.

మంచీచెడుపై బాలికలు అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీరాం

కనిగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : బాలికలు తమ పట్ల ఇతరులు ప్రవర్తించే తీరులో మంచీచెడులపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ శ్రీరాం చెప్పారు. పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కాలేజీతోపాటు కుట్టు శిక్షణ సెంటర్ వద్ద మహిళలకు బుధవారం గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడుల నుంచి రక్షణ కోసం ప్రత్యేకంగా శక్తి యాప్‌ను రూపొందించిందని, దాని ద్వారా సహాయం పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. ఈ యాప్ ద్వారా ఎక్కడైనా మహిళలు ప్రమాదంలో ఉన్నప్పుడు పోలీసులు అప్రమత్తమై మహిళ ఉన్న చోటుకు వచ్చి రక్షణ కల్పిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ శక్తి యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఆక్స్‌ఫర్డ్ చైర్మన్ భాస్కర్‌రావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ కొండారెడ్డి

కనిగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి చెప్పారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం సీపీఎం పట్టణ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం కల్గించేలా వ్యవహరిస్తూ ప్రజలకు తీవ్ర నష్టం జరిగేలా చేసున్నాయని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నించటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాల వైఖరితో వ్యవసాయరంగంతో పాటు అన్ని రంగాలను సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని ఆరోపించారు. ఈ నెల 12, 13వ తేదీల్లో కనిగిరిలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు కేశవరావు, నరేంద్ర, వెంకటమ్మ, శాంతకుమారి, ప్రసన్న, ఓబయ్య, పిచ్చయ్య పాలొన్నారు.

సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేయండి

ముండ్లమూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు సేంద్రియ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఏ తిరుమలరావు చెప్పారు. బుధవారం మండలంలోని శంకరాపురం, నూజెండ్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ వేసిన ప్రతి పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు భారతీ బాయి, ఆంజనేయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





ప్రమాదం జరిగిన గ్రానైట్ క్వారీలో విచారణ చేస్తున్న మైన్స్ సేఫ్టీ అధికారి కణ్ణన్, డీఎంస్, డీడీఎంస్

గ్రానైట్ క్వారీలో తనిఖీలు

- వివరాలు సేకరించిన సౌత్ జోన్ డిప్యూటీ డీజీఎంఎస్

బల్లికురవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీర్ల కొండ వద్ద ఉన్న గ్రానైట్ క్వారీలో మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో ఆరుగురు ఒడిశా కూలీలు మృతి చెందిన విషయం విధితమే. బుధవారం సౌత్ జోన్ (హైదరాబాద్) డిప్యూటీ మైన్స్ అండ్ సేఫ్టీ డైరెక్టర్ టీఆర్.కణ్ణన్ ప్రమాదం జరిగిన క్వారీలో తనిఖీలు చేశారు. కూలీలు మృతి చెందిన ప్రదేశాన్ని పరిశీలించారు. క్వారీ హద్దులు, భద్రతా చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గనుల్లో ప్రమాదాలు జరగకుండా భద్రత పరంగా కఠిన నిర్ణయాలు తీసకుంటామన్నారు. క్వారీల్లో పనిచేసే మేనేజర్లు, మేట్‌లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. ప్రతి రోజు క్వారీల్లో పనుల ప్రదేశాలను పరిశీలించాకే కార్మికులను అనుమతించాలని స్పష్టం చేశారు. క్షతగాత్రుల వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఈ తనిఖీలో రాష్ట్ర డీఎంస్ అశోక్‌కుమార్, జోన్ డీడీఎంస్ జ్ఞానేశ్వర్, జిల్లా గనుల శాఖ ఏడీ రామచంద్రరావు, సేఫ్టీ టీం సభ్యులు భాస్కరరెడ్డి, సర్వేయర్ నాగలక్ష్మి, క్వారీ యజమానులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నేతల

భారీ చేరికలు

- కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధిని చూసి తెలుగుదేశం పార్టీలో చేరిన మూడు గ్రామాల ముఖ్య వైసీపీ నేతలను, అనుచరులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని చిమ్మిరిబండ సర్పంచ్ జంపని వీరయ్య 30 కుటుంబాలతో, లక్కవరం సర్పంచ్ అట్లూరి జెస్సీబాబు 3 కుటుంబాలతో ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు సమక్షంలో పార్టీలో చేరారు. నాగరాజుపల్లి గ్రామానికి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దాసం అశోక్ కుమార్ తండ్రి, వైసీపీ ముఖ్య నేత హనుమంతరావు తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు, నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేయాలని కొత్తగా చేరిన వారికి సూచించారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ గెలిచే పరిస్థితే లేదన్నారు. ఈ కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, మిన్నెకంటి రవికుమార్, కామేపల్లి హరిబాబు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, జాగర్లమూడి శ్రీనివాసరావు, కోటపాటి సురేష్, పెంట్యాల శ్రీను, కమ్మ శివనాగేశ్వరరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ ముఖ్యనేత దాసం హనుమంతరావు, అనుచరులు

గత ప్రభుత్వ అవకతవకలపై సమగ్ర విచారణ

- సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ చేయిస్తామని, సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం చీలు రోడ్డులోని ఓ టీ దుకా ణం వద్ద స్థానికులతో ఆయన చాయ్ పే చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్లలోని రామానుజం కూటంపై ఆయన మాట్లాడారు. రామానుజం కూటంను తొలగించి.. లాడ్జి నిర్మాణ ప్రతిపాదనలు వచ్చినప్పుడే అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతిని స్వయంగా కలిసి తాను అభ్యంతరం తెలిపానని ఆయన చెప్పారు. దేవదాయ శాఖ విడుదల చేసిన జీవోల్లో కూడా గతంలో ఎప్పుడూ లేని విధంగా.. స్థానిక ఎమ్మెల్యే డైరెక్షన్ అని రాశారని తెలిపారు. ఇలా రాయడానికి వెల్లేదని మాధవ్ స్పష్టం చేశారు. లాయర్ విన్నకోట సత్యప్రసాద్ రామానుజ కూటంలో జరిగిన అవకతవకలను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో..విచారణ చేయి స్తామని చెప్పారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ వర్గాల వ్యక్తులతో బీజేపీ అధ్యక్షుడు మాధవ్ మాట్లాడారు. బాపట్ల రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలుకు స్టాప్ కల్పించాలని స్థానికులు కోరారు. నిలిచిన బాపట్ల మెడికల్ కళాశాల అంశాన్ని ప్రస్తావిం చగా త్వరలోనే నూతన విధానంలో పనులు ప్రారంభమ వుతాయని వెల్లడించారు.



చీలురోడ్డు సెంటర్‌లోని ఓ టీ దుకాణం వద్ద జరిగిన చాయ్ పే చర్చ కార్యక్రమంలో మాధవ్

కార్యకర్తల సమావేశంలో...

పట్టణంలోని సాయి కన్వెన్షన్ హాలులో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు మాధవ్ భవిష్యత్ కార్యాచరణపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పనిచేయాలని సూచించారు. గ్రామగ్రామాన బీజేపీ జెండా ఎగిరేలా కృషి చేయాలన్నారు. దేశసమైక్యత చాటేలా ప్రధాని మోదీ పాలన సాగుతుందన్నారు. బిగ్‌బాస్ విన్నర్ కౌశిక్ మాట్లాడుతూ తాను బాపట్ల అల్లుడినని, ఆ అనుబంధంతోనే ఇక్కడకు వచ్చానని బీజేపీ స్ఫూర్తి దాయక పాలన అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి దయాకర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, జిల్లా ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, జాతీయ ఎస్సీ మోర్చా సెక్రటరీ ఇస్కా సునీల్ తదితరులు పాల్గొన్నారు.

లోపాలపై లోతుగా తనిఖీ..!

- ప్రజావేదికలో బయటపడుతున్న అక్రమాలు
- మరో రోజు కూడా నిర్వహించే అవకాశం
- పాల్గొన్న డ్వామా పీడీ విజయలక్ష్మి

బల్లికురవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీలపై బుధవారం బల్లికురవ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక జరిగింది. ఉదయం 10 గంటలకు డ్వామా పీడీ విజయలక్ష్మి పర్యవేక్షణలో ప్రజా వేదిక ప్రారంభం కాగా.. రాత్రి 8 గంటలకు మూడు గ్రామాల్లో జరిగిన పనులపైనే తనిఖీల వివరాల వెల్లడి కొనసాగింది. ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున అవకతవకలు బయట పడుతుండటంతో.. ప్రజా వేదిక సభ ముందుకు పోవడం చాలా కష్టంగా మారింది.

- కొప్పెరపాలెంలో హార్టి కల్చర్‌లో మొక్కలు వేయకుండానే నిధులు డ్రా చేశారని, అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు వెలుగు వీపీఓలకు మస్టర్లు వేశారని గుర్తించారు. చెక్ డ్యాంలో పనులు చేయకుండానే.. రూ.6 లక్షల నిధులు డ్రా చేశారని గుర్తించారు. ఈ గ్రామంలో రూ. 9 లక్షల పైబడి అకమాలు జరిగిన్నట్లు గుర్తించారు.
- కొమ్మినేనివారిపాలెంలో మస్టర్లు లేకుండా కూలీలకు నగదు చెల్లించారని, పనులలో కొలతలు తేడా ఉన్నట్లు గుర్తించారు.
- ముక్తేశ్వరంలో 28 కాల్వల పనులు చేయగా.. 20 పనుల్లో కొలతలు తేడాలు ఉన్నాయని రూ.లక్షల మేర అక్రమాలు జరిగాయని ఆడిట్ బృందం తేల్చింది. అలానే అమృత్ సరోవర్ కుంటలో కొలతలు చాలా వరకు తేడాలు ఉన్నాయని.. నగదు డ్రా చేశారని తెలిపారు.

ప్రజా వేదిక సభ గురువారం కూడా జరుగుతుందని అధికారులు తెలిపారు. స్టేట్ విజిలెన్స్ ఆఫీసర్ భవాని హర్ష, ఎస్ఆర్‌పీ తులసినాయక్, ఆడిట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఏపీడీ కోటయ్య నాయక్, క్వాలిటీ అధికారి సతీష్, ప్రోగ్రాం మేనేజర్ సునీల్‌కుమార్, ఎంపీడీవో కుసుమకుమారి, ఏవో పాండురంగస్వామి, డీపీఎం సనిత పాల్గొన్నారు.



బల్లికురవలో అవకతవకలపై సిబ్బందిని ప్రశ్నిస్తున్న పీడీ విజయలక్ష్మి

ఈదుపల్లిని సందర్శించిన ఇన్‌చార్జి జేసీ

నగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రబలుతున్న విషజ్వరాల నేపథ్యంలో స్థానిక సమస్యలపై అధికారులు స్పందించారు. ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్ బుధవారం గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా చర్యలు చేపడతామని హామీనిచ్చారు. అలా గే గ్రామంలో మురుగుకాల్వల నిర్మాణానికి అవసరమైన నివేదిక ఉన్నతాధికారులకు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాంచారయ్య, డీపీవో ప్రభాకర్, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివరామకృష్ణ పాల్గొన్నారు.



చేనేతల జీవితాల్లో.. వెలుగులు

- నేటి నుంచి ఉచిత విద్యుత్ అమలు
- మగ్గాలకు 200, మర మగ్గాలకు 500 యూనిట్లు
- జిల్లాలో 5,885 మంది కార్మికులకు ఉపశమనం
- నేడు చీరాల్లో జాతీయ చేనేత దినోత్సవం

చీరాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. మగ్గాలపై పనిచేసే వారికి 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్‌ను ప్రకటించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 5,885 మంది చేనేత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోనున్నారు. జిల్లాలో మొత్తం సొసైటీల్లో, వ్యక్తిగతంగా సుమారు 23 వేల మంది చేనేత కార్మికులు పనిచేస్తున్నారు. సర్వే నిర్వహించి అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేశారు. కొన్ని సాంకేతిక, ఇతర కారణాల వల్ల ఎంపిక కాని వారినీ అధికారులు పరిశీలిస్తున్నారు. మరోవైపు జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తు నేతన్నలకు భరోసా కల్పిస్తోంది. చేనేత దినోత్సవం పురస్కరించుకుని చేనేతలకు ప్రభుత్వం ఒక విధంగా చక్కని భరోసా కల్పించిందనే చెప్పవచ్చు. అంతేకాకుండా నిత్యం మగ్గాలపై పని చేస్తూ.. కళ్లు, కిడ్నీ సమస్యలతో పాటు వివిధ రకాల ఆనారోగ్య సమస్యలను గుర్తించి.. ప్రభుత్వం హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కల్పించేందుకు.. ప్రణాళిక చేస్తున్నట్లు అధికారులు అంటు న్నారు. గురువారం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, స్థానిక ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం నిర్వహించనున్నారు.

ఆందోళనలో ఉప వృత్తులు

చేనేత ఉప వృత్తుల కార్మికులు ఆందోళనలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ సౌకర్యం వీరికి ఆమడ దూరంగా నే ఉంది. దీనిపై అధికారులు సర్వే చేశారే గానీ.. పూర్తిగా భరోసా కల్పించక పోవడంతో వారు సందిగ్ధంలో ఉన్నారు. చేనేత రంగంలో రాట్నం తిప్పేవారు, డయింగ్ యూనిట్లులో పనిచేసే కార్మికులు, పొడుగులు నేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న వారు జిల్లాలో సుమారు 2 వేల మంది ఉన్నారు.

ఉచిత విద్యుత్‌తో ఆనందం

- ప్రమీల, చేనేత కార్మికురాలు



నాలుగు దశాబ్దాలుగా చేనేత రంగంపై ఆధారపడి కుటుంబాన్ని నా భర్తతో కలిసి పోషిస్తు న్నాను. ఇద్దరు ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేసి.. వయోభారంతో ఉన్నాం. కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించడం ఆనందంగా ఉంది. వైద్య సాయం కూడా అందించాలి.

పిల్లల చదువులకు ప్రోత్సాహమివ్వాలి

- మల్లికార్జునరావు, చేనేత కార్మికుడు



ఉచిత విద్యుత్ ప్రకటన ఆనందంగా ఉంది. చేనేత రంగంపైనే ఆధారపడ్డాను. కూలీలు గిట్టక.. పూట గడవక అవస్థలు పడుతున్నాం. నాకు ఇద్దరు పిల్లల్లో.. ఒకరిని బీటెక్, మరొకరిని పాలిటెక్నిక్ అప్పులు చేసి చదివించాను. పిల్లల చదువులకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలి.

కదిలిన యంత్రాంగం

బలిజేపల్లి, నంబరు వన్ కాల్వలకు నీటి విడుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


వేమూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన 'నెర్రెలిచ్చిన సాగు నేల' కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. బుధవారం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో.. రేపల్లె ఏడీఏ లక్ష్మి, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రేమ్‌సాగర్ బలిజేపల్లి, నంబరు వన్ కాల్వలను పరిశీలించారు. వాటి పరిధిలోని వెదనాట్ల దుస్థితిని గమనించారు. సాగునీటి విడుదల విషయంపై ఏఈ రవితో చర్చించారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఈ బుధవారం ఉదయం 10 గంటలకు కొల్లిపర ప్రధాన కాల్వ నుంచి 250 క్యూసెక్కుల నీటిని రెగ్యులేటరీ నుంచి పూర్తిగా కిందకి వదిలారు. దీంతో రెండు కాల్వల పరిధిలోని అబ్బనగూడవల్లి, బలిజేపల్లి, కోడిపర్రు, పెనుమర్రు, తాడిగిరిపాడు గ్రామాల పరిధిలోని సాగు భూములకు గురు, శుక్ర వారాల్లో పుష్కలంగా సాగునీరు అందనుంది. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బూతుమల్లి రెగ్యులేటరీ నుంచి సాగునీటిని కిందికి వదిలిన చిత్రం

సర్దుబాటు ఎప్పుడో..!

- అడ్మిషన్లు లేక ఖాళీగా ఉంటున్న ఉపాధ్యాయులు
- రూ.వేలల్లో జీతాలు.. రియల్టర్లు, బిల్డర్స్‌గా అవతారం
- కదలని సబ్జెక్ట్ టీచర్ల సర్దుబాటు ప్రతిపాదన



ఉమ్మడి గుంటూరులో 60కి పైగా ఎయిడెడ్ పోస్టులు

సబ్జెక్టు టీచర్లు లేక సతమతం అవుతున్న పాఠశాలలు ఒక వైపు.. మరోవైపు ఎయిడెడ్ పాఠశాలల్లో సంతకాలు పెట్టి వెళ్తూ రూ.వేలల్లో ప్రభుత్వ జీతం తీసుకుని ఖాళీగా ఉంటున్న ఉపాధ్యాయులు కొందరు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 60 మందికి పైగా ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు నెలల తరబడి ఖాళీగా ఉంటూ జీతాలు తీసుకుంటున్నారు. వీరిని సర్దుబాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నా.. అమలు కావడం లేదు. ఫలితంగా ప్రభుత్వం రూ.లక్షల్లో జీతాలు చెల్లిస్తూ.. వారిని బోధనకు దూరం చేస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి.

గుంటూరు (విద్య) ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని భట్టిప్రోలు, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, కొల్లూరు, బాపట్ల, రేపల్లె, ఫిరంగిపురం, అమరావతి, గుంటూరు ఇలా అనేక మండలాల్లో యాజమాన్యాల ఆధ్వర్యంలో

(మిగతా 6లో)


రూ.లక్షల్లో జీతాలు

యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తోంది. ఒక్కో ఉపాధ్యాయుడికి సగటున రూ.70 వేల నుంచి రూ.1.25 లక్షల వరకు సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు ఇస్తోంది. ఇలా ఉమ్మడి జిల్లాలో దాదాపు నెలకు రూ.1.20 కోట్ల వరకు ఉపాధ్యాయులకు జీతాలు రూపంలో ప్రభుత్వం భరిస్తోంది. కానీ, బోధన పరంగా వారి నుంచి ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. అడ్మిష న్లు లేని పాఠశాలల్లో కొంతమంది ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం వచ్చి హాజరు వేయించుకుని వెళ్త న్నారు. ఇందులో చాలా మంది రియల్టర్లు, బిల్డర్లుగా మారారు. మరికొందరు ప్రయివేటు చిట్స్ నిర్వహణలో మునినిపోయారన్న ఆరోపణలున్నాయి. వీరిని సబ్జెక్టు టీచర్లు అవసరమైన పాఠశాలలకు బదిలీ చేసి.. బోధన వైపు మళ్లించాలన్న విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.



రాజధానిలో.. దళారుల దందా

- కురగల్లుకు చెందిన ఒక అసైన్డ్ రైతు ప్రభుత్వం ఇచ్చిన 500 గజాల రిటర్న బుల్ ప్లాటును ఇటీవల బేరం పెట్టాడు. అక్కడ భూమి విలువ గజం రూ.35 నుంచి రూ.40వేల వరకూ ఉంది. అయితే ఆ ప్లాటుకు అసైన్డ్ వంక పెట్టి గజం రూ. 24 వేలకు కొన్నారు. దీంతో ఆ రైతు గజానికి రూ.10వేల వంతున.. మొత్తం 500 గజాలకు రూ.50 లక్షల వరకూ నష్ట పోయాడు.
- నీరుకొండ గ్రామానికి చెందిన మరొక రైతు తన రిటర్నబుల్ ప్లాటును బేరం పెట్టగా. తొలుత గజం రూ.45వేలకు కొనేందుకు సిద్ధమయ్యారు. అయితే స్టాంపు పేపర్లలో భూమి స్వభావం అసైన్డ్ అని ఉండడంతో గజానికి రూ.8 వేలు తక్కువకు అడిగారు. దీంతో ఆ రైతు భూమి అమ్మేందుకు నిరాకరించాడు.





- కారుచౌకగా స్థలాలు కాజేస్తున్న రియల్టర్లు
- రిటర్నబుల్ ప్లాట్లు.. అసైన్డ్ అంటూ ప్రచారం
- గజానికి రూ.10 నుంచి 20 వేల ధర తగ్గింపు
- సీఎం దృష్టికి తీసుకువెళ్లిన రాజధాని రైతులు
- అయినా ఆగని దళారుల దోపిడీ..

గుంటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో అసైన్డ్ రైతుల రిటర్నబుల్ ప్లాట్లపై దళారుల దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధానిలో భూముల రేట్లు విపరీతంగా పెరిగినప్పటికీ.. అసైన్డ్ రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్ల ధరలు మాత్రం పాతాళంలోనే ఉన్నాయి. దళారులంతా ఒక్కటై (మిగతా 6వ పేజీలో)



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి ఇబ్రహీం షరీఫ్

హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలి

● న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్

ఒంగోలు క్రైం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారిక సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయాధికారి షేక్ ఇబ్రహీం షరీఫ్ తెలిపారు. బుధవారం ఒంగోలులోని రవాణా శాఖ కార్యాలయంలో అసంఘటిత కార్మికుల కోసం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన న్యాయాధికారి ఇబ్రహీషరీఫ్ మాట్లాడుతు వాహన యజమానులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. అదేవిధంగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చేసుకోవాలని సూచించారు. తద్వారా ప్రమాదాలు జరిగిన సమయంలో బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని చెప్పారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇన్సూరెన్స్ కంపెనీలు బాధితులకు తమ వయస్సు, చేసే ఉద్యోగం లెక్క కట్టి పరిహారం అందజేస్తాయని పేర్కొన్నారు. వాహనచోదన చేసే సమయంలో తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలన్నారు. కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ భవానీ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు తప్పనిసరిగా ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దీనిని ఉచితంగానే చేస్తారని, 16 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. తద్వారా ప్రభుత్వం కల్పించే సామాజిక భద్రత, సంక్షేమ పథకాలకు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 7 నుంచి 17వ తేదీ వరకు కార్మికశాఖ ప్రత్యేక రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించిందని, జిల్లాలో కార్మికులు అందరు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ ఆటోలలో డీజే సౌండ్స్ పెట్టి వాహనలు నడపడటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా తమ లైసెన్స్ వాహనంనకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింగరావు, బాలల హక్కుల పరిరక్షణ అధికారి దినేష్, ఎంవీఐ కిరణ్‌ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అర్జీల పరిష్కారమవుతున్న తీరుతోపాటు పౌరసరఫరాలు, రెవెన్యూ సంబంధిత అంశాలపై బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి సమీక్షించారు. గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఈ కార్యక్రమాన్ని సమీక్షిస్తున్నారన్నారు. ఆడిట్‌లో పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీల విషయంలో పెండింగ్ ఉండరాదన్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తున్నందున అర్జీదారులతో అధికారులు మర్యాదపూర్వకంగా మాట్లాడాలని కలెక్టర్ సూచించారు. దుకాణాల ద్వారానూ, వృద్ధులకు నేరుగా ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీలో పురోగతి ఉండాలన్నారు. సమావేశంలో డిఆర్వో చిన ఓబులేషు, వివిధశాఖల అధికారులు పద్మశ్రీ, వరలక్ష్మీ, కలెక్టరేట్ ఏవో రవి, గ్రీవెన్స్ ఆడిట్ బృంద సభ్యులు, ఇతర అధికారులు ఉన్నారు.



సీతారామయ్యను సత్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పీడీసీసీ బ్యాంకుకు ఉత్తమ ప్రతిభా పురస్కారం

ఒంగోలు విద్య, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ పనితీరు చూపినందుకు, వ్యాపార లావాదేవీలను గణనీయంగా పెంచినందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(పీడీసీసీ)కు ఉత్తమ ప్రతిభా అవార్డు లభించింది. బ్యాంకు సేవలకు గుర్తింపుగా బ్యాంకు పీఐసీ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను సత్కరించారు. విజయవాడలో బుధవారం జరిగిన ఆప్కాబ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జిల్లాకు ఈ అరుదైన గౌరవం లభించింది. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన డీసీసీబీలు, సొసైటీలను ఎంపిక చేసి ఉత్తమ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సౌత్ జోన్‌లో మెరుగైన పనితీరుతో ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. 2025 మార్చి ఆఖరుకు పీడీసీసీ బ్యాంకు రూ.3434 కోట్ల వ్యాపారం చేసింది. ఈ మొత్తంలో రూ.866 కోట్లు డిపాజిట్లు కాగా రూ.2568 కోట్ల రుణాలు పంపిణీ చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో బ్యాంకుకు ఉత్తమ ప్రతిభా అవార్డుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖలమంత్రి కింజారపు అచ్చెనాయుడు, ఆప్కాబ్ చైర్మన్ గ్రంధి వీరాంజనేయులు చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా అవార్డును బ్యాంకు చైర్మన్ డాక్టర్ సీతారామయ్యకు అందజేశారు. అనంతరం డాక్టర్ సీతారామయ్యను శాలువ, మెమోంటోతోను సత్కరించారు. డీసీసీబీలు, సొసైటీలను పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణ చేసి రైతులకు, ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని, అందుకోసం కార్యాచరణను రూపొందించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. బ్యాంకు సీఈవో ప్రకాష్ కూడా మెమొంటోను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకారశాఖ కమిషనర్ ఏ.బాబు, 13 జిల్లాల డీసీసీబీల చైర్మన్లు ఉన్నారు.

కడలూరు, కారైకల్ బోట్లను కట్టడి చేద్దాం

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి
● తరలివచ్చిన నాలుగు జిల్లాల గంగపుత్రులు
● జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చిన కడలూరు బోటు

బిట్రగుంట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కడలూరు, కారైకల్ మెటనైజ్డ్ హెవీమోటర్ బోట్లను సమష్టిగా కట్టడి చేద్దామని నాలుగు జిల్లాల మత్స్యకార పెద్దలు, కాపులు నిర్ణయం తీసుకున్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రాంగణంలో నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సంబంధించిన తీరప్రాంత మత్స్యకార గ్రామకాపులు, పెద్దలతో బుధవారం పొద్దుపోయాక నిర్వహించిన సమావేశంలో 160 మత్స్యకార గ్రామాలకు చెందిన గంగపుత్రులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కడలూరు, కారైకాల్ బోట్లు అనుమతులు లేకుండా ఆంధ్ర సముద్ర తీరంలో మెటనైజ్డ్ హెవీమోటర్ బోట్లతో అక్రమంగా చేపల వేట సాగించడాన్ని అరికట్టేందుకు తమ అభిప్రాయాలను తెలియచేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. జూలై 31వ తేదీన ఇందుకూరుపేట మండలం కృష్ణాపురం వద్ద సముద్ర చేపల వేటకు కడలూరు మెటనైజ్డ్ హెవీమోటర్ బోటు వచ్చిందని, స్థానిక మత్స్యకారులు ప్రాణాలకు తెగించి ఆ బోటును అడ్డగించి తీరం చేర్చుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తీరప్రాంత మత్స్యకార పెద్దలకు సమాచారం తెలియచేసి ఆగస్టు 1వ తేదీన కాపుల నిర్ణయం మేరకు జిల్లా మత్స్యశాఖ అధికారులచే కడలూరు బోటులోని చేపల వేటకు వచ్చిన వారిని పంపించినట్లు తెలిపారు. అందరి నిర్ణయం మేరకు కడలూరు బోటును 2న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చామన్నారు. కడలూరు, కారైకల్ హెవీమోటర్ బోట్లను ఎదుర్కోవడానికి ఫైబర్ బోట్ల సామర్థ్యం చాలదని, అందరి సహాయ సహకారాలతో మెటనైజ్డ్ బోటుతో సముద్రంలో కాపలా కాసేందుకు నిర్ణయం తీసుకున్నారు. మెటనైజ్డ్ బోటు కొనుగోలు చేయాలంటే రూ.1.5 కోట్లకుపైగా అవుతుందని పెద్దలు అంటున్నారు. కడలూరు, కారైకల్ బోట్లను ఎదురించేందుకు రెండేళ్ల క్రితం అల్లూరు మండలం ఇస్కపల్లిలో మత్స్యకారుల సమావేశంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. సముద్ర చేపల వేటలో మనవారి ఫైబర్‌బోట్లు, వలలను చాలాసార్లు ధ్వంసం చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి కాబట్టి తమిళనాడు బోట్లను కడలూరు బోటుతోనే ఎదుర్కోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో అధికారులు మత్స్యకారులకు సహకరించాలని నాలుగు జిల్లాల గంగపుత్రులు కోరారు.





సమావేశానికి హాజరైన తీరప్రాంతాల గంగపుత్రులు (ఇన్‌సెట్లో) జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చిన కడలూరు బోటు

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

● డీఏవో సుబ్రమణ్యేశ్వరరావు

మార్టూరు,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని, వివిధ రకాలైన కషాయాలు, ద్రవ జీవామృతం,ఘన జీవామృతం వాడకను మెరుగుపరచాలని డీఏవో ఎం. సుబ్రమణ్యేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కోలలపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన రైతుల సమావేశానికి ఏడీఏ కె. సుదర్శన రాజు అధ్యక్షత వహించారు. అనంతరం డీఏవో సుబ్రమణ్యేశ్వరరావు మాట్లాడుతూ రసాయన ఎరువులు,పురుగుమందుల వాడకం తగ్గించి, భూమిలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంపొందించడానికి ప్రకృతి వ్యవసాయం మార్గమన్నారు. అదేవిధంగా సొసైటీ ద్వారా ఎరువులను పంపిణీ చేయాలని రైతులు అధికారులను కోరారు. అంతకు ముందు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట సాగు చేసిన రైతు సాంబశివరావు మొక్కజొన్న పొలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి లావణ్య, సర్పంచ్ ఎం. సతీష్ కుమార్,మాజీ ఎంపీటీసీ తాటి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



కోలలపూడి గ్రామంలో మినుము విత్తనాల కిట్‌ను రైతుకు అందజేస్తున్న డీఏవో సుబ్రమణ్యేశ్వరరావు, ఏడీఏ సుదర్శనరాజు తదితరులు

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రతి రెండు లేక మూడు సంవత్సరాలకు భూసారపరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి కుమారి అన్నారు.బుధవారం యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి, పెద్దివారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగ,మినుము, జొన్న, మొక్కజొన్న వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకట శివ, ఎంపీటీసీ సాంబశివరావు,పెద్దివారిపాలెం సర్పంచ్ వెంకటసుబ్బయ్య, వీఏఏ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పంగులూరు : పంటసాగులో సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు అనుసరించడం లాభదాయకమని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కశ్యాపురం, రేణంగివరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హులందరికీ వర్తిస్తుందని, ఆధార్‌లో తప్పులున్న వారు వాటిని సవరించుకుని తగిన లబ్ధిపొందవచ్చన్నారు. స్థానిక రైతులతో కలసి సాగులోఉన్న మొక్కజొన్న పైరును పరిశీలించారు. కార్యక్రమంలో నేతలు ఓబుల్‌రెడ్డి, నారాయణస్వామి, నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

రమణాయపాలెం(పర్చూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు సంపూర్ణ ఆరోగ్యమని బిడ్డ పుట్టిన వెంటనే తప్పక తాగించాలని సూపర్ వైజర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని రమణాయపాలెం గ్రామంలో గర్భిణీలు, బాలింతలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యవంతమైన జీవితానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈకార్యక్రమంలో కార్యకర్త అంగమ్మ, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతను తెలుసుకోండి

మార్టూరు : బిడ్డలకు తల్లిపాలు ఇవ్వాలని సూపర్ వైజరు పద్మ అన్నారు. మండలంలోని జొన్నతాళి గ్రామంలో బుధవారం ద్రోణాదుల సెక్టారు పరిధిలోని అంగనవాడీ కార్యకర్తలు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శివకుమారి, ఎంఎస్‌కె సుజాత, అంగనవాడీ కార్యకర్తలు ఎ కోటేశ్వరమ్మ,ఎ శ్రీదేవి,ఆశా కార్యకర్తలు స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న సిబ్బంది

ముర్రుపాలతో సంపూర్ణ ఆరోగ్యం

చినగంజాం : బిడ్డ పుట్టిన వెంటనే తల్లి వ ుు ్ర ు పా ల న ు అందిస్తే వ్యాధులు దరి చేరవని, వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని సంతరావూరు వైద్యాధికారి కే.కీర్తిసరోజ్ అన్నారు. కడవకుదురు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు బుధవారం తల్లిపాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే.ఉషాకుమారి, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు, గ్రామ కార్యదర్శి పర్చూరు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



చినగంజాం : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సంతరావూరు వైద్యాధికారి కీర్తి సరోజ్

తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు

పంగులూరు :పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతోమేలని వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య అన్నారు. మండలంలోని ముప్పవరం ఉపకేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు క్రమం తప్పకుండా ఇవ్వాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీలు సుధ, శ్యామల, ప్రసన్న, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేష్టం

చీరాల : స్వచ్ఛమైన ముర్రుపాలు బిడ్డకు శ్రేష్ఠమని, బిడ్డ జన్మించాక గంటలోపే అందించాలని అంగన్వాడీ సీ సెక్టార్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ముత్యాలపేట, గొల్లపాలెం, కటకం వారి వీధి, భావనాఋషి పేట, అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కె తేజస్విని, అంగన్వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, కృష్ణకుమారి, భారతి, ప్రియాంక, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సంతమాగులూరులో..

సంతమాగులూరు : స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం తల్లిపాల వారోత్సవం మరియు ట్రీ ప్లాంటేన్ కార్యక్రమం సీడీపీవో సుధ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పీడీ రాధామాధవి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిర్మల్ కుమార్, ఏఎంసీ చైర్మన్ టి. రమేష్, సూపర్‌వైజర్లు జి . ప్రమీల, సుష్మ రాణి , గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి హత్య?

● ఒంగోలు శివారులోని చెరువులో తేలిన మృతదేహం ● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు క్రైం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని శివారు ప్రాంతమైన అగ్రహారం సమీపంలోని రంగసాయికుంటలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం వెలుగుచూసింది. బుధవారం సాయంత్రం పోలీసులు దానిని బయిటకు తీశారు. అయితే మృతదేహంపై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో యువకుడిని ఎక్కడో హత్య చేసి ఇక్కడి చెరువులో పడవేసినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. శరీరం అంతా కుళ్లిపోయి నీటిపై తేలడంతో పొలం పనులు చేసుకునే వారు ఇచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, తాలుకా సీఐ విజయకృష్ణ తమ సిబ్బందితో వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

అదృశ్యమైన యువకుడు అతనేనా..?

గత నెల 27న నెల్లూరు జిల్లా బోగోలు మండలం చెన్నరాయునిపాలెంనకు చెందిన ధన్యాశి నవీన్ (25) అదృశ్యమయ్యాడు. ఈమేరకు కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 5న కేసు నమోదైంది. నవీన్‌కు కొత్తపట్నం మండలానికి చెందిన ఓ యువతితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆమె కోసం ఇప్పటికే పలుమార్లు ఆ గ్రామానికి వచ్చి ఆమె గురించి వాకాబు చేశాడు. అదేవిధంగా గత నెల 27న మోటార్‌సైకిల్‌పై వచ్చి ఇక్కడి యువతి గురించి వాకబు చేస్తుండగా ఆమె బంధువులు నవీన్‌ను చితకబాదారు. అప్పటి నుంచి నవీన్ కనిపించడం లేదు. దీంతో నవీన్ మోటార్‌సైకిల్, బ్యాగ్‌ను ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అదేక్రమంలో నవీన్ తల్లి ఈనెల 5న కొత్తపట్నం వచ్చి తన కుమారుడు గత నెల 27న వచ్చి ఇప్పటి వరకు తిరిగి ఇంటికి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీంతో కేసు నమోదు చేశారు. అయితే ఒంగోలు శివారులోని రంగసాయికుంటలో యువకుడి మృతదేహాన్ని బుధవారం గుర్తించడంతో పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నవీన్‌ను హత్యచేసి కుంటలో పడవేశారా అనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే యువతి బంధువులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే నవీన్ బంధువులను గురువారం ఒంగోలుకు రావాలని పోలీసులు కోరారు. వారు వచ్చి మృతదేహాన్ని గుర్తిస్తే కొన్ని నిజాలు బయిటకు వచ్చే అవకాశం ఉంది.

ఉత్తమ సొసైటీగా ఉప్పుగుండూరు

నాగులుప్పలపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సొసైటీగా ఉప్పుగుండూరు సహకార సంఘం ఎంపికయింది. 2024-25 ఏడాదికి గాను రైతులకు రుణాలు, ఎరువులను లక్ష్యం మేరకు అందించి ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ఉత్తమ సొసైటీగా అవార్డును అందుకొంది. బుధవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ,సహకార శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడి చేతులు మీదుగా ఉప్పుగుండూరు సొసైటీ అధ్యక్షుడు కొట్రగడ్డ చంద్రబాబు, సీఈవో నన్నపనేని కోటేశ్వరరావు అవార్డులను అందుకున్నారు.

దళారుల దందా!

(5వ పేజీ తరువాయి)

అసైన్డ్ భూములన్న వంకతో వారి భూములను కారు చౌకగా కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దళారుల దందాలో ఎంతోమంది సామాన్య రైతులు రూ.లక్షలకు లక్షలు నష్టపోతున్నారు.

● **అసైన్డ్ రైతుల ప్లాట్లే టార్గెట్**

రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రభుత్వం భూసమీకరణ చేశారు. 29వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూములను ప్రభుత్వానికి ఇచ్చారు. వారిలో 29 గ్రామాలకు చెందిన 3,139 మంది అసైన్డ్ రైతులు.. 2,689.14 ఎకరాల భూములు ఇచ్చారు. వారి భూములపై సీఐడీ కేసులు వేసిన గత ప్రభుత్వం.. వారి స్థలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి ఐదేళ్లపాటు వేధించింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ భూములకు సర్వహక్కులు కల్పించింది. రిటర్నబుల్ ప్లాట్లను ప్రభుత్వం చట్టపరంగా రిజిస్టర్ చేసి అందిస్తోంది. అలా ఇచ్చే క్రమంలో రైతులు ప్రభుత్వానికి ఇచ్చిన భూమి స్వభావం అనే కాలమ్ వద్ద 'అసైన్డ్' అని నమోదు చేస్తోంది. ఈ పదాన్ని అడ్డం పెట్టుకుని దళారులు రైతులను మోసం చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు కూడా 'అసైన్డ్' స్వభావం ఉంటుందని చెప్పి, వాటికి ఎలాంటి హక్కులూ సంక్రమించవని, బ్యాంకుల నుంచి రుణాలు రావని చెబుతూ గజంపై రూ.10వేలు నుంచి రూ.20 వేల తగ్గిస్తున్నారు.

● **సీఎం దృష్టికి వ్యవహారం**

దళారుల దోపిడీని రాజధాని రైతులు ఇటీవల జరిగిన సమావేశంలో నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికే తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం ప్రభుత్వం రిజిస్టర్ చేసి ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు అసైన్డ్ ఎలా అవుతాయి అంటూ సీఆర్డీఏ అధికారులను ప్రశ్నించారు. దానిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినప్పటికీ దళారుల దందా తగ్గలేదు. ఇప్పటికీ అదే దోపిడీ కొనసాగుతోంది.

● **సీఆర్డీఏ స్పందించకుంటే నష్టమే**

రైతులకు ప్రభుత్వం ఇచ్చిన దస్తావేజుల్లో ఉన్న ఒక చిన్న సాంకేతిక అంశాన్ని ఆసరా చేసుకుని దళారులు దోపిడీ చేయడంపై ప్రభుత్వం, సీఆర్డీఏ తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. భూమి స్వభావం అనే కాలమ్‌లో 'అసైన్డ్' అనే పదాన్ని తొలగించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేదంటే సీఆర్డీఏ అధికారులు, సంబంధిత మంత్రి దీనిపై స్పష్టమైన ప్రకటన, దళారులకు హెచ్చరిక చేయాలని కోరుతున్నారు.

సర్దుబాటు ఎప్పుడో!

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలు నడుస్తున్నాయి. ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు సక్రమంగా లేకపోవడంతో ఒక్కో పాఠశాలలో ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు బోధనకు దూరంగా ఉంటున్నారు. ఆయా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఈ ఏడాది జనవరిలో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మండలాల వారీగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీల సంఖ్యను తెలియజేయాలని కోరుతూ ఎంఈఓలకు, డిప్యూటీ ఈఓలకు విద్యాశాఖ నుంచి లేఖలు వెళ్లాయి. దీంతో వెంటనే మండల స్థాయిలో ఉన్న పాఠశాలలను పరిశీలించి ఎంఈఓలు ఖాళీల వివరాలను సేకరించారు. దాదాపు ఉమ్మడి జిల్లాలో 60 పైగా ఖాళీలు ఉన్నట్లు తేలింది. ఇక్కడ పనిచేస్తున్న ఎయిడెడ్ ఉపాధ్యాయులని సమీపంలోని ఉన్నత పాఠశాలలు లేదా ప్రాథమిక పాఠశాలలో సర్దుబాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఈలోగా బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఈ ప్రతిపాదనలను పక్కన పెట్టారు. బదిలీల ప్రక్రియ పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా.. సర్దుబాటు ప్రక్రియపై విద్యాశాఖ దృష్టి సారించడం లేదని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఖాదర్ బాషా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కుంకలమర్రు(పర్చూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై ఖాదర్ బాషా అన్నారు. బుధవారం కారంచేడు మండలంలోని కుంకలమర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలతోపాటు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యతో మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి వీల్‌చైర్ అందజేత

మార్టూరు,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మార్టూరుకు చెందిన యలగాల వెంకటేష్ అనే బాలునికి 6 వేల రూపాయలు విలువచేసే వీల్‌చైర్‌ను అందజేశారు.దానికి బాల కోటిరెడ్డి ఆర్థిక సహకారం అందచేసినట్లు క్లబ్ అధ్యక్షులు సాంబశివరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో చెరుకూరి నాగేశ్వరరావు, రావి అంకమ్మచౌదరి, జాష్టి సాంబ శివరావు, వంకాయలపాటి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన మరో లారీ

● డ్రైవర్‌కు స్వల్పగాయాలు

ఒంగోలు క్రైం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. దీంతో లారీ క్యాబిన్ దెబ్బతినడమే కాకుండా డ్రైవర్ అందులో ఇరుక్కుపోయడు. ఈ సంఘటన ఒంగోలు నగరం దశరాజుపల్లి వద్ద గల జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్ వద్ద బుధవారం జరిగింది. చెన్నయ్ నుంచి హుజూర్‌నగర్ మట్టంపల్లి వెళుతున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. దీంతో వెనుక ఉన్న లారీ క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వచ్చి కట్టర్‌సాయంతో సురక్షితంగా బయటకు తీశారు. అయితే డ్రైవర్ ఎడమకాలుకు స్వల్పగాయమైంది. అబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

అవీ.. ఇవీ



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహం

● ఎమ్మెల్యే కొండయ్య

ఈపూరుపాలెం(చీరాల), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం సాగిస్తున్న చిన్నారులకు ఆదరణ అందిస్తామని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమంగా రాణించిన ఈపూరుపాలెం బాలుర ఉన్నత పాఠశాల ఐదుగురు, బాలికలు ఐదుగురికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విశ్రాంత ఆర్అండ్‌బీ సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ చేగూడి వెంకట సుబ్బయ్య ఆర్థిక సహకారంతో బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగంలో జిల్లాను రోల్ మోడల్‌గా ఉంచాలని సూచించారు. ప్రతి నిరుపేద విద్యార్థికి తోడుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ఎదగాలి

పంగులూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుపై దృష్టి సారించడంతో పాటు మంచి క్రమశిక్షణతో మెలగాలని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాల బాల బాలికలకు బుధవారం సైబర్ సెక్యూరిటీ, రోడ్డు భద్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, శక్తియాప్‌తో కలిగే రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు.హెచ్ఎం అనిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినోద్‌బాబు, ఉపాధ్యాయులు మాట్లాడారు.

ఇటుక బట్టీలతో కాలుష్యం

● రోడ్ల వెంబడి పొగతో వాహనచోదకుల ఇక్కట్లు

● తరచూ ప్రమాదాలు

అద్దంకి,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): రోడ్ల వెంబడే ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తుండటంతో వెలువడే కాలుష్యంతో వాహనచోదకులు ఇబ్బంది పడటంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారు. ఒకప్పుడు ఇటుక బట్టీలన్నీ అద్దంకి పట్టణం, తిమ్మాయపాలెంలలో అంతర్భాగంగా ఉండేవి. కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో పలు మార్లు ఆందోళనల తరువాత సుమారు 15 సంవత్సరాల క్రితం ఇటుక బట్టీలను దూరంగా ఏర్పాటు చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేశారు. ఈ నేపథ్యంలో ఇటుక బట్టీల ఏర్పాటు సయంలోనే కొన్ని నిబంధనలు కూడా రూపొందించి వాటికి అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తొలుత కొంతమేర నిబంధనలు పాటించిన ఇటుక బట్టీల యజమానులు అనంతరం నిబంధనలు ఒక్కొక్కటిగా తుంగలో తొక్కుతూ వచ్చారు. ప్రస్తుతం ఇటుక బట్టీలు అత్యధిక శాతం రోడ్ల మార్జిన్ లోనే ఏర్పాటు అయ్యాయి. ఇటుక బట్టీల యజమానులకు ఆయా ప్రాంతాలలో ఎకరాల విస్తీర్ణంలో స్థలాలు ఉన్నా బట్టీలు మాత్రం రోడ్డు వెంబడే ఏర్పాటు చేశారు. నిబంధనల మేరకు రోడ్డు నుంచి సుమారు 100 అడుగుల దూరంలో మాత్రమే ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకోవాలి. ఇటుక బట్టీలకు, రోడ్డుకు మధ్యలో కాలుష్యం రోడ్డుపైకి రాకుండా మధ్యలో గ్రీనరీ పెంచాలి. అయితే ప్రస్తుతం ఉన్న ఇటుక బట్టీలను చూస్తే 100 మీటర్ల దూరం దేవుడెరుగు కనీసం ఒక్క మీటరు దూరం కూడా వదలటం లేదు. రోడ్డు మార్జిన్ స్థలాన్ని కూడా వదలకుండా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా అద్దంకి పట్టణానికి సమీపంలో అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి, తిమ్మాయపాలెం సమీపంలో అద్దంకి-దర్శి ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి, తిమ్మాయపాలెం-కుంకుపాడు ఆర్ అండ్‌బీ రోడ్డు వెంబడి, తిమ్మాయపాలెం-మారెళ్ల రోడ్డు వెంబడి ఇటుక బట్టీలు ఉన్నాయి. ఇటుక బట్టీలు కాల్చే సమయంలో, లోడింగ్ సమయంలో దుమ్ము మొత్తం రోడ్ల పైకి వస్తుంది. దీంతో వాహనాల చోదకులు కళ్ళు మూసుకొని దేవుడి మీద భారం వేసి వాహనాలు నడపాల్సి వస్తుంది. ఆయా ప్రాంతాలలో జరిగే ప్రమాదాలలో ఎక్కువ శాతం దుమ్ములో ముందు వెళ్లే వాహనాలు, ఎదురు వచ్చే వాహనాలు గుర్తించలేక ఢీకొడుతున్నాయని పలువురు వాహనచోదకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనల మేరకు ఇటుక బట్టీలను ఆయా రోడ్లకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అద్దంకి-దర్శి ఆర్అండ్‌బీ రోడ్డు వెంబడి కాలుష్యంతో ఉన్న ఇటుక బట్టీలు



దేవదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డికి మెమెంటో అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నేతలు

చినగంజాం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డుండి రాకేష్‌లను మండల టీడీపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసారు. స్థానిక సీతారాముల దేవస్థానికి దేవదాయ శాఖ ద్వారా రెండు కోట్ల రూపాయిలు మంజూరు చేయించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలోని క్యాంపులో కార్యాలయంలో టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి, మెమెంటో అందజేశారు. వైశ్య కార్పొరేషన్ చైర్మన్ డుండి రాకేష్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌లను వారి క్యాంపు కార్యాలయాలలో మర్యాద పూర్వకంగా నాయకులు కలిసారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోటుమర్రి రామసుబ్బారావు, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, పల్లపోలు లక్ష్మీనారాయణ, శిఖరం సూరిబాబు, గంటా నరసింహారావు, వి.వెంకటరామానుజం పాల్గొన్నారు.

ఏసీబీ అధికారులమంటూ ఫోన్లో ఉద్యోగులకు బెదిరింపులు

బల్లికురవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హలో తాము ఏసీబీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం.. మీరు బాగా లంచాలు తీసుకుంటున్నారు అని మాకు ఫిర్యాదులు వచ్చాయి అంటూ ఉద్యోగులకు ఫోన్లు చేసి బెదిరింపులకు గురి చేస్తున్నారు. అదేంటి అని తిరిగి ప్రశ్నిస్తే ఏసీబీ డీఎస్పీ గారు చెప్పారు.. సీఐ గారు వస్తున్నారు మిమ్మల్ని అరెస్టు చేస్తామంటూ చెప్పటంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బుధవారం బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఇన్‌చార్జి ఎంపీడీవోకు 8296692501 ఫోను నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. మీపై ఏసీబీకి ఫిర్యాదులు వచ్చాయి అని బెదిరించారు. వెంటనే అదే కార్యాలయంలో సీనియర్ సహాయకులకూ అదే నెంబర్ నుంచి ఫోను వచ్చింది. నేను ఏసీబీ డీఎస్పీని మాట్లాడుతున్నాను మిమ్మల్ని అరెస్టు చేసేందుకు మా సీఐ వస్తున్నాడు.. మీరు ఎక్కడ ఉన్నారు అని కాల్ వచ్చింది. ఒక్కసారిగా ఆందోళన చెందిన అయన వెంటనే తేరుకొని రండి మేము కార్యాలయంలోనే ఉన్నాం అంటు తిరిగి సమాధానం చెప్పడంతో పాటు మేము పోలీసు స్టేషన్ వద్దకు వెళుతున్నాం అని చెప్పటంతో వెంటనే కాల్ కట్ చేశారు. కొద్ది సేపటికి శిక్షణలో ఉన్న ఎంపీడీవోకు అదే నెంబర్ నుంచి ఫోను చేసి ఉపాధి హామీ పథకంలో ఉన్న పై అధికారుల నెంబర్లు కావాలి నేను ఏసీబీ కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నాను అని చెప్పటంతో ఎంపీడీవో నేను కార్ డ్రైవింగ్‌లో ఉన్నాను అని చెప్పటంతో కాల్ కట్ చేశారు. వచ్చిన ఫోను నెంబర్‌కు ఉద్యోగులు ఫోన్లు చేస్తే ఎవరూ ఎత్తటం లేదని, ట్రూ కాలర్ ద్వారా చెక్ చేస్తే ఏఎస్ అని పేరు పెట్టి ఉందని వారు తెలిపారు. ఉద్యోగులను బెదిరింపులకు గురి చేసి వారి వద్ద నగదు కాజేయాలని ఎవరో ఇలా రోజూ ఫేక్ కాల్స్ చేస్తున్నారని పలువురు అంటున్నారు.

సీవీడ్ సాగుతో మత్స్యకారులకు జీవనోపాధి

● పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి



సీవీడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) :పెదగంజాం సముద్ర తీరప్రాంతంలో సీవీడ్ సాగుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని , దీని ద్వారా స్థానిక మత్స్యకారులకు, రైతులకు కొత్త ఆదాయ వనరులు ఏర్పడతాయని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఏటిమొగ గ్రామంలోని సీవీడ్ కల్చర్ యూనిట్‌ను(సముద్రపు నాచు పెంపకం) బుధవారం ఆయన సందర్శించి, సముద్రంలో రాఫ్ట్ అండ్ మోనోలిన్ సాగుపై సీవీడ్ ఎంటర్‌ప్రెన్యూర్ వాటాదారులతో మాట్లాడారు. సాగు విత్తనోత్పత్తి, మార్కెటింగ్, ప్రాసెసింగ్ తదితర అంశాలపై స్థానిక రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తీరప్రాంతంలో సీవీడ్ సాగు స్వల్ప వ్యయంతో పర్యావరణానికి హాని లేకుండా చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై రాఫ్, పైపులు, వెదురుకర్రలు, ట్యూబ్‌లైన్ అందించేలా చొరవ చూపాలన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలో జరుగుతున్న పోలేరమ్మ అమ్మవారి సంబరాల్లో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం నీలాయపాలెం వాగు మరమ్మతులు, రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, మంచినీటి ట్యాంకు పనులను పరిశీలించి, ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. సోపిరాల గ్రామంలో ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న టీడీపీ నాయకులు నరహరి శ్రీనివాసరావును ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి పి.గాలిదేవుడు, చీరాల మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.కృష్ణకిషోర్, కారంచేడు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.రవీంద్ర, సాగర్ మిత్రులు వై.వెంకటేష్, కౌసల్యపలు శాఖల అధికారులు, టీడీపీ చినగంజాం, ఇంకొల్లు మండల అధ్యక్షులు పొదవీరయ్య, నాయుడు హనుమంతరావు, నాయకులు పాల్గొన్నారు.

నిద్రమత్తులో ఆర్టీసీ బస్సును ఢీకొట్టి..



చిల్లచెట్లలోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు

● 20 మందికి స్వల్ప గాయాలు

● సమయస్ఫూర్తితో వ్యవహరించిన డ్రైవర్

● త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం

చీరాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల - పర్చూరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంతో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. తెల్లవారుజాము సమయాన చీరాల డిపో నుంచి సుమారు 25 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు నరసరావుపేటకు బయలు దేరింది. కారంచేడు పరిసర ప్రాంతంకు వెళ్లేలోపే ఎదురుగా వస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్ డ్రైవర్ హైదరాబాదు నుంచి చీరాలకు వస్తూ నిద్ర మత్తులో ఆర్టీసీ బస్సుమీదుకు వచ్చాడు. అయితే సమయస్ఫూర్తిగా వ్యవహరించిన ఆర్టీసీ డ్రైవర్ బస్సును వెంటను చిల్లచెట్ల వైపు మరల్చి వాహనాన్ని అదుపు చేశాడు. ఈక్రమంలో రెండు బస్సులు పాక్షికంగా దెబ్బతినడంతో పాటు రెండు బస్సుల్లో ప్రయాణిస్తున్న సుమారు 20 మంది స్వల్పంగా గాయపడ్డారు. అప్పటి వరకు నిద్ర మత్తులో ఉన్న ప్రయాణికులు సైతం ఒక్క సారిగా బస్ దిగి పరుగులు తీశారు. కొంత మందికి కళ్లల్లో బస్సుల అద్దం ముక్కలు గుచ్చుకున్నాయి. వెంటనే ఎవరికి వారు చీరాల్లోని పలు హాస్పిటల్లో చేరి చికిత్స పొందారు. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



ధ్వంసమైన ప్రయివేట్ బస్సు ముందు భాగం



దాడి జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

వీఆర్వోపై దాడి పలువురిపై కేసు నమోదు

పర్చూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వోపై పలువరు యువకులు దాడిచేసిన సంఘటనపై పర్చూరు పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసునమోదు అయ్యింది. పర్చూరు మండలం గర్నెపూడికి చెందిన అల్లడి పోతురాజు చీరాల మండలం ఈపూరపాలెం సచివాలయం -4లో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామం నుంచి ఈపూరుపాలెం వెళుతున్న ఆయనపై పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద దాడి చేశారు.. పర్చూరుకు చెందిన సాతులూరి సుజీత్, జ్యోతి మహేష్, తానికొండ అజేయ్ కుమార్‌తోపాటు, మరో ఇద్దరు తనపై దాడిచేసి గాయపరిచినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై జీవీ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడి జరిగిన ప్రాంతాన్ని ఎస్సై, ట్రైనీ ఎస్సై, వీర్వోల ఆధ్వర్యంలో పరిశీలించి వివరాలు సేకరించారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులపై దృష్టి

అద్దంకిటౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని బాపట్ల జిల్లా సహిత విద్యా సమన్వయకర్త మట్టా జ్యోత్స్న అన్నారు. బుధవారం స్థానిక సత్రం బడి ఆవరణంలో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జ్యోత్స్న పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో 4 మున్సిపాలిటీలలో ఆటిజం సెంటర్లు మంజూరు అయ్యాయని, ఒక్కొక్క సెంటర్‌కు రూ. 27.75 లక్షలు మంజూరు అ యినట్లు తెలిపారు. అనంతరం కాన్పూర్ ఆలెంకో సంస్థ నుంచి వచ్చిన వైద్యులు ప్రియా వర్మ, తుషార్ వర్మలు వైకల్యం కలిగిన విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అర్హత కలిగిన వారికి ఉపకరణాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్లికురవ మండల ఎంఈవో కె. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎం. ధనలక్ష్మి, బాబురావు, ఐఈఆర్‌టీలు కొంగల శ్రీనివాస్, పాలపర్తి యోనా, ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా సహిత విద్యా సమన్వయకర్త మట్టా జ్యోత్స్న

నేడు మండలంలో మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండలంలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ముప్పవరం, 10.30 నిముషాలకు జాగర్లమూడివారిపాలెం, 11 గంటలకు కొరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామాలలో మంత్రి పర్యటించనున్నారు. అనంతరం 12 గంటలకు సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అతిథిగృహంలో జరిగే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

రాష్ట్రంలో కక్ష సాధింపుల పాలన

చీరాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం ప్రజా సమస్యలను గాలికి వదిలి వైసీపీ నేతలపై కక్ష సాధింపులకే సమయం కేటాయిస్తున్నదని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలోని కావూరివారిపాలెం, దేశాయిపేట గ్రామాల్లో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వ్యవసాయ కూలీకి పాముకాటు

ఈపూరుపాలెం(చీరాల), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెం పొలాల్లో పని చేస్తున్న మహిళ కూలీ పాము కాటుకు గురైంది. బాపట్ల మండలం సూర్యలంక రోడ్డులోని హనుమంతునగర్‌కు చెందిన శివపార్వతి సుమారు పది మందితో పనులకు వచ్చింది. ఈక్రమంలో ప్రమాదశాత్తు పాము కాటుకు గురి అయి స్పృహ కోల్పోగా సహ కూలీలు హుటాహుటిన చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

బల్లికురవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీలలో పనులు చేసే కార్మికులకు వెంటనే గుర్తింపు కార్డులు ఇచ్చి వారి భద్రతకు చర్యలు చేపట్టాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం బల్లికురవలో ఇటీవల జరిగిన క్వారీ ప్రమాదంపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన కూలీలకు వెంటనే రూ.50 లక్షల పరిహారం అందించాలన్నారు. ప్రమాదంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

పంగులూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయిన ఘటన బుధవారం 16వ నెంబరు జాతీయరహదారిపై చోటుచేసుకుంది. హైవే అంబులెన్స్ సిబ్బంది కోటేశ్వరరావు, మధుబాబు అందించిన సమాచారం మేరకు ముండ్లమూరు మండలం అగ్రహారం గ్రామానికి చెందిన జి.ఏడుకొండలు స్వగ్రామం నుంచి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. రేణంగివరం వద్ద పొగాకు కంపెనీ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం వెనుకనుంచి ఢీకొనడంతో గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో అద్దంకి వైద్యశాలకు తరలించారు.



తీవ్రంగా గాయపడిన ఏడుకొండలు

విద్యార్థులు చదువులలో రాణించాలి : ఆర్‌జేడీ

అద్దంకిటౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే వసతులను విద్యార్థులు సద్వినియోగపర్చుకుని చదువులో రాణించాలని ఆర్‌జేడీ పద్మావతి అన్నారు. బుధవారం అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థుల స్వాగతం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌జేడీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేస్తుందని, దానిని సద్వినియోగపర్చుకోవాలన్నారు. ప్రతి రోజు కాలేజీకి వచ్చి హాజరు శాతాన్ని పెంచుకోవాలన్నారు. ముందుగా అధ్యాపకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మారిన సిలబస్‌కు అనుకూలంగా విద్యార్థులకు బోధన చేయాలన్నారు. అధ్యాపకులు ఉదయం సాయంత్రం విధిగా ఎఫ్ఆర్ఎస్ వేయాలన్నారు. సిలబస్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. స్వాగత కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యు. కోటేశ్వరమ్మ, కె. రాజేశ్వరమ్మ, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మావతి, అధ్యాపకులు బుజ్జిబాబు, ఆనంద్, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో లాభాలు

అద్దంకిటౌన్: సేంద్రియ సాగు ద్వారా వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని కలవకూరు, శింగరకొండపాలెం గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలల్లో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. అన్నదాత సుఖీభవ పడని రైతులు గ్రీవెన్స్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏఈవో కోటేశ్వరరావు,వీఏఏలు సీత, ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

రామాంజనేయపురంలో చోరీ

● రైతు ఇంట్లో బంగారు, వెండి వస్తువుల అపహరణ

బల్లికురవ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో మంగళవారం రాత్రి చోరీజరిగింది. గుంటుపల్లి గురుమూర్తి అను రైతు ఇంటి బయట నిద్రిస్తుండగా వెనక వైపు నుంచి ఇంట్లోకి వచ్చిన దొంగలు బీరువాలో ఉన్న మూడు సవర్ల బంగారు వస్తువులు, 30 తులాల వెండి వస్తువులు, పది వేలు నగదును తస్కరించారు. బుధవారం ఉదయం ఇంట్లోకి వెళ్లిన గురుమూర్తి లోపల బీరువా తెరిచి ఉండటం చూసి చోరీ జరిగిందని గుర్తించి వెంటనే బల్లికురవ పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. చోరీ జరిగిన ఇంటిని సంతమాగులూరు సర్కిల్ సీఐ వెంకట్రావు, ఎస్ఐ నాగరాజులు పరిశీలించారు. బాపట్ల నుంచి క్లూస్ టీం సభ్యులు చోరీ జరిగిన బీరువా వద్ద వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



'సోమశిల'కు పెరిగిన వరద



అనంతసాగరం ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద పెరుగుతోంది. మంగళవారం 14,105 క్యూసెక్కులు వస్తుండగా బుధ వారానికి 15,461 క్యూసెక్కులకు చేరింది. దీంతో డ్యాం నీటిమట్టం 36.835 టీఎంసీలకు చేరుకుంది. ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 6,000, డెల్టాకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



నేతన్నకు ఊపిరి

పొరుగు రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. పరుగు ప్రపంచంతో పోటీపడుతూ ఎదుగుతోంది. ఆర్థికంగా నిలదొక్కుకుంటూ నమ్మినవారిని గట్టున పడేస్తోంది.

కానీ..

చేనేత... ఇందుకు పూర్తిగా విరుద్ధం. అగ్గి పెట్టెలో ఇమిడే చీరను నేసే నైపుణ్యం ఉన్నా నాలుగు రూపాయలు సంపాదించుకోలేని దైన్యం. కనీసం మూడు పూటలా పొట్టనింపుకోలేక నీళ్లు తాగిన రోజులు నేతన్నవి. కులవృత్తిని వీడలేక.. మరో పనికి వెళ్లలేక చెదలు పట్టిన.. పడుతున్న మగ్గం పట్టుకునే బతుకుబండి లాగుతున్నాడు. చేయి అందించి ఆదుకోవాల్సిన గత పాలకులు పూర్తిగా విస్మరించారు. ఉన్న సంక్షేమ పథకాలను తొలగించి, పన్నులపేరుతో మరింత కుంగదీశారు.

ఇప్పుడు..

ఆర్థికంగా చితికిపోయి బేలచూపులు చూస్తున్న నేతన్నకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందిస్తోంది. ఉచిత కరెంటు, ఇతర పన్నులు తొలగించడంతోపాటు వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు.

- చితికిన చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత
- జీఎస్టీ మినహాయింపు, ఉచిత విద్యుత్ ప్రకటనపై నేతన్నల ఆనందం
- 'త్రిఫ్ట్ ఫండ్'తో ఆర్థిక తోడ్పాటు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

సంగం, ఆగస్టు 6 : భారతీయ సంస్కృతి, సంప్రదాయంతో పెనవేసుకున్న చేనేత కళ పాలకుల అలసత్వం, చిన్నచూపు కారణంగా చేనేత రంగం రోజురోజుకు కునారిల్లుతోంది. స్వాతంత్ర్యోద్యమంలో 1905లో స్వదేశీ వస్తువుల వినియోగం, విదేశీ వస్తువులు బహిస్కరణకు నాంది పలికిన చేనేత నేడు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2015లో ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారు. చేనేతను సంరక్షించడంతోపాటు నేతన్నకు ప్రయోజనం కల్పించి చేనేత దుస్తులు ధరించేలా ప్రజలకు అవగాహన కల్పించేందు కోసమే ఈ దినోత్సవ లక్ష్యం. ఈ నేపథ్యంలో గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నాం.

జిల్లాలో వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రమపై అత్యధికంగా ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం సంగం, వింజమూరు, కోవూరు, పొటూరు, గుమ్మళ్లదిబ్బ, చెన్నూరు, ఆత్మకూరు, ఏఎస్ పేట, కావలియడవల్లి, కొత్తపేట, నారాయణరెడ్డిపేట, బుచ్చి తదితర ప్రాంతాల్లో సుమారు 7 వేల చేనేత కుటుంబాలు ఉన్నాయి. ఇందులో అధికారికంగా 3,700 మగ్గాలు ఉండగా మరో వెయ్యి ఉన్నాయి. వాస్తవానికి జిల్లాలో సుమారు 7వేల మగ్గాలు ఉండేవి. ప్రభుత్వాల నిర్లక్ష్యంవల్ల పూట జరగడం కష్టమై చాలామంది నేతన్నలు మగ్గం మూలన పడేసి ఉపాధి హామీ పథకం, తాపీ, వంట పని ఇలా ఇతర పనులకు వెళ్తున్నారు. వీరు కాకుండా మరో 5వేల కుటుంబాలు చేనేత ఉప కులాల వారు ఉన్నారు.



గత ప్రభుత్వ నిర్వాకం

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతోనే టీడీపీ హయాంలో చేనేతలకు అమలు చేసిన అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను నిర్ధాక్షిణ్యంగా రద్దు చేసింది. కేవలం నేతన్న నేస్తంతో సరిపెట్టింది. ఫలితంగా చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం చేనేత ముడి సరుకులు, ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధించింది. దీంతో ముడి నూలుపై రేట్లు పెరిగాయి. దీంతో పాటు ఉత్పత్తులపై కూడ జీఎస్టీ విధించడంతో నేతన్న నేసిన వస్త్రాలపై ధరలు పెరిగాయి. ధరల పెరుగుదల వల్ల ఉత్పత్తులకు మార్కెట్ పడిపోయింది. ఇంకేముంది... నేతన్నకు చేతినిండా పని కరువయ్యింది. ఫలితంగా కూలి రేట్లు తగ్గంతో నేతన్న ఆర్థిక ఊబిలో కూరుకుపోయాడు. దీని నుంచి గట్టెక్కేందుకు ఇతర వృత్తులకు వలస బాట పట్టారు.

రద్దు చేసిన పథకాలు

- ఐసీఐసీఐ బ్యాంకు లంబార్డ్ ఇన్సూరెన్స్ ఆరోగ్య పథకాన్ని పూర్తిగా ఆపేశారు. చేనేత కార్మికుడు రూ.100 చెల్లిస్తే ఏడాదిపాటు రూ.15 వేల వరకు ఆరోగ్య బీమా వర్తించేది. సాధారణంగా నేతన్నలు వృత్తిపరంగా రంగుల వల్ల ఊపిరితిత్తులు, కీళ్ల నొప్పులు, కంటిచూపు లోపం, టీబీ వంటి వ్యాధుల పాలవుతుంటారు. ఏ వైద్యశాలలో అయినా వైద్యం చేయించుకుని బిల్లు పెడితే రూ.15వేలు ఇచ్చేవారు.
- **బునకర్ బీమా యోజన :** ఈ పథకంలో రూ.80లకే ఇన్సూరెన్సు కల్పించేవారు. కుటుంబ యజమాని సాధారణ మరణానికి రూ.60 వేలు, ప్రమాదవశాత్తు అయితే 1.5 లక్షలు ఇచ్చేవారు.
- **ఎన్‌హెచ్‌డీసీ (నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ స్కీం) :** చేనేత కార్మికుడికి నూలు కొనుగోలు కోసం ఈ పథకం ద్వారా 10 శాతం రాయితీ ఇచ్చేవారు.
- **ఎన్‌సీడీసీ (నేషనల్ క్రెడిట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) :** కార్మికులకు ముద్ర యోజన రుణాల కింద రూ.50 వేల వరకు బ్యాంకు రుణాలు ఇచ్చేవారు.
- గతంలో మగ్గం నేసే కార్మికులకు వర్క్ షెడ్డు కోసం రూ.75 వేల ఇచ్చేవారు.
- 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు టీడీపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. వైసీపీ వచ్చాక ఆ జీవో ఊసే లేదు.
- వైసీపీ హయాంలో కేవలం 'నేతన్న నేస్తం' పేరుతో ఏడాదికి ఒక్కో చేనేతకు రూ.24 వేలు ఇచ్చేది. అయితే, అందులోనూ కోతలు విధించి, అర్హులను రోడ్డున పడేశారు.



చంద్రబాబు చేయూత

ఎన్నికల హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా తొలుత నేతన్నకు 100 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అమలు చేశారు. ఇప్పటికే జిల్లాలో 2 వేల కుటుంబాలు ఉచిత కరెంటు పొందుతున్నాయి. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం రాష్ట్ర సచివాలయంలో చేనేత శాఖపై రాష్ట్ర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సమీక్షలో నేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయనున్నారు. అదేవిధంగా చేనేత ముడి సరుకుల దిగుమతి, ఉత్పత్తులపై 5శాతం ఉన్న జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. అంతేకాదు నేతన్నల సంక్షేమ అభివృద్ధికి త్రిఫ్ట్ ఫండ్ పేరుతో రూ. 5 కోట్లు కేటాయించడం శుభపరిణామం.

త్రిఫ్ట్ ఫండ్‌తో ఆదాయం

ఈ పథకంలో చేనేత కార్మికుడు తన సంపాదనలో 8 శాతం నిర్దేశించిన బ్యాంకు ఖాతాలో పొదుపు చేయాలి. ఆ తర్వాత ప్రభుత్వం రెండు రెట్లు విడుదల చేస్తుంది. ఉదాహరణకు ఒక కార్మికుడు నెలకు రూ.వెయ్యి పొదుపు చేస్తే ఏడాదికి రూ.12 వేలు అవుతుంది. ప్రభుత్వం రెండు రెట్లు ఇస్తుంది అంటే రూ.24 వేలు అవుతుంది. మొత్తం లబ్ధిదారుడికి రూ. 36 వేలు అవుతుంది. ఈ సొమ్మును మూడు నెలలకు ఒకసారి తన అవసరాలతోపాటు పెట్టుబడిగా ఉపయోగించుకోవచ్చు.

గత పథకాలన్నీ అమలు చేయాలి



సంక్షోభంలో ఉన్న చేనేతను అదుకునేందుకు టీడీపీ ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు, జీఎస్టీ రాష్ట్ర ప్రభుత్వమే భరించడం హర్షదాయకం. త్రిఫ్ట్ ఫండ్ పథకంతోపాటు గత టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను తిరిగి అమలు చేయాలి. కష్టాల్లో ఉన్న నేతన్నను ఆదుకోవాలి.

- బీ బాలాజీ, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు

కుటుంబ పోషణ కష్టంగా ఉంది



మాస్టర్ వీవర్స్ ఇచ్చే కూలిపై జీవనం కష్టంగా మారింది. గతంలోలా చేనేత క్లస్టర్లు, ముద్ర యోజన వంటి పథకాలు అమలు చేస్తే సొంతంగా మగ్గం నేసుకుంటాం. ఆదాయం పెరుగుతుంది. అంతేగాక గతంలో మాదిరి బునకర్ యోజనా, ఆమ్‌ఆద్మీ వంటి పథకాలు, 50 ఏళ్లు నిండిన ప్రతి ఒకరికీ పింఛన్ ఇవ్వాలి.

- పెంచలమ్మ, నేత కార్మికురాలు, సంగం

- మరికొందరు నేతన్నల అభిప్రాయాలు 7లో

కడలూరు, కారైకల్ బోట్లను కట్టడి చేద్దాం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి
- నాలుగు జిల్లాల గంగపుత్రుల తీర్మానం
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చిన కడలూరు బోటు

బిట్రగుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కడలూరు, కారైకల్ మెటనైజ్డ్ హెవీమోటర్ బోట్లను సమష్టిగా కట్టడి చేద్దామని నాలుగు జిల్లాల మత్స్యకార పెద్దలు, కాపులు నిర్ణయం తీసుకున్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రాంగణంలో నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సంబంధించిన తీర ప్రాంత మత్స్యకార గ్రామకాపులు, పెద్దలతో బుధవారం పొద్దుపోయాక నిర్వహించిన సమావేశంలో 160 మత్స్యకార గ్రామాలకు చెందిన గంగపుత్రులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కడలూరు, కారైకల్ బోట్లు అనుమతులు లేకుండా ఆంధ్ర సముద్ర తీరంలో మెటనైజ్డ్ హెవీ మోటర్ బోట్లతో అక్రమంగా చేపల వేట సాగించడాన్ని అరికట్టేందుకు తమ అభిప్రాయాలను తెలియచేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. జూలై 31వ తేదీన ఇందుకూరుపేట మండలం కృష్ణాపురం వద్ద సముద్ర చేపల వేటకు కడలూరు మెటనైజ్డ్ హెవీ మోటర్ బోటు వచ్చిందని, స్థానిక మత్స్యకారులు ప్రాణాలకు తెగించి ఆ బోటును అడ్డగించి తీరం చేర్చుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తీరప్రాంత మత్స్యకార పెద్దలకు సమాచారం తెలియచేసి ఆగస్టు 1వ తేదీన కాపుల నిర్ణయం మేరకు జిల్లా మత్స్యశాఖ అధికారులచే కడలూరు బోటులోని చేపల వేటకు వచ్చిన వారిని పంపించినట్లు తెలిపారు. అందరి నిర్ణయం మేరకు కడలూరు బోటును 2న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చామన్నారు. కడలూరు, కారైకల్ హెవీమోటర్ బోట్లను ఎదుర్కోవడానికి ఫైబర్ బోట్ల సామర్థ్యం చాలదని, అందరి సహాయ సహకారాలతో మెటనైజ్డ్ బోటుతో సముద్రంలో కాపలా కాసేందుకు నిర్ణయం తీసుకున్నారు. మెటనైజ్డ్ బోటు కొనుగోలు చేయాలంటే రూ.1.5 కోట్లకుపైగా అవుతుందని పెద్దలు అంటున్నారు. కడలూరు, కారైకల్ బోట్లను ఎదురించేందుకు రెండేళ్ల క్రితం అల్లూరు మండలం ఇస్కపల్లిలో మత్స్యకారాల సమావేశంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. సముద్ర చేపల వేటలో మనవారి ఫైబర్ బోట్లు, వలలను చాలాసార్లు ధ్వంసం చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి కాబట్టి తమిళనాడు బోట్లను కడలూరు బోటుతోనే ఎదుర్కోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో అధికారులు మత్స్యకారులకు సహకరించాలని నాలుగు జిల్లాల గంగపుత్రులు కోరారు.



సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న మత్స్యకార పెద్దలు



జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చిన కడలూరు బోటు

అపోహలు వద్దు..

ప్రభుత్వం ఆదుకుంటుంది!

- 5 సెంట్ల భూమి, అందులో ఇంటినీ నిర్మిస్తాం
- జీవనభృతి కోసం ఒక్కో కుటుంబానికి రూ.6.5 లక్షలు
- యథావిధిగా నష్టపరిహారం పంపిణీ
- ప్రత్యేక అధికారితో అనుమానాల నివృత్తి
- జీవో ప్రకారం 4800 ఎకరాల భూమి సేకరిస్తాం
- ఉప్పరపాలెం ఎస్సీ కాలనీవాసులతో కలెక్టర్ ఆనంద్
- 80 మంది రైతులకు రూ.3 కోట్ల పరిహారం జమ

8లో..



ఉప్పరపాలెం ఎస్సీ కాలనీవాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన సబ్ కలెక్టర్ శ్రీపూజ

ఆగని దోపిడీ!



తుమ్మల పెంట రోడ్డులో వేస్తున్న లేఅవుట్‌కు తోలిన మట్టి

- యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు
- రైతుల పేరుతో మూడు చెరువుల్లో తరలింపు
- రియల్టర్లకు విక్రయిస్తున్న అక్రమార్కులు
- రాజకీయ ఒత్తిళ్లు, అధికారులకు మామూళ్లు

కావలి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారినా కావలిలో మాత్రం మట్టి, గ్రావెల్ దందా ఆగడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో చెరువులు, ప్రభుత్వ పొలాలు, పెద్ద పెద్ద తిప్పలు, చివరకు విమానాశ్రయ భూముల్లో సైతం గ్రావెల్‌ను కొల్లగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. అయితే, ఎన్డీఏ కూటమి హయాంలో అక్రమార్కుల ఆగడాలకు చెక్ పడిందని అనుకున్నా మరింత పేట్రేగిపోతున్నారు. చెరువుల్లో మట్టిని కొల్లగొట్టి రియల్టర్లకు విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు.



మట్టి సరిచేసిన తోలిన గ్రావెల్

రైతుల ముసుగులో..

కావలి మండలంలోని తాళ్లపాలెం, మన్నెంగిదిన్నె, కావలి పెద్ద చెరువులలో కొందరు రైతుల పేరుతో మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకున్నారు. వాస్తవంగా చెరువులలోని మట్టిని పొలాలకు తోలుకుంటే చేనుకు మంచి సత్తువ ఇస్తుంది. అది ప్రభుత్వ ఉద్దేశం కావటంతో క్యూబిక్ మీటరుకు ఒక రూపాయి వంతున ఆ మట్టిని రైతులు తోలుకునేందుకు నీటిపారుదల శాఖ అధికారులు అనుమతులు ఇస్తారు. అయితే దానిని అడ్డం పెట్టుకుని కొంత మంది రైతుల పేరుతో అనుమతులు తీసుకుంటున్నారు. ఆ మట్టిని తీసుకెళ్లి లేఅవుట్లకు విక్రయిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు, అధికారులకు మామూళ్లు అందుతుండటంతో ఎవరూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే మొక్కుబడిగా అక్కడకు వెళ్లి కొంతసేపు ఆపి ఆ తర్వాత వదిలేస్తుండటంతో ఈ అక్రమ మట్టి, గ్రావెల్ తరలింపులు యథేచ్ఛగా సాగుతోంది. గ్రావెల్‌కు అయితే ఎక్కడా అనుమతులు తీసుకోకుండానే రాత్రిళ్లు టిప్పర్లు పెట్టి అక్రమంగా తరలిస్తున్నారు. కావలి తాళ్లపాలెం చెరువు నుంచి ప్రతిరోజూ 60, 70 ట్రాక్టర్లు తుమ్మలపెంట రోడ్డులో ఆముదాలదిన్నె ప్రాంతంతో వేస్తున్న లేఅవుట్లకు మట్టిని తరలిస్తున్నాయి. తొలుత మట్టిని తోలి దానిని చదును చేసిన తర్వాత దానిపై గ్రావెల్ తోలి లేఅవుట్లను సిద్ధం చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

పట్టపగలే లేఅవుట్లకు అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులకు రాజకీయ ఒత్తిళ్లతోపాటు ముడుపులు కూడా ముట్టుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఆ లేఅవుట్లు పంచాయతీ పరిధిలో ఉండటంతో వారికి కూడా ముడుపులు ముడుతున్నట్లు ప్రచారం ఉంది. వాస్తవంగా ప్రభుత్వానికి సీనరీ చెల్లించి లేఅవుట్లకు మట్టి, గ్రావెల్ తోలుకుంటే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కానీ సీనరీ కట్టి మట్టి తోలాలంటే ఎక్కువ ఖర్చులు అవుతున్నాయని వాటిలో సగం అధికారులకు అందచేస్తే వారు రెండు రోజులు కళ్లు మూసుకుంటే ఆ లే అవుట్‌లో మట్టి తోలకం పూర్తి చేయవచ్చన్న భావనలో రియల్టర్లు ఉన్నారు. దీంతో అక్రమంగా తరలిస్తున్న మట్టి, గ్రావెల్‌ను అదుపు చేసే వారే కరువయ్యారు.

లేఅవుట్లను విక్రయిస్తే చర్యలు

రైతుల పొలాల కోసం మట్టి తోలకానికి అనుమతులు తీసుకుని లేఅవుట్లకు తోలితే చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని పంపించి అక్రమంగా మట్టి తరలింపును అడ్డు కోవటమే కాక అవసరమైతే వారిపై కేసులు పెడతాం.

- ఎం. సన్నీ వంశీకృష్ణ, ఆర్డీవో, కావలి

ఎవరూ అనుమతులు తీసుకోలేదు

కావలి డివిజన్‌లో వ్యాపార అవసరాల కోసం మట్టి, గ్రావెల్‌కు ఎవరూ అనుమతులు తీసుకోలేదు. కావలి మండలంలో తాళ్లపాలెం, మన్నెంగిదిన్నె, కావలి పెద్ద చెరువులలో రైతుల పొలాలకు తోలుకునేందుకు మాత్రమే కొందరు అనుమతులు తీసుకున్నారు. గ్రావెల్‌కు ఎవరూ అనుమతులు తీసుకోలేదు. పొలాలకు అనుమతులు తీసుకుని వ్యాపారాలకు మట్టిని వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ఎం.ఖాన్, జలవనరులశాఖ, డీఈ, కావలి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	102
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212
కోడిగుడ్ల ధర (100): 475	

పీ-4 మార్గదర్శుల ఎంపిక సమర్థవంతంగా జరగాలి

అల్లూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమంలో కీలక భూమిక పోషించే మార్గదర్శుల ఎంపిక సమర్థవంతంగా జరగాలని తహసీల్దారు లక్ష్మీ నారాయణ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో పీ-4 సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శుల రిజిస్ట్రేషన్‌పై స్పష్టత ఉండాలన్నారు. పేదల జీవితాలను మార్చే ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఉమామహేశ్వరరావు, డీటీ ప్రవీణ్ కుమార్, డీడీవో వరప్రసాద్ పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించండి

● సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని మాలకొండరాయునిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, యర్రారెడ్డిపాలెం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని, సమయపాలన పాటించాలని చెప్పారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

వలేటివారిపాలెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడేవారిపాలెం, పోకూరు, రామచంద్రాపురం గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు ఈనెల 26వ తేది లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో మాధవీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడేవారిపాలెం ఎస్సీ కాలనీలోని హెల్పర్ పోస్టు ఎస్సీ, పోకూరు-2 బీసీ డీ, రామచంద్రాపురం జనరల్‌కు రిజర్వు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

● లింగసముద్రం(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల అంగన్వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టుకు ఈనెల 26వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని సూపర్‌వైజర్ ఏపీ రాధాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ఓసీకి కేటాయించారన్నారు.

మౌలానా గులాం రసూల్‌కు ఘన నివాళి

● జనాజాను మోసిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి


మౌలానా గులాం రసూల్ జనాజా మోస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, సీఐ ఫిరోజ్

కావలి(టౌన్), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కసాయి వీధిలో ఉన్న అక్సా మసీదు, మదరసా నిర్వాహకుడు, తబ్లీఖ్ జమాత్ జిల్లా బాధ్యుడు మౌలానా గులాం రసూల్‌కు పలువురు ఘన నివాళులు అర్పించారు. గుండె వ్యాధితో బెంగళూరులో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఆయన మృతి చెందారు. బుధవారం పార్థీవదేహాన్ని కావలిలోని తన స్వగృహానికి తీసుకువచ్చారు. మృత దేహాన్ని స్థానికులు, స్థానికేతరులు వేలాదిగా తరలివచ్చారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి విజయవాడ నుంచి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి దిగ్ర్భాంతి కలిగించిందన్నారు. ముస్లిం సంప్రదాయంలో జనాజా నమాజ్‌లో పాల్గొని జనాజాను తన భుజాలపై మోశారు. అంతిమ యాత్రలో జిల్లా, రాష్ట్రంలోని మతపెద్దలు, ముస్లిం ప్రజలు, ఇతరులు పాల్గొని నివాళులర్పించారు.

దళితులపై దాడులు హేయం


మాట్లాడుతున్న సీపీఎం నేత తాళ్లూరు మాల్యాద్రి

బిట్రగుంట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలపై మూకుమ్మడిగా దాడి చేయడం హేయమైన చర్య అని సీపీఎం కావలి డివిజన్ సీనియర్ నేత తాళ్లూరు మాల్యాద్రి అన్నారు. బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట దళితవాడలో బాధితులను బుధవారం సీపీఎం నాయకులు పరామర్శించారు. వారు మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ సిద్ధనపాలెంకు చెందిన కొందరు తెల్లగుంట దళితులపై దాడులు చేస్తే ఇంత వరకు చర్యలు చేపట్టకపోవడం దారుణం అన్నారు. ఏదైనా సమస్య ఉంటే పెద్దలు, పోలీసుల ద్వారా సామరస్యంగా చేసుకోవాలని, దాడులు చేయడం సరైన పని కాదని ఖండించారు. ఆయన వెంట సీపీఎం నాయకులు తుమ్మల వెంకయ్య, రాధాకృష్ణ, దళిత నేతలు బుర్రి వెంకటరావు, వీరంబొట్లు తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'


సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ అరుంధతివాడలో బుధవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు టీ.ప్యాట్రిక్, దేవరాల తిరుపతియాదవ్, బుర్రి వెంకటరావు, ఎం.ఇజ్రాయేల్, వీరంబోట్లు, ఎం.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో 75 శాతం కేంద్రం నిధులే..

● బీజేపీ నేత కందుకూరి

కావలి(టౌన్), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో 75 శాతం కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులేనని బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఓ హోటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరో నాలుగేళ్లలో నూతన ఆవిష్కరణలతో మరిన్ని అభివృద్ధి పనులను రాష్ట ప్రభుత్వం చేపడుతుందన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. లక్షలాది కోట్ల నిధులతో జాతీయ రహదారులతో సహా అన్ని రోడ్ల రూపురేఖలు మారనున్నాయన్నాయన్నారు. నూతనంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బెల్లంకొండ మాల్యాద్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రం నెల్లూరులో జరగనున్న రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటకు కావలి నుంచి వేలాదిగా బీజేపీ శ్రేణులు తరలివెళ్లేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సీవీసీ సత్యం, వీవీ రంగా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● రెండవ పట్టణ అధ్యక్షుడిగా లక్కరాజు భాస్కర్

కావలి రెండవ పట్టణ బీజేపీ అధ్యక్షుడుగా లక్కరాజు భాస్కర్ నియమితులయ్యారు. పార్టీ తన సేవలను గుర్తించి రెండవ పట్టణ అధ్యక్షుడుగా అవకాశం కల్పించినందుకు కావలితోపాటు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానన్నారు.

తాగునీరు కలుషితం!

● శుభ్రతకు నోచుకోని ఓవర్‌హెడ్ ట్యాంక్ ● పొంచి ఉన్న వ్యాధులు
● పట్టించుకోని పంచాయతీ అధికారులు, పాలకులు


క్లీనింగ్‌కు నోచుకోని వలేటివారిపాలెంలోని ఓవర్ హెడ్ ట్యాంక్

వలేటివారిపాలెం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని చిన్నపాలెం వద్ద ఉన్న ఓవర్‌హెడ్‌ట్యాంక్ శుభ్రతకు నోచుకోవడం లేదు. వాటర్ ట్యాంక్ నిచ్చెన మరమ్మతులకు గురవడంతో ఏళ్ల తరబడి వాటర్‌ట్యాక్‌ను క్లోరినేషన్ చేయలేదు. దీంతో వాటర్‌ట్యాంక్‌లో దుమ్ము దూళి, పిచ్చుకరెట్టలతో పాచిపట్టి అపరిశుభ్రత నెలకొంది. ఫలితంగా తాగునీరు రంగుమారి దుర్వాసన వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కలుషిత నీరు తాగితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. రంగుమారి దుర్వాసన వస్తున్న ఈ నీరు వినియోగానికి కూడా పనికిరావని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు ట్యాంక్ నిచ్చెన మరమ్మతులకు రూ.4 లక్షలు నిధులు మంజూరైనప్పటికీ పట్టించుకునేవారే లేరు. వాటర్‌ట్యాంక్‌లో పిడికెడు బ్లీచింగ్ వేసి క్లోరినేషన్ చేసిన దాఖలాలు లేవు. వాటర్ ట్యాంక్‌ను నెలకు రెండుసార్లు క్లోరినేషన్ చేయాలి. అయితే పంచాయతీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. లక్షలు వెచ్చించి వాటర్‌ట్యాంకు నిర్మించారే కానీ ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేయలేక పోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి మంజూరైన నిధులతో నిచ్చెన మరమ్మతులు చేయించి వాటర్‌ట్యాంక్‌ను బ్లీచింగ్, సున్నంతో క్లోరినేషన్ చేయించి గ్రామస్థులకు రక్షిత తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ట్యాంక్ నుంచి సరఫరా అయిన రంగుమారిన కలుషిత నీరు

అలరించిన కళా ప్రదర్శనలు

కందుకూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభలు ఈనెల 20 నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్న నేపథ్యంలో బుధవారం కందుకూరులో నిర్వహించిన ప్రజానాట్యమండలి కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రజానాట్యమండలి రాష్ట్ర కళాకారులకు స్థానిక సీపీఐ నాయకులు ఘన స్వాగతం పలుకగా పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్, ఎన్టీఆర్ విగ్రహం సెంటర్లలో కళాకారులు గజ్జకట్టి ఆడుతూ కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పీ.మాలకొండయ్య మాట్లాడు తూ అధికారంలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజలపక్షాన నిలిచి పోరాటాలు నిర్వహించేది కమ్యూ నిస్టు పార్టీ అని, సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగో లులో జరుగుతున్నందున యువకులు, విద్యావంతు లు, రైతులు, రైతుకూలీలు అధికసంఖ్యలో హాజరై పేదలపక్షాన నిలిచే పార్టీకి మద్దతివ్వాలని కోరారు. ప్రజానాట్యమండలి కళాజాతా పోకూరు, వలేటివారిపాలెం మీదుగా పామూరుకు చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆనంద్‌మోహన్, దుర్గాప్రసాద్, ఉప్పుటూరి మాధవరావు, బాలబ్రహ్మాచారి, కోటేశ్వరరావు, హరిబాబు, నరసయ్య, కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పోస్టాఫీసు సెంటర్‌లో కళాప్రదర్శన ఇస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు, సీపీఐ నాయకులు

వస్త్ర వ్యాపారంలో కావలికి మినీ ముంబైగా కీర్తి ప్రతిష్టలు

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో దొడ్ల రామచంద్రారెడ్డి(డీఆర్), వస్త్రవ్యాపార రంగంలో వైశ్యులు కావలికి కీర్తి ప్రతిష్టలు తెచ్చారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని అరుణోదయ క్లాత్ మార్కెట్ 44వ వార్షికోత్సవం బుధవారం ఆ మార్కెట్ సముదాయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ వైశ్యులు 44 ఏళ్ల కిందట కావలిలో అరుణోదయ మార్కెట్ సముదాయంను స్థాపించారన్నారు. అందరి ఆదరాభిమానాలు పొందుతూ వస్త్రవ్యాపారాన్ని మరింత విస్తరించి దినదినాభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం అక్కడ జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, వస్త్రవ్యాపారరంగ ప్రముఖులు కందుకూరి వెంకట సత్యనారాయణ, సీవీసీ సత్యం, బీజేపీ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో హిరోషిమా డే


మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌సెంటర్ డైరెక్టర్ తాతిరెడ్డి

కావలి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డులో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం హిరోషిమా డే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండా రెడ్డిలు మాట్లాడారు. వారు మాట్లాడుతూ జపాన్‌లోని హిరోషిమాపై అమెరికా వేసిన అనుబాంబుతో జరిగిన నష్టం గురించి వివరించారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు

లింగసముద్రం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మల్లికార్జునరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మండలంలో ఆధార్‌కార్డులు లేని గిరిజనులు, గిరిజనేతరులు వినియోగించుకోవాలన్నారు. ఈ కేంద్రంలో కొత్తగా పుట్టిన వారికి ఆధార్ తియ్యడంతోపాటు పాతవారికి మార్పులు చేర్పులు, బయోమెట్రిక్ నమోదు, ఫోన్ నెంబరు లింక్ చేయుంచుకోవచ్చని చెప్పారు. అయితే ఇటీవల జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో లింగసముద్రం-1 సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటు బదిలీపై వెళ్లిపోవడంతో ఈ సచివాలయంలో ఆధార్ సేవలు నిలిచి పోయాయి. దీంతో ఈ ఆధార్ కేంద్రం ఏర్పాటుతో మండలంలోని చాలా గ్రామాల ప్రజలకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.


ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి పెంపు


లింగసముద్రం : బాలామృతం అందజేస్తున్న రాధాదేవి


వలేటివారిపాలెం : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

లింగసముద్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ పెదపవని సెక్టార్ సూపర్‌వైజర్ ఏపీ రాధాదేవి చెప్పారు. బుధవారం మండలంలోని పెదపవని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం కొందరు గర్భిణులకు సీమంతం చేశారు. తల్లులకు బాలామృతం పాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● **వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి) :** బిడ్డకు ముర్రుపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని కొండసముద్రంలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, కార్యకర్తలు, ఆయాలు, బాలింతలు పాల్గొన్నారు.

● **కలిగిరి(ఆంధ్రజ్యోతి):** మండలంలోని రావులకొల్లులో బుధవారం తల్లిపాల వారోత్సవాలలు నిర్వహించారు. 5 ఏళ్ల లోపు చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. బాలామృతం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయిలక్ష్మి, ఎంపీహెచ్‌ఏ (యం) రియాజ్‌బాషా, ఏఎన్ఎం లక్ష్మి, ఆశావర్కర్ సురేష్, సర్పంచు వెంగపనాయుడు, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ, తదితరులు పాల్గొన్నారు.


కలిగిరి : గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి సాయిలక్ష్మి

చుండూరు మృతవీరులకు ఘన నివాళి

కందుకూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా చుండూరు దళిత మృత వీరులకు బుధవారం కందుకూరులో వివిధ దళిత సంఘాల నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దళిత నాయకులు మాట్లాడుతూ 1991లో చుండూరులో అగ్రకులాలు మాలపల్లెపై దాడిచేసి పోలీసుల సహకారంతో 9మంది మాలలను బరిసెలతో పొడిచి కత్తులతో నరికి అతిక్రూరంగా చంపేశారన్నారు. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న విద్యాధికుడు కోమెర్ల అనిల్‌కుమార్‌ను ఎస్పీ మీనా కాల్చి చంపడం అప్పటి దమనకాండకు నిదర్శనమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘోరకలిని చూసిన రమేష్ గుండెపోటుతో మృతిచెందగా మృతదేహాల పోస్టుమార్టం చేసిన డాక్టరు ఆత్మహత్య చేసుకున్నాడని రిపోర్టు ఇచ్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు లింగాబత్తిన బ్రహ్మయ్య, రేణమాల అయ్యన్న, పాలేటి కోటేశ్వరరావు, డీసీహెచ్ మాలకొండయ్య, మాధవరావు, హరిప్రసాద్, గేరా చిరంజీవి, బత్తల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న దళిత సంఘాల నేతలు



ఉపాధి నిధులతో పల్లెల్లో ప్రగతి

● బీ.సురేష్, ఎంపీడీవో

ఉలవపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులతో మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీవో బీ సురేష్ తెలిపారు.

? పంచాయతీల్లో అభివృద్ధి పనులు ఎలా సాగుతున్నాయి.

! మండలానికి మంజూరైన రూ.3 కోట్లు ఉపాధి హామీ పనుల నిధులతో గ్రామాల్లో 42 సిమెంట్ రోడ్లు పూర్తి చేశాం. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.7 లక్షలతో రామాయపట్నం, ఆత్మకూరు, బద్ధిపూడి గ్రామాల్లో కల్వర్టులు నిర్మించాం. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనల మేరకు రూ.1.87 కోట్లతో 11 పంచాయతీల్లో సీసీ రోడ్ల పనులకు ప్రతిపాదనలు పంపించాం.

? పంచాయతీల ఆదాయం పెంపునకు చేపడుతున్న చర్యలు ఏమిటి.

! ఉలవపాడు, కరేడు వంటి మేజర్ పంచాయతీల్లో ఇల్లు, కుళాయి పన్నుల రూపంలో, తీర ప్రాంతంలో హేచరీలు, జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాలు, పెట్రోల్ బంకుల నుంచి ఆదాయం సమకూరుతుంది. చిన్న పంచాయతీల్లో పన్నుల రూపంలో స్వల్ప ఆదాయం వస్తుంది. జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘం నిధులతో పారిశుధ్యం, మంచినీటి వ్యవస్థలను చక్కదిద్దుతున్నాం.

? సచివాలయ ఉద్యోగులను సక్రమంగా ఉపయోగించుకుంటున్నారా.

! వలంటీర్ల వ్యవస్థ లేనందున ప్రభుత్వం చేపట్టే ప్రతి పథకం ఆన్‌లైన్ పనులు సచివాలయం సిబ్బంది చేతనే చేయిస్తున్నాం. సకాలంలో పించన్లు పంపిణీ, జియోట్యాగ్, హౌస్‌హోల్డ్ సర్వే, ఆధార్ క్యాంపులు వంటి విధులు చేయిస్తున్నాం.

? సచివాలయాల అనుబంధ భవనాలను ఉపయోగంలో ఉన్నాయా.

! గ్రామ సచివాలయాల అనుబంధ భవనాలను ఆయా శాఖల పరిధిలో ఉపయోగించుకుంటున్నారు. పూర్తయిన రైతు సేవా కేంద్రాలను, హెల్త్ సెంటర్లు ఉపయోగంలో ఉన్నాయి.

? సచివాలయాల్లో అన్ని రకాల సేవలు అందిస్తున్నారా.

! సచివాలయాల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు అందుతున్నాయి.

గిట్టుబాటు కావడం లేదు



రోజంతా మగ్గం నేసినా రూ.300 కూడా గిట్టుబాటు కావడం లేదు. నేసిన చీరలకు మార్కెట్ లేకపోవడంతో మాస్టర్ వీవర్స్ ధరలు బాగా తగ్గించారు. గిట్టుబాటు కాక మరో పని చేయలేక చాలీచాలని కూలితో కుటుంబాన్ని పోషిస్తున్నాం

- ఏ శ్రీనివాసులు, నేత కార్మికుడు, సంగం

ముడి నూలుపై రాయితీ ఇవ్వాలి



ముడి నూలుపై గతంలో రాయితీలు ఇవ్వడం వల్ల ఏడాదికి సుమారు రూ.50 వేలు లబ్ధి చేకూరేది. దీంతో శ్రమకు తగ్గ కూలి గిట్టుబాటు అయ్యేది. అయితే, గత ప్రభుత్వం రాయితీ, సంక్షేమ పథకాలు రద్దు చేసింది. దీంతో ఆదాయం కోల్పోయాం.

- రంగనాయకమ్మ, చేనేత కార్మికురాలు, సంగం

మార్కెట్ వసతి కల్పించాలి




నేతన్నకు పెట్టుబడి ఇచ్చి ఉత్పత్తి చేసిన చీరలకు మార్కెట్ వసతి కల్పించాలి. ప్రతి జిల్లా కేంద్రంలో రైతు బజార్లు ఏర్పాటు చేసినట్టు చేనేత బజార్లు ఏర్పాటు చేయాలి. అందులో కార్మికులే నేసిన చీరలను విక్రయించే అవకాశం కల్పించాలి. రాయితీపై ముడినూలు సరఫరా చేయాలి.

- మాగం గిరి, చేనేత కార్మికుడు, సంగం

పాటూరులో చేనేత క్లస్టర్ ఏర్పాటు

కోవూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటూరు గ్రామంలో రూ.76 లక్షల వ్యయంతో చేనేత క్లస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పాటూరులో చేనేతల ఉత్పత్తులు పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో చేనేతలు ఆనందపడుతున్నారు. ఇప్పటికే పాటూరు, గుమ్మళ్ళదిబ్బ ప్రాంతాల నుంచి 175 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారికి రూ.30లక్షల మేర నిధులను కేటాయించారు. వారిలో 85మందికి స్టాండ్‌మగ్గాలు, జాకార్డ్ మిషన్లను అందచేశారు. అందరికీ యంత్రాలతో నడిచే రాట్నాలు అందించనున్నారు. రూ.1.2 లక్షలతో షెడ్డు నిర్మించేందుకు ముగ్గురికి నిధులు మంజూరు చేశారు.

ఎంతో ఆనందంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు రాయితీలు ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. పాటూరులో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేసి చేనేతలను ఆదుకోవడం అభినందనీయం. ఎప్పటినుంచో చేనేతల బతుకుల్లో వెలుగు నింపమని కోరుతున్నాం. చేనేత దినోత్సవం నాడు నేత వస్త్రాలనే ధరించాలని అంతా నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.

-కేవీ శేషయ్య, వృత్తి నిపుణుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు




మందారం పువ్వులు ఎన్నో రకాలో..



మొక్కలకు పూలందం.. మనసుకు ఆనందం!

పచ్చని మొక్కల మధ్య విరబూసే పూలు మనసును ఎంతో హాయి గొలుపుతాయి. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు బిజీ బిజీగా గడిపేవాళ్లు కాస్త ఆహ్లాదం కోసం పార్కులకు వెళతారు. ఇంకొందరు ఇంటి ముంగిట, మిద్దెపైన రకారకాల మొక్కలను పెంచుతూ ఆనందానుభూతి పొందుతారు. ఒకప్పుడు ఈ మొక్కల కొనుగోలుకు దూరప్రాంతాలకు వెళ్లవలసి వచ్చేది. కానీ ప్రజల అభిరుచులకు అనుగుణంగా చాలామంది వ్యాపారులు రకరకాల పూల మొక్కలను తెచ్చి రోడ్డుపక్కన విక్రయిస్తున్నారు. గులాబీలు, మందారం, చేమంతి, కనకంబరాలు, మల్లెలు ఇలా ఎన్నో రకాల దేశీ, విదేశీ పూలమొక్కలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)



పెద్ద మార్పునకు చిన్న ప్రయత్నం!

పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నియంత్రించేలా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ప్రయత్నం చేస్తోంది. పిల్లల ద్వారా పెద్దల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కూడా నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే అనర్థాలు, వ్యాధుల గురించి విద్యార్థులకు తెలియచేసి వారి ద్వారా పొగాకు బానిసల్లో మార్పు తెచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది.

- పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనారోగ్యం
- జిల్లాలో 8 లక్షల మందికిపైగా బానిసలు
- ఏటా రెండు వేల మందికిపైగా మృతి
- వినియోగ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమం
- విద్యార్థులకు అవగాహన తరగతులు
- చిన్నారుల ద్వారా పెద్దల్లో మార్పునకు ప్రయత్నం
- ప్రతిజ్ఞపై సంతకాల సేకరణ
- ఎక్కువ సంతకాలు చేయించే వారికి ప్రోత్సాహకం

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని తెలిసినా, అటు వైద్యులు.. ఇటు ప్రభుత్వాలు మొత్తుకుంటున్నా లక్షల మంది పొగ వదలడం మానడం లేదు. సిగరెట్.. గుట్కా... పాన్ మసాలా... కొన్ని రకాల కిళ్లీలు... వంటి పొగాకు ఉత్పత్తులు మనిషి మనుగడనే శాసిస్తున్నాయి. సరదాగా ప్రారంభమై వీటికి బానిసలవుతున్న ఎందరో చివరకు మృత్యువుకు చేరువవుతున్నారు. ఇలాంటి వారి వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.



పొగాకు ఉత్పత్తుల వాడకం అనర్థాలపై నెల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న అవగాహన తరగతి (ఫైల్)

నేటి ఆధునిక ప్రపంచంలో వయసుతో నిమిత్తం లేకుండా పిల్లలుసైతం పొగాకు ఉత్పత్తులకు బానిసలు కావటం కలవరపెడుతున్న సమస్య. జిల్లాలో 8 లక్షల మందికిపైగా పొగాకు ఉత్పత్తులకు బానిసలవుతున్నారంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారుతోందో అర్థం చేసుకోవచ్చు. పొగాకు ఉత్పత్తులలో ప్రమాదకరమైన 4వేల రకాల రసాయనాలు ఉన్నాయి. వీటి వాడకంతో శరీర అవయవాలు దెబ్బతిని జిల్లాలో ఏటా 2వేల మందికి పైగా మృతి చెందుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎలాగైనా పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని మానించాలని యత్నిస్తోంది.

విద్యార్థులతో చైతన్యం

పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించేందుకు 7,8,9 తరగతుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. గత నెల (జూలై) 1వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జిల్లాలోని 2594 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ అవగాహన తరగతులను నాన్ కమ్యునల్ డిసీజస్(ఎన్‌సీడీ) విభాగం చేపట్టింది. దీనిద్వారా 20వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించింది. 'ఇకపై పొగాకు ఉత్పత్తులు వినియోగించము' అనే సారాంశంతో విద్యార్థులు ఒక ప్రతిజ్ఞ పత్రాన్ని తయారు చేసుకుని కుటుంబ సభ్యులతోపాటు చుట్టు పక్కల వారి నుంచి పెద్ద ఎత్తున సంతకాలు సేకరించాల్సి ఉంటుంది. పిల్లల మాట పెద్దలు వింటారన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టింది. ప్రతిజ్ఞ పత్రంపై ఎక్కువ సంతకాలు చేయించిన విద్యార్థులకు నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం వారి నుంచి కానుకగా ప్రత్యేక స్కూల్ బ్యాగులను అందిస్తోంది. ఆ బ్యాగులను ఈ నెల 15వ తేదీన అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అత్యధిక సంతకాలు చేయించిన వారిని మండలానికి ముగ్గురి చొప్పున ఎంపిక చేసి విద్యాశాఖ అధికారుల ద్వారా బ్యాగులు అందజేయనున్నారు. కాగా, పొగాకు ఉత్పత్తుల బానిసలకు నెల్లూరు జీజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌లో ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నారు.



ఎక్కువ సంతకాలు చేయించిన విద్యార్థులకు ఇచ్చే ప్రోత్సాహక బ్యాగు

తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నం



పొగాకు ఉత్పత్తుల వాడకం నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే వారు తల్లిదండ్రులు, ఇతర పెద్దలకు తెలియ చేసే అవకాశం ఉంది. పిల్లలు చెబితే పెద్ద వారు వింటారన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. పొగాకు ఉత్పత్తులను ఇక వాడమంటూ ప్రతిజ్ఞ పత్రంలో సంతకాలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో పొగాకు వినియోగించే వారు చాలా ఎక్కువ మంది ఉన్నారు. వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం.

- డాక్టర్ యశ్వంత్, ఎన్‌సీడీ ప్రాజెక్టు అధికారి

అడవి పందులను ఢీకొని మోటారు సైక్లిస్ట్ మృతి

మృతుడు ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండల వాసి

లింగసముద్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అడవి పందులను ఢీకొని మోటారు సైక్లిస్ట్ మృతి చెందిన ఘటన మండలంలోని మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్ సమీపంలో బుధవారం జరిగింది. బంధువులు, పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండలం గుంటూరులింగనపాలెంకు చెందిన కరణం నరసింహం(53) పీసీ పల్లి నుంచి మాలకొండ అడ్డ రోడ్డు మీదుగా మొగిలిచెర్లకు మోటారుసైకిల్‌పై వెళుతుండగా గ్రామానికి కిలోమీటరు దూరంలో షడన్‌గా రోడ్డుపైకి అడవి పందులు వచ్చాయి. దీంతో ఏమిచేయాలో తెలియని నరసింహం కంగారులోమోటారు సైకిల్‌తో వాటిని ఢీకొని కిందపడి పోయాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయంలో సమీపంలో ఉన్న కొందరు మొగిలిచెర్ల గ్రామస్థులు గమనించి నరసింహంను పక్కకు తీసి వివరాలు తెలుసుకొని బంధువులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు నరసింహంను చికిత్స నిమిత్తం 108లో లింగసముద్రం పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దీంతో బంధువులు లింగసముద్రం ఎస్‌ఐ నారాయణకు ఫిర్యాదు చేశారు. ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.



మొగిలిచెర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నరసింహం

ఉపాధ్యాయ, క్రీడా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవం నాడు రాష్ట్రస్థాయిలో అందించే అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో కోరారు. ఇప్పటికే అర్హతలకు సంబంధించిన వివరాలను అన్నీ పాఠశాలలకు పంపించామని తెలిపారు. అర్హులైన వారు శుక్రవారం సాయంత్రం 5గంట ల్లోపు వారి ప్రతిపాదనలను ఉప విద్యాశాఖాధికారులకు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు www.deo.nellore.50webs.comలో పరిశీలించాలని తెలిపారు.

- స్వాతంత్ర్య దినోత్సవం నాడు అందించే క్రీడా అవార్డులకు జిల్లాలో విశిష్ట సేవలందించిన క్రీడా సంఘాల నుంచి మూడు కేటగిరిల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేటగిరి-1లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించిన క్రీడా సంఘం, కేటగిరి-2లో జిల్లాలోని క్రీడా సంఘాల్లో అత్యధికసార్లు జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించిన క్రీడా సంఘం, కేటగిరి-3లో జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులను తయారు చేసేందుకు అత్యధికంగా క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించిన సంఘం దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సమాంతరంగా అసోసియేషన్లు కలిగి ఉండేవారు ఈ అవార్డులకు అనర్హులని తెలిపారు. అదేవిధంగా కోర్టు వివాదాల్లో ఉండేవారు, డీఎస్‌ఏ, ఒలంపిక్ సంఘం గుర్తింపు లేని వారు అనర్హులని ప్రకటించారు. అర్హులైన వారు సంబంధిత ధ్రువీకరణలతో ప్రతిపాదనలను ఈనెల 8వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు డీఎస్‌ఏ కార్యాలయంలో అందచేయాలని కోరారు.



మురుగు కాలువలోనే మృతదేహాన్ని మరుభూమికి తీసుకెళుతున్న గిరిజనులు

మురుగులోనే మరుభూమికి..

బతికున్నప్పుడే కాదు... చనిపోయాక కూడా గిరిజనులకు కష్టాలు తప్పేలా లేవు. మండలకేంద్రమైన మనుబోలు చంద్రమౌళీనగర్ గిరిజనకాలనీలో ఎవరైనా చనిపోతే మరుభూమికి తీసుకెళ్లాలంటే ఈ చిత్రంలో చూపినట్లుగా గిరిజనులు మురుగునీటిలో అవస్థలు పడుతూ తీసుకెళ్లాలి. ఆ కాలనీలో సుమారు 400 కుటుంబాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పుకున్నా మరుభూమి దారి గురించి ఎవరూ పట్టించుకోలేదని గిరిజనులు వాపోయారు. కాలనీ నుంచి కిలోమీటరు దూరంలో గిరిజనుల శ్మశానం ఉంది. ఆ దారంతా ముళ్లచెట్లు, కాలువలు, గుంతల మధ్యలో నడుచుకుంటూ మృతదేహాలను తీసుకెళ్లాలి. ఎండాకాలమే ఇలా ఉంటే.. ఇక వర్షాకాలంలో చనిపోయిన వారిని తీసుకెళ్లాంటే గిరిజనుల ఇక్కట్లు చెప్పనలవికావు. ఇకనైనా పాలకులు, అధికారులు కరుణించి, శ్మశానానికి దారి కల్పించాలని వారు కోరుతున్నారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

కోడూరు గురుకులంలో ఆరుగురికి అస్వస్థత

తోటపల్లిగూడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు గురుకుల పాఠశాలలో మంగళవారం రాత్రి ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఫుడ్ పాయిజన్ లేదా తాగునీటి లోపాల వల్లే నలుగురు అతిసారాకు గురయ్యారని, ఇద్దరు విద్యార్థులకు విషజ్వరాలు వ్యాపించాయని ప్రభుత్వ వైద్యాధికారి తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు ఆరోగ్యం సరిగాలేదని, వారికి వైద్యం అందించేందుకు నెల్లూరు జీజీహెచ్‌లో చేర్పామన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల అధికారులు బుధవారం గురుకుల పాఠశాలను, పరిసర ప్రాంతాలను, వంటగదిని పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురై ఉంటారని తహసీల్దారు పద్మావతి తెలిపారు. గురుకుల పాఠశాలలో ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ఆమె తెలిపారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.



పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న తహసీల్దారు పద్మావతి

మద్యం షాపులో మందుబాబుల ఘర్షణ

బీరుబాటిళ్లతో దాడి, ఒకరికి తీవ్రగాయాలు

కావలిరూరల్: మండలంలోని ఆముదాలదిన్నెలో ఉన్న గౌడ మద్యం షాపులో బుధవారం మందుబాబులు ఘర్షణ పడ్డారు. బీరు బాటిళ్లతో దాడులు చేసుకోవడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని బాలకృష్ణారెడ్డి నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ కామంచి నవీన్ అతని స్నేహితులు, పట్టణంలోని పాలెంకు చెందిన పెయింట్ పనులకు వెళ్లే పులి మల్లికార్జున్ మరో ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా మద్యం దుకాణం వద్దకు వెళ్లారు. అక్కడ ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవలో బీరు బాటిల్‌తో నవీన్ తలపై కొట్టడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని వైన్స్ షాపు నుంచి బయటకు పంపడంతో రోడ్డుపై మళ్లీ ఘర్షణకు దిడారు. ఈ విషయాన్ని వారి సంబంధీకులకు తెలపడంతో మల్లికార్జున్ స్నేహితులు అక్కడ నుంచి పరారుకాగా అక్కడకు చేరుకున్న నవీన్ బంధువులు మల్లికార్జున్ మోటారు బైక్‌ను అడ్డగించి అతనిపై దాడిచేసి అతని బైక్‌పైనే బలవంతంగా ఎక్కించుకుని అక్కడ నుంచి వెళ్లిపోయారు. గాయపడిన నవీన్‌ను చికిత్స నిమిత్తం అతని బంధువులు ఏరియా వైద్యశాలకు తరలించారు. 1వ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం

● ఆర్టీసీ ఆర్ఎం షమీమ్

ఉదయగిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం పథకాన్ని అమలు చేస్తున్న దృష్ట్యా సర్వంసిద్ధం చేస్తున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ షేక్ షమీమ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గురువారం నాటికి రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా బస్సుల కండీషను, ప్రధాన డోర్లు, ఎమర్జెన్సీ డోర్లు, ఫుట్‌పాత్‌లపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సక్రమంగాలేని వాటికి మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. బస్సులకు పెయింటింగ్ చేసి అందంగా తీర్చిదిద్దుతామన్నారు. బస్సెక్కే మహిళల పట్ల డ్రైవర్, కండక్టర్ ఎలా నడుచుకోవాలి, జీరో పేమెంట్ టిక్కెట్ ఇవ్వడం తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా బస్సులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ల కొరతను దృష్టిలో ఉంచుకుని ఆన్‌కాల్ డ్రైవర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు 24 కొత్త బస్సులు మంజూరు కాగా ఉదయగిరి డిపోకు 7 బస్సులు కేటాయించామన్నారు. అనంతరం బస్సుల మరమ్మతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ నాగభూషణం, సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



బస్సు మరమ్మతులు పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్ఎం షమీమ్

అపోహలు వద్దు.. ప్రభుత్వం ఆదుకుంటుంది!

- 5 సెంట్ల భూమి, అందులో ఇంటినీ నిర్మిస్తాం
- యథావిధిగా నష్టపరిహారం పంపిణీ
- ప్రత్యేక అధికారితో అనుమానాల నివృత్తి
- ఉప్పరపాలెం ఎస్సీ కాలనీవాసులతో కలెక్టర్ ఆనంద్

ఉలవపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : 'అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుంది. మీలో ఏర్పడిన అపోహలు తొలగించేందుకు మీ వద్దకే వచ్చా'నని కరేడు శివారు గ్రామం ఉప్పరపాలెం ఎస్సీ కాలనీవాసులతో కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. బుధవారం కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజతో కలిసి ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలో కలెక్టర్ పర్యటించారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం తమకు కల్పించే వసతులు, ప్యాకేజీ గురించి వివరించాలని కాలనీవాసులు కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు క్రమంలో కరేడులోని 19 గ్రామాల్లో పొట్టేనుగుంట, రామకృష్ణాపురం, ఉప్పరపాలెం మూడు గ్రామాలు పరిశ్రమ పరిధిలోకి వచ్చినందున తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అయితే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకారం వసతులు, పరిశ్రమలో నిరుద్యోగులకు శాశ్వత ఉద్యోగ భృతి, నూతన కాలనీ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన ప్రభుత్వ విధి అని పేర్కొన్నారు. ఎస్సీ కాలనీలో డిగ్రీ వరకు చదివిన యువకులు సుమారు 30 మంది వరకు ఉన్నామని, నిర్మించబోవు పరిశ్రమలో శాశ్వత ఉద్యోగం కల్పించాలని కోరారు.

● వారిని ప్రత్యేక కుటుంబంగా పరిగణిస్తాం

ఒక ఇంట్లో 18 ఏళ్ల జరుగుతున్నా, నిండిన వారందరినీ ప్రత్యేకంగా ఒక్కో కుటుంబంగా లెక్కలోకి తీసుకొని ఒక్కొకరికి 5 సెంట్ల ఇళ్ల స్థలం, ఆ స్థలంలో ఇళ్ల నిర్మాణం, జీవన భృతి కోసం ఒక్కో కుటుంబానికి రూ.6.5 లక్షల పరిహారం ఇస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతేగాక ప్రస్తుతమున్న ఇళ్ల భవనాలు, ఖాళీ స్థలానికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చట్టం ప్రకారం రెట్టింపు పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని, దీనికితోడు ఎస్సీలకు ప్రత్యేక రాయితీ కూడా ఇచ్చే అవకాశం ఉందని అన్నారు. ఒకవేళ ఎవరికివారే ఇంటి నిర్మాణం చేపడితే ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.3.5 లక్షలు కేటాయిస్తుందని, వీటికి తోడు యథావిధిగా నష్ట పరిహారాలు అందుతాయన్నారు. ప్రభుత్వం భూమిని ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న వారికి కూడా 571 జీవో ప్రకారం పరిహారం కల్పించే వెసులుబాటు ఉంటుందని, చెరువులు, కుంట పోరంబోకు భూములకు మాత్రం ఈ జీవో వర్తించదని స్పష్టంగా చెప్పారు. వారం రోజులపాటు జల్లా స్థాయి అధికారి గ్రామంలోనే ఉండి కాలనీ వాసు ల అనుమానాలు, అపోహలు నివృత్తి చేస్తారంటూ అక్కడే ఉన్న తెలుగు గంగ డిప్యూటీ కలెక్టర్ మురళిని పరిచయం చేశారు.



విలేకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

● రైతులతో ప్రత్యేక సమావేశం

సోలార్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం 4800 ఎకరాలను సేకరించనున్నట్లు కలెక్టర్ రైతులకు స్పష్టం చేశారు. ఉప్పరపాలెం ఎస్సీ కాలనీ నుంచి నేరుగా కరేడు సచివాలయం-1లో కరేడు జాతీయ రహదారి పక్కన భూమి ఉన్న రైతులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ హైవే పక్కన బహిరంగ మార్కెట్‌లో రూ.2 కోట్లపైనే ధర ఉంటే ప్రభుత్వం రూ.60 లక్షల చెబుతోందని, దీనికి తాము సమ్మతంగా లేమని రైతులు చెప్పారు. అదీ హైవేకు ఆనుకొని ఉన్న భూములకు మాత్రమే రూ.60 లక్షలని, పైభూములకు రూ.20 లక్షల చొప్పునే పరిహారం ఉంటుందని చెప్పగా తమ భూములు ఇవ్వమని హైవే రైతులు కరాఖండిగా చెప్పారు. ఇది తొలి సమావేశమే కాబట్టి ఇంకా 2, 3 సమావేశాలలో చర్చించి ఒక అవగాహనకు వద్దామని రైతులకు కలెక్టర్ నచ్చచెప్పారు. అనంతరం బయటకు వచ్చిన కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం భూమి ఇచ్చేందుకు సమ్మతించిన 80 మంది రైతులకు రూ.3 కోట్లు వరకు పరిహారం వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. ఇంకా స్వచ్ఛందంగా భూములు ఇచ్చే రైతులతో మాటలు జరుగుతున్నాయన్నారు.